RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 25.06.2024 | సంపుటి : 10 సంచిక : 346 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## యూపీలో మరో లీకేజీ

- ఏకంగా ప్రింటింగ్ ప్రెస్ నుంచే కాజేశారు

**లక్నో(జనంసాక్షి):** కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నిరాశే మిగులుతోంది. వివిధ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకై, పరీక్షలు రద్దవుతుండటంతో తీవ్ర ఆవేదనకు గురవుతు న్నారు.ఓ వైపు 'నీట్ యూజీ-2024' ప్రవేశపరీక్షపై గంద రగోళం నెలకొన్న వేళ..

మిగతా 2లో..

## కేరళ ఇక.. కేరళం

- ఏకగ్రీవంగా ఆమోదించిన అసెంబ్లీ
- కేంద్రానికి తీర్మానం పంపిన తరవాత మార్పు



2లో

# పెండింగ్ సమస్యల్ని పరిష్కరించండి

## పలువురు కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ భేటి

- 2450 ఎకరాల రక్షణశాఖ భూములు బదలాయించండి
- వరంగల్ సైనిక స్కూల్ అనుమతులు పునరుద్ధరించండి
- రక్షణమంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన సీఎం
- 2.70 లక్షల ఇళ్లను మంజూరు చేయండి
- కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌కు వినతి



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.చిత్రంలో ఎంపీలు మల్లు రవి, రఘురామిరెడ్డి,బలరాంనాయక్, సురేష్‌షెట్కార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్

**ఢిల్లీ(జనంసాక్షి):** హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,500 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2, 462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ&జప్తి చేశారు. వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ మంత్రి

మిగతా 2లో..

## పాలన ప్రక్షాళన దిశగా అడుగులు

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి
- విద్యుత్ శాఖ కమిషనర్‌గా రొనాల్డ్ రోస్
- సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. 44 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. చేనేత, హస్తకళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించడంతో పాటు.. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ సుల్తానియాను నియమించారు. ఆయనకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించడంతో పాటు టీపీటీఆర్ఐ

మిగతా 2లో..

# విజన్ 2047

## వికసిత్‌భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతాం



- గత అనుభవం..సభ్యుల సహకారంతో ప్రజాసేవ
- 140కోట్ల ప్రజల ఆకాంక్షలు గుర్తెరిగి పనిచేస్తా
- రాజ్యాంగానికి అనుగుణంగా పాలన సాగిస్తా
- విపక్షాలు కూడా ప్రజల పక్షాన బలంగా నిలబడాలి
- పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వికసిత్ భారత్ సంకల్పం, కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. తమ పదేళ్ల పాలనానుభవం, కొత్త సభ్యుల ఆకాంక్షలు, దేశ ప్రజల ఆశల మేరకు ముందుకు సాగుతామని అన్నారు. మరింత కఠన శ్రమతో దేశానికి సేవచేస్తానని మోడీ ప్రకటించారు. కొత్త పార్లమెంటు భవనంలో లోక్‌సభ సమావేశాలు సోమవారం ప్రారంభం అయిన సందర్భం గా మోడీ మీడియాతో మాట్లాడారు. లోక్ సభ సభ్యులకు ప్రధాని మోడీ స్వాగతం పలికారు. ఇది చాలా పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరస్తామని, సామాన్య ప్రజల కలలు సాకారం చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మూడోసారి సేవచేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారని, సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని మోడీ వివరించారు. ప్రజలు మా విధానాలను విశ్వసించారని, సరికొత్త విశ్వాసంతో కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నామని, రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నామని, రేపటితో అత్యయిక పరిస్థితి 50 ఏళ్లు పూర్తివుతుందని, అత్యయిక పరిస్థితి ఒక మచ్చ అని, 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదని మోడీ తెలిపారు. 18వ లోక్‌సభ

మిగతా 2లో..

## లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

- కొత్త పార్లమెంట్ భవనంలో సభ్యుల ప్రమాణం
- తొలుత ప్రమాణం చేసిన ప్రధాని మోడీ
- వయనాడ్ స్థానానికి రాహుల్ రాజీనామా
- ఆమోదించినట్లు లోక్‌సభ స్పీకర్ ప్రకటన

2లో

## ప్రోటెం స్పీకర్ ఎంపికలో నిబంధనలు పాటించలేదు

పార్లమెంట్ ఎదుట ఇండియా కూటమి సభ్యుల నిరసన

2లో

# లీకేజీలు పట్టని మోదీ

## ఆయన శ్రద్ధ అంతా ప్రభుత్వాన్ని కాపాడుకోవడంపైనే : రాహుల్



**ఢిల్లీ(జనంసాక్షి):** ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి 15 రోజుల్లోనే పరీక్షల్లో అవకతవకలు, ఉగ్రదాడులు వంటివి చోటుచేసుకున్నాయని.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాత్రం తన ప్రభుత్వాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు.కేంద్ర సర్కారు రాజ్యాంగంపై దాడి చేస్తోందని ఆరోపిస్తూ.. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అంతకుముందు పార్లమెంటు ప్రాంగణంలోనూ రాహుల్ ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు.' 'రాజ్యాంగంపై దాడి ఆమోదయోగ్యం కాదు. రాజ్యాంగాన్ని ఏ శక్తి తాకలేదు. మేం దానిని కాపాడతాం. ఈ విషయంలో మా సందేశం ప్రజల వద్దకూ చేరుతోంది" అని మీడియాతో రాహుల్ పేర్కొన్నారు. అనంతరం 'ఎక్స్' వేదికగా ఎన్డీయే సర్కారుపై విమర్శలు గుప్పించారు. "అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే రైలు ప్రమాదాలు, కశ్మీర్‌లో ఉగ్రదాడులు, నీట్, యూజీసీ

మిగతా 2లో..

## నీట్ అవకతవకలపై లోతుగా దర్యాప్తు

వివిధ దశల్లో సీబీఐ విచారణ!

2లో

## తెలంగాణలో రహదారుల అభివృద్ధికి సహకరించండి

- విజయవాడ ఆరులైన్ల రహదారిని వెంటనే చేపట్టాలి
- ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి
- భారత్‌మాల స్థానంలో కొత్త విధానం రాబోతోందని వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రోడ్లు, రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'భారత్ మాల' స్థానంలో కొత్త విధానం రాబోతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..

మిగతా 2లో..



## కేజ్రీవాల్‌కు చుక్కెదురు

బెయిల్‌పై సుప్రీంలో లభించని ఊరట

**ఢిల్లీ(జనంసాక్షి):** మద్యం విధానానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో బెయిల్ అంశంపై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు.ఈ అంశంపై హైకోర్టు నిర్ణయం వెలువడ్డాకే తమ తీర్పు ఉంటుందని.. అప్పటివరకు వేచి ఉండాలని న్యాయస్థానం సూచించింది. ఒకవేళ ఆదేశాలు ఇస్తే అది ముందస్తు తీర్పే అవుతుందని అభిప్రాయపడింది. దీంతో కేజ్రీవాల్ ప్రస్తుతానికి తిహాడ్ జైలుకే పరిమితం కావాల్సి ఉంటుంది.మద్యం కుంభకోణం కేసులో

మిగతా 2లో..

## నేతన్నల ఆత్మహత్యలు ఆపండి

### సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. నేతన్నలవి ఆత్మహత్యలు కాదు.. అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని చెప్పారు. ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా ఆదుకోరా అని ప్రశ్నించారు. ఇప్పటిదాకా 10 మంది నేతన్నలు ఆత్మ బలిదానం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పది ఆత్మహత్యలు ప్రభుత్వం చేసిన హత్యలేనని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలకు

మిగతా 2లో..



3లో

## గతంలో మీరు చేసిందేంటీ!

మీహయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకున్నారు!

ఆనాడోక నీతి.. ఈనాడోక నీతా!

బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ

## రాజ్యసభాపక్షనేతగా జేపీ నడ్డా బాధ్యతలు



**ఢిల్లీ(జనంసాక్షి):** కేంద్ర మంత్రి, భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా రాజ్యసభా పక్షనేతగా బాధ్యతలు చేపట్టనున్నారు. పెద్దల సభలో ఇప్పటివరకు పీయూష్ గోయల్ సభాపక్ష నేత గా ఉండగా..

మిగతా 2లో..

## చర్చలు అసంపూర్ణం

కొనసాగనున్న జూనియర్ డాక్టర్ల సమ్మె

2లో




## సంజయ్ చేరికపై నాకు సమాచారమివ్వలేదు



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక

బుజ్జగిస్తున్న సీనియర్ నాయకులు

**జగిత్యాల(జనంసాక్షి):** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిక ఆ పార్టీలో చిచ్చు రేపింది. ఎమ్మెల్సీ పదవికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. ఈ విషయంపై తన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో చర్చలు విశ్వసనీయ వర్గాల ద్వారా

మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తలది కీలకపాత్ర

### ఓఆర్ఆర్ లోపల ఐటీ కంపెనీలకు ప్రాధాన్యం : మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర ఎంతో కీలకమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.వారికి వ్యాపారాల్లో తోడ్పాటునందిస్తామని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి మహిళలకు ప్రభుత్వం సహకారం ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం రూపొందించే పారిశ్రామిక విధానంలో మహిళలకు

మిగతా 2లో..

## పాలన ప్రక్షాళన
# దిశగా అడుగులు

డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన రొనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇక పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేనను కళాశాల, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్, అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమించారు. ఆయనకు టీపీటీఆర్ఐ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా ఉన్న రిజ్వీని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. జీఏడీ ముఖ్యకార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డిని నియమించారు. దాసరి హరిచందనను రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.

# సంజయ్ చేరికపై నాకు సమాచారమివ్వలేదు

తెలుస్తోంది.తనకు తెలియచేయకుండా సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంపై మండిపడ్డారు. భారాసకు చెందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తనకు సమాచారం లేకుండా ఆయన్ను పార్టీలో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఆయన తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గంలో 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్, జీవన్‌రెడ్డి ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నికల్లోనూ వీరిద్దరే పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయన్ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని వారు కోరినట్లు సమాచారం. 40 ఏళ్లు గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని.. పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్టీ అధినాయకత్వంపై అలకబూనినట్లు సమాచారం. ఈ క్రమంలో తన అనుచరుల ఫోన్ ఎత్తకుండా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే జీవన్ రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేస్తున్నాయి. జీవన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ వార్తలపై జీవన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. సంజయ్ చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, సంజయ్ చేరికపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నారు. దీంతో సోమవారం ఉదయం నుంచే జీవన్‌రెడ్డి ఇంటికి పార్టీ నాయకులు భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. అయితే ఈ విషయమై పార్టీ అధిష్ఠానం ఆయనతో మాట్లాడుతున్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపులపై జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే తన నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నదని, ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదని తెలిపారు. ఇలాంటి వాటిని తాను వ్యక్తిగతంగా ప్రోత్సహించనని స్పష్టంచేశారు. అయితే ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో జగిత్యాల రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించారు.

# కేజ్రీవాల్‌కు చుక్కెదురు

ట్రయల్ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే ఇవ్వడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, విక్రమ్‌చౌధరీలు హాజరుకాగా.. ఈడీ తరఫున అడిషినల్ సొలిసిటర్ జనరల్ రాజు వాదనలు వినిపించారు.ట్రయల్ కోర్టు బెయిల్ ఆర్డర్ చూడకముందే హైకోర్టు స్టే ఇవ్వగలిగినప్పుడు.. మీరెందుకు (సుప్రీం ధర్మాసనం) హైకోర్టు ఆర్డరుపై స్టే విధించలేరు? అని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. అంతేకాకుండా హైకోర్టు అలా స్టే విధించడం ఊహించని విషయమన్నారు. కింది కోర్టులో తనకు అనుకూల తీర్పు వచ్చినప్పుడు ఎందుకు వేచి ఉండాలని వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు నిర్ణయం కాస్త అసాధారణంగానే కనిపిస్తోందని.. అయినప్పటికీ ఒకవేళ హైకోర్టు తప్పిదం చేస్తే తాము దాన్ని పునరావృతం చేయాలా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఒకరోజు వేచిచూడడం వల్ల ఇబ్బంది ఏముందని, జూన్ 26న దీనిపై విచారణ చేపడతామని తెలిపింది. మరోవైపు కేజ్రీవాల్ బెయిల్ స్టేపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం నిర్ణయం వెల్లడించే అవకాశం ఉంది.

## కేరళ ఇక.. కేరళం

**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళ రాష్ట్రం పేరు మారుతోంది. కేరళ పేరును కేరళంగా మార్చే సవరణ బిల్లుకు కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇక కేంద్రం ఆమోదించడమే ఆలస్యం.. కేరళ పేరు కేరళంగా మారుతుంది. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళం గా మార్చాలని చిన్నచిన్న సవరణలతో సోమవారం కేరళ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. గతంలో ఈ బిల్లును కేంద్రానికి పంపగా దిద్దుబాట్లను ఎత్తి చూపుతూ తిరిగి పంపించింది. అయితే కేరళ అసెంబ్లీ కొత్త తీర్మానాన్ని ఆమోదించింది. రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ లో రాష్ట్రాన్ని అధికారికంగా కేరళం గా మార్చడానికి 2023 ఆగస్టు 9న కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మాణం చేసింది. రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని తీర్మానంలో కేంద్రాన్ని కోరింది. అదేవిధంగా ఎనిమిదో షెడ్యూల్‌లోని అన్ని భాషల్లో పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేశారు. అయితే వివరణాత్మక ధృవీకరణ తర్వాత అటువంటి సవరణ రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో మాత్రమే అవసరమని కనుగొనబడింది. అందుకే కొత్త తీర్మానం తీసుకువస్తున్నట్లు సీఎం వివరించారు. మలయాళంలో 'కేరళం' అనే పేరు సాధారణంగా వాడుకలో ఉందని సీఎం పినరయి తన తీర్మానంలో సూచించారు..

## నీట్ అవకతవకలపై లోతుగా దర్యాప్తు

దిల్లీ(జనంసాక్షి): నీట్ యూజీ–2024,నెట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలపై కేంద్రం ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తునకు సిద్ధమైంది. ఇప్పటికే లీకేజీకి ప్రధాన కేంద్రాలుగా అనుమానిస్తున్న బిహార్, గుజరాత్ రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపించింది. ప్రాథమిక ఆధారాలను సేకరించిన తర్వాత లోతుగా దర్యాప్తు చేపట్టనుంది. మొత్తం నాలుగు దశల్లో దర్యాప్తు చేపట్టనున్నట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ప్రశ్నాపత్రం తయారీ నుంచి వాటి ముద్రణ, దేశవ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాలకు వాటిని ఎలా పంపించారు? తదితర కోణాల్లో దర్యాప్తు చేపట్టనున్నారు. అంతేకాకుండా నీట్ పరీక్షపత్రం రూపకల్పన నుంచి ప్రింటింగ్,రవాణా,పరీక్షలకు ముందు భద్రత కల్పించివారిని అవసరం మేరకు విడివిడిగా విచారించే అవకాశముంది.

# పెండింగ్ సమస్యల్ని పరిష్కరించండి



రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి వెంట నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్,జహీరాబాద్, భువనగిరి, నల్గొండ, వరంగల్, పెద్దపల్లి ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్,సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి,కుందూరు రఘువీర్ రెడ్డి,కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి ఉన్నారు.

**2.70 లక్షల ఇళ్లను మంజూరు చేయండి**

2024–25 ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో తాము నిర్మించదల్చిన 25 లక్షల ఇళ్లలో 15 లక్షలు ఇళ్లు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజనను (పట్టణ)–పీఎంఏవై (యూ) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తీసుకున్నందున, 2024–25 సంవత్సరానికి పీఎంఏవై (యూ) కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. పీఎంఏవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానందున మిషన్ కాల పరిమితిని 2025, జూన్ వరకు పొడిగించాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ కింద వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని, కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని, ప్రజా ప్రయోజనార్థం పనులు ముగిసే వరకు మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో రహదారుల అభివృద్ధికి సహకరించండి

రాష్ట్రంలోని జాతీయ రహదారుల అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. హైదరాబాద్–విజయవాడ హైవేను 6 లైన్ల రహదారిగా మార్చాలని కోరాం. ఉప్పల్–ఘట్‌కేసర్ మధ్య రహదారి 40 శాతమే పూర్తయింది. ఈ విషయం మంత్రి వద్ద ప్రస్తావించగా.. రహదారి పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్ టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని గడ్కరీ ఆదేశించారు. మంగళవారం కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, భూపేంద్ర యాదవ్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరాం అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. తెలంగాణలో ఓటు షేర్ పెంచుకున్నాని సుస్థిర పాలన అందిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 2018 నుంచి రీజనల్ రింగ్ రోడ్ పై చర్చ జరుగుతుంది కానీ ముందుకు కదలడం లేదని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక రీజనల్ రింగ్ రోడ్ ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యం అయ్యిందని తెలిపారు. హైదరాబాద్ విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారిగా మర్చాలని రోజుకి 60 వేల వాహనాలు తిరుగుతాయని చెప్పారు. 17 ప్రమాద జోన్లను గుర్తించామని తెలిపారు. త్వరగా హైదరాబాద్ – విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారి పనులు చేపట్టాలని కోరామని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేక సమావేశం పెడతామని చెప్పారని తెలిపారు. 16 రోడ్లు పెండింగ్ లో ఉన్నాయని నూతన జాతీయ రహదారుల కోసం మరో సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారని అన్నారు. ఉప్పల్ – ఘాట్ కేసర్ ఫ్లయ్ ఓవర్ టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని అధికారులకు నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రేపు కిషన్ రెడ్డిని కలుస్తానని తెలిపారు. వచ్చే మూడేళ్లలో రీజనల్ రింగ్ రోడ్డు, విజయవాడ – హైదరాబాద్ 6 లైన్ల రహదారిని పూర్తి చేస్తామని చెప్పారు. ఇకపోతే తెలంగాణలో ఓటు షేర్ పెంచుకున్నాం.. సుస్థిర పాలన అందిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారిగా మార్చాలన్నారు.రోజుకూ 60 వేల వాహనాలు తిరుగుతాయని, 370 చోట్ల ప్రమాద జోన్లను గుర్తించినట్లు తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలుస్తామని, రేపు కిషన్ రెడ్డిని కలుస్తామని తెలిపారు. భుపెంద్ర యాదవ్‌తో అటవీ పర్యావరణ అనుమతుల గురించి చర్చిస్తామన్నారు. తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారానికి హాజరవుతునట్లు తెలిపారు. తాను అభివృద్ధి పనుల కోసం వచ్చానని స్పష్టం చేశారు. నేషనల్ హైవే నిధులు ఎక్కువగా తెలంగాణకు ఇవ్వాలని కోరామన్నారు.

## నేతన్న ఆత్మహత్యలు ఆపండి

రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు పోతున్న పట్టింపు లేదా అని ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో పదేళ్ల తర్వాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు– సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం కనపడుతోందని చెప్పారు. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఆపేసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన ప్రతి కార్యక్రమాన్ని వెంటనే రేవంత్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం తమపై కక్షతో నేతన్నల ప్రాణాలు బలిపెట్టవద్దని కేటీఆర్ హితవు పలికారు.

## రాష్ట్రాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తలది కీలకపాత్ర

తగిన ప్రాధాన్యమిస్తామన్నారు.హైదరాబాద్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు – సమ్మిళిత అభివృద్ధి' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.మహిళలకు వ్యాపారాల్లో తోడ్పాటునందిస్తామని తెలిపారు. వాళ్లు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు.ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. అందులో మహిళా పారిశ్రామికవేత్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. పారిశ్రామిక విధానంలో భాగంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా ఏర్పాటు చేస్తామన్నారు. ఓఆర్ఆర్ లోపల ఐటీ కంపెనీలకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో పరిశ్రమలు, మిగతా ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తామని శ్రీధర్‌బాబు వివరించారు.

# విజన్ 2047

తొలి సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులంతా ఇప్పటికే పార్లమెంట్ భవనానికి చేరుకున్నారు. ఇక వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న నరేంద్ర మోదీ కూడా పార్లమెంట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. దేశానికి మూడోసారి సేవచేసే భాగ్యాన్ని కల్పించినందుకు ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. 'ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ నిర్వహించాం. 65 కోట్ల మంది ఓటర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. మా విధానాలకు, అంకితభావానికి జనామోదం లభించింది. ప్రజలు మాకు వరుసగా మూడోసారి సేవచేసే అవకాశం కల్పించారు. ఇది చాలా పవిత్రమైన రోజు. కొత్త సభ్యులకు స్వాగతం. కొత్త ఆశలు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలి. అందరి సహకారంతో భరతమాత సేవలో పాల్గొంటాం. కొత్త లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా కృషి చేయాలి. 2047 వికసిత్ భారత్ సంకల్పం, లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. రాజ్యాంగానికి గౌరవం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాం. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతాం. భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేస్తాం' అని మోదీ తెలిపారు. ఎమర్జెన్సీ ద్వారా ప్రజాస్వామ్యంపై పడిన మచ్చకు 50 ఏళ్లు అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పట్లో ప్రజలను జైళ్లలో వేసినట్లు చెప్పారు. 50 ఏళ్లకిందట జరిగిన తప్పు మరెవరూ చేయకూడదన్నారు. మూడో దఫాలో మూడు రెట్లు అధికంగా పనిచేస్తామని ఈ సందర్భంగా మోదీ పునరుద్ఘాటించారు. జనహితం కోసం సభ్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. 18వ లోక్‌సభలో విపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలిసారిగా లోక్‌సభ ఎంపీల ప్రమాణస్వీకారం మన కొత్త పార్లమెంట్ భవనంలో జరగనుంది. ఈ శుభ సమయాన కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతాభినందనలు తెలియజేస్తున్నా. ప్రజలు మా విధానాలను విశ్వసించారు. దేశానికి మూడోసారి సేవ చేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారు. సరికొత్త విశ్వాసంతో నేడు కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నాం. రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నాం. ఈ సందర్భంగా విపక్ష ఎంపీలకు చురకలంటించారు. ఈ దేశానికి మంచి, బాధ్యతాయుతమైన విపక్షం అవసరం. ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు నడుచుకుం టాయని ఆశిసు_న్నా. డ్రామాలు, ఆటంకాలను ప్రజలు కోరుకోవట్లేదు. నినాదాలు ఆశించట్లేదు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విపక్షాలు కూడా సహకరించాలని ప్రధాని హితవు పలికారు.

## లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. కార్యక్రమాలను ప్రారంభించారు. సభ్యులు రాజ్యాంగం మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికలన సభ్యుల జాబితాను లోక్‌సభ సెక్రటరీ సభ ముందుంచారు. అలాగే రాహుల్ గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు భర్తృహరితో రాష్ట్రపతిభవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి ముర్ము ప్రమాణం చేయించారు. లోక్‌సభాపక్ష నేతగా ప్రధాని మోదీ తొలుత ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే ఎన్డీయే కూటమి సభ్యులంతా మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నామినేటెడ్ ప్యానల్ స్పీకర్లు ప్రమాణం చేశారు. అయితే విపక్ష ఎంపిలు కొందరు ఇందుకు ముందుకు రాలేదు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయించారు. మంత్రుల్లో తొలుత రాజ్‌నాథ్ సింగ్ తరవాత అమిత్ షా, గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు వరుసగా ప్రమాణం చేశారు. తొలిరోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో మంగళవారం ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించ నున్నారు. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు సముదాయంలోని పాత భవనం వద్ద కలుసుకుని, అక్కడి నుంచి నూతన భవనం వరకు ర్యాలీగా వచ్చారు. మొన్నటివరకు మహాత్మాగాంధీ విగ్రహం ఉన్న ప్రాంతంలో రాజ్యాంగం చిరు ప్రతులను చేతపట్టుకుని కొంతసేపు నిరసన చేపట్టారు. అనంతరం వీరంతా ఒకేసారి లోక్‌సభకు వెళ్లారు. సభ ప్రారంభం కాగానే కేరళలోని వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను స్పీకర్ ఆమోదించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ రాహుల్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరం వయనాడ్‌ను వదులకుని రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నారు.

# యూపీలో మరో లీకేజీ

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఫిబ్రవరి 11న జరిగిన రివ్యూ ఆఫీసర్/ అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ ప్రశ్న పత్రం లీకేజీలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం నలుగురు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు లీక్ చేసినట్లు విచారణలో తేలింది. పేపర్ లీకవ్వలేదని తొలుత అధికారులు చెప్పినప్పటికీ.. టాస్క్‌ఫోర్స్ ముమ్మర దర్యాప్తుతో నాలుగు నెలల తర్వాత అసలు నిజాలు బయటపడ్డాయి. మొత్తం రెండు చోట్ల పేపర్ లీకైనట్లు విచారణలో తేలింది. ప్రయాగ్‌రాజ్‌లోని బిషప్ జాన్సన్ గర్ల్స్ హైస్కూల్ కేంద్రంలో పరీక్ష ప్రారంభానికి 4 గంటల ముందే ప్రశ్నపత్రం బయటకొచ్చినట్లు అధికారులు తేల్చారు. అర్పిత్ వినీత్, యశ్వంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఫొటోలు తీసి కొందరు అభ్యర్థులకు చేరవేసినట్లు విచారణలో రుజువైంది. దీంతో అర్పిత్‌తో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరింత లోతుగా దర్యాప్తు చేపట్టిన అధికారులు విస్తుపోయే నిజాలను వెల్లడించారు. ప్రశ్నపత్రం ప్రింటింగ్ కేంద్రంలోనే లీకేజీ జరిగినట్లు గుర్తించారు. దీనికి నలుగురు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు రాజీవ్ నారాయణ్ మిశ్రా, సునీల్ రఘువంశీ, విశాల్ దుబే, సుభాష్ ప్రకాశ్‌లను కారకులుగా తేల్చారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 950కి.మీ దూరంలోని ఓ ప్రింటింగ్ కేంద్రంలో ప్రశ్నపత్రాలను ముద్రించబోతున్నట్లు ప్రధాన నిందితుడు రాజీవ్ నారాయణ్‌కు సమాచారం అందింది. ఎలాగైనా లీక్ చేయాలనుకున్నాడు. దీని కోసం తన స్నేహితుడు విశాల్ దుబే సాయం తీసుకున్నాడు. అదే ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్న సునీల్ రఘువంశీ, విశాల్ స్నేహితులు కావడం రాజీవ్‌కు కలిసొచ్చింది. ఇద్దరూ కలిసి సునీల్‌ను ప్రలోభపెట్టారు. గతంలో విశాల్ దుబే, సునీల్ ఒకే కాలేజీలో చదువుకోవడం వల్ల అతడిని ఒప్పించడం చాలా సులువైంది. వృత్తిరీత్యా ఓ కన్సల్టేషన్ కార్యాలయంలో పని చేస్తున్న విశాల్, సుభాష్ ప్రకాశ్‌తో కలిసి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులను చేరుస్తుండేవారు. ఈ నలుగురు పేపర్‌ను లీక్ చేసేందుకు పన్నాగం పన్నారు.ఆర్‌వో/ఏఆర్‌వో ప్రశ్నపత్రం ప్రింటింగ్‌కు రాగానే సునీల్ మిగతా ముగ్గురికీ సమాచారం అందించాడు. కాపీలు కావాలంటే రూ.10 లక్షలు డిమాండ్ చేశాడు. క్వచన్ పేపర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే అవకాశం ఉన్నందున అభ్యర్థులు వాటి ఫొటోలు తీసుకోరాదని షరతు విధించాడు. దీనికి మిగతావారంతా అంగీకరించారు. సరైన అవకాశం కోసం సునీల్ వేచి చూశాడు. ప్రింటింగ్ మధ్యలో ఏదైనా సమస్య వస్తే ఆ పేపర్‌ను చించేస్తారు. పక్కా ప్రణాళిక ప్రకారం మెషీన్‌లో సునీల్ సమస్య సృష్టించి.. పేపర్‌ను చించేసినట్లు నటించి.. అధికారుల కళ్లుగప్పి రహస్యంగా ఇంటికి తీసుకొచ్చేశాడు. మిగతా ముగ్గురికి సమాచారం అందించాడు.ఈలోగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వివేక్ ఉపాధ్యాయ, బిహార్‌కు చెందిన అమర్జీత్ అనే ఇద్దరు ఏజెంట్లు.. అభ్యర్థులను గుర్తించి, వారి ఉద్యోగహామీ ఇచ్చి.. ఒక్కొక్కరి నుంచి రూ.12 లక్షలు వసూలు చేశారు. ఫిబ్రవరి 8న.. అంటే అంటే పరీక్షకు మూడు రోజుల ముందు ఓ హోటల్‌కు వారందర్నీ పిలిపించారు. ప్రశ్నపత్రంతో సునీల్ హోటల్‌కు చేరుకున్న తర్వాత సుభాష్ ప్రకాశ్ కొంత మంది సాయంతో 'కీ' తయారు చేయించాడు. ప్రశ్నపత్రంలోని అంకెల వరుస క్రమంలో 'కీ'ని యథాతథంగా గుర్తుంచుకోవాలని అభ్యర్థులకు సూచించారు. 'కీ' ఫొటోలను మాత్రమే అభ్యర్థులకు ఇచ్చి వారందరికీ హోటల్ లోనే ఆశ్రయం కల్పించారు. పరీక్ష రాసిన వారిలో సుభాష్ ప్రకాశ్ కూడా ఉన్నాడు.అయితే, డబ్బుమీద ఆశతో రాజీవ్ నారాయణ్ మిశ్రా.. ప్రశ్నపత్రం ఫొటోలను రవి అత్రి మరో వ్యక్తికి ఫార్వర్డ్ చేశాడు. అతడు మరికొందరికి పంపడంతో సామాజిక మాధ్యమాల్లో ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురిని అరెస్టు చేశామని, దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని యూపీ పోలీసులు వెల్లడించారు. మరోవైపు యూపీ పోలీస్ కానిస్టేబుల్ ప్రశ్నపత్రాన్ని కూడా రాజీవ్ నారాయణ్ మిశ్రా, రవి అత్రిలే లీక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఇప్పటికే వీరిద్దర్నీ అరెస్టు చేసి మేరఠ్ జైల్లో ఉంచారు.రివ్యూ ఆఫీసర్/ అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్

# చర్చలు అసంపూర్ణం

హైదరాబాద్(జనంసాక్షి):
తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జూనియర్ డాక్టర్లు(జూడాలు) రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో జూడాలు చర్చలు జరిపారు.అయితే, ఈ చర్చలు అసంపూర్తిగా ముగిశాయని జూడాలు వెల్లడించారు. కొన్ని అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, మరికొన్ని అంశాలపై మరోసారి చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా అంశాలపై ప్రతిపాదనలను మంత్రి ఉన్నతాధికారులకు పంపించినట్లు జూడాలు తెలిపారు.వైద్యుల భద్రత గురించి మంత్రి ఆలోచిస్తామన్నారని, స్టైఫండ్‌కు గ్రీన్‌ఛానల్‌పై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు జూడాలు తెలిపారు. సమ్మె కొనసాగింపుపై రాష్ట్రస్థాయి జూడాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు సమ్మె యథాతథంగా కొనసాగిస్తామని చెప్పారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైఫండ్ చెల్లింపు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు రూ.1.25 లక్షల గౌరవ వేతనం, వైద్యకళాశాలలో పెంచిన 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో జూడాలు సమ్మె చేస్తున్నారు.

## రాజ్యసభాపక్ష నేతగా జేపీ నడ్డా

ఇప్పుడు ఆయన స్థానంలో నడ్డాను ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం అధికారిక ప్రకటన వెలువడింది. ప్రస్తుతం కేంద్రంలో ఆయన వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జేపీ నడ్డా వరుసగా మూడోసారి రాజ్యసభ కు ఎన్నికైన సంగతి తెలిసిందే. గతంలో సొంత రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్ నుంచి పెద్దల సభకు ఎన్నికైన ఆయన.. ఈ సారి గుజరాత్ నుంచి ఎగువసభకు వెళ్లారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికా రంలోకి రావడంతో నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇక, పార్టీ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలం ఈ నెలతో ముగియనుంది. అయితే, ఈ ఏడాది చివర్లో జరగనున్న నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకూ పదవిలో కొనసాగాలని అధిష్ఠానం నడ్డాను కోరినట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు 50 శాతం పూర్తయిన తర్వాతే కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని పార్టీ నిబంధనలు చెబుతున్నాయి. డిసెంబరు–జనవరిలో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా.. కేంద్ర హోం శాఖ మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. అప్పుడు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన నడ్డా జనవరి 2020లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

# లీకేజీలు పట్టని మోదీ

నెట్ పరీక్షల వివాదాలు, పాలు, గ్యాస్, టోల్ ధరల పెంపు, కార్చిచ్చులు, నీటి సంక్షోభం, వడదెబ్బ మరణాల వంటివి చోటుచేసుకున్నాయి" అని ట్వీట్ చేశారు.ఇంత జరుగుతున్నా.. ప్రధాన మంత్రి మాత్రం తన ప్రభుత్వాన్ని కాపాడుకునే పనిలో బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. బలమైన ప్రతిపక్షం కేంద్ర సర్కారుపై ఒత్తిడిని కొనసాగిస్తుందని చెప్పారు. ప్రజల తరఫున గొంతుకను వినిపించడంతోపాటు జవాబుదారీతనం లేకుండా ప్రధాని తప్పించుకోవడాన్ని అడ్డుకుంటుందని తెలిపారు. అంతకుముందు.. 18వ లోక్‌సభ తొలి సమావేశాల ప్రారంభం వేళ 'ఇండియా' కూటమి నేతలు రాజ్యాంగ ప్రతిని చేతపట్టి లోక్‌సభ ఛాంబర్‌వైపు ప్రదర్శనగా వెళ్లారు.

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు & భవనముల శాఖ
ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT NO.01/DB/JTO/TO/EE/(R&B)/BCM/2024-25 తేది: 21.06.2024
పనుల సంఖ్య:02, పనుల పేర్లు: భద్రాద్రికొత్తగూడెంజిల్లాలో అత్యవసరమరమ్మతులు చేయుట. మొత్తం: 9.60 లక్షలు.బిడ్‌దాఖలుకు చివరి తేది: 27.06.2024 సా॥ 3.30గం॥లకు. తెరచు తేది: 27.06.2024.సా॥ 4గం॥లకు. మిగతా వివరాలు www.eprocur ement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు
(ఆర్&బి) డివిజన్, భద్రాచలం
DIPR No.161-DP/CL/ADVT/1/2024-25



## మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించండి

- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సీపీఐ(ఎం) వినతి

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి) :** డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు సౌకర్యాలు కల్పించాలని, లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయాలని సీపీఐ(ఎం) సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విన్నవించారు. గ్రేటర్ హైదరాబాద్లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గత ఏడాది ఆగస్టు / సెప్టెంబర్లో లబ్ధిదారులకు కేటాయించినప్పటికీ ఆ ఇళ్లను వారికి నేటికీ స్వాధీనం చేయలేదని, ఇళ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు నేటికీ కల్పించబడకపోవడం వల్ల ఆ ఇళ్లలో నివసించే పరిస్థితి లేదని, లిఫ్టులు కూడా పనిచేయడం లేదని, లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు పొంది పది నెలలు గడుస్తున్నా ఇళ్లలోకి వెళ్లలేకపోవడం వల్ల చాలా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతోందని, తక్షణమే ఇళ్లలోకి వెళ్లడానికి ఈ ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తమ వాటా నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

### శ్రీశైలం హైడల్ జెన్కో నాలుగో యూనిట్ పనులకు

# టెండర్లు పిలవండి



- రెండు కోట్లు ఖర్చు పెట్టే నిర్ణయం కోసం 60 కోట్లు పోగొట్టుకోవడం అర్థం లేని పని
- శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడల్ జెన్కో సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**నాగర్‌కర్నూల్, జూన్ 24 (జనంసాక్షి) :** షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో మరమ్మతుకు గురైన యూనిట్ 4 పనులకు త్వరితగతిన టెండర్లు పిలవాలని డిప్యూటీ సీఎం , విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు జెన్కో అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడెల్ పవర్ జనరేషన్ ప్రాజెక్టులో పర్యటించి మంత్రి జూపల్లి, ఇంధన శాఖ సిఎండి ఎస్ .ఏ. ఎం.రిజ్వీ తో పాటు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఒక సీజన్లో మూడు నెలల్లో 60 కోట్ల విలువైన విద్యుత్తును ఇక్కడ ఉత్పత్తి చేస్తాం. రెండు కోట్ల రూపాయల ఖర్చు అయ్యే మరమ్మతు పనుల విషయంలో నిర్ణయం తీసుకోవడంలో జాతీయ మూలంగా 60 కోట్ల విలువైన విద్యుత్తును కోల్పోవడం అర్థం లేని పని అని డిప్యూటీ సీఎం తెలిపారు భట్టి విక్రమార్క అన్నారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడెల్ జెన్కో ప్రాజెక్టు తెలంగాణకు గర్వకారణమైంది అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా ప్రసిద్ధిగాంచిన హిటాచి సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించింది అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే అవకాశం ఈ ప్రాజెక్టులో ఉంది అన్నారు. ఈ ప్రాజెక్టులో చోటు చేసుకున్న 20 20 నాటి దుర్ఘటన అందరికీ బాధాకరమైన సంఘటనగా పేర్కొన్నారు. నాటి షార్ట్ సర్క్యూట్ ప్రమాదం నుంచి యూనిట్ ని కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి, అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎప్పుడు ఏం కావాలన్నా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ప్రతి పనికి, అభివృద్ధికి విద్యుత్ అనేది ప్రధాన ఆధారంగా ఉంది అని తెలిపారు. జెన్కో ప్రాజెక్టుకు సంబంధించి ఎంత త్వరగా నిర్ణయాలు తీసుకుంటే అంత మంచిదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి ఇక్కడ సాధించవచ్చు అని తెలిపారు. ఫలితంగా తక్కువ ధరలకే తెలంగాణ ప్రజలకు విద్యుత్తును అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రమాదం నుంచి పని ప్రాంతాల్లో భద్రతాపరమైన చర్యలకు సంబంధించి ఏం నేర్చుకున్నారని అధికారులను ప్రశ్నించారు. అంగారక గ్రహం పై రాకెట్లు పంపిస్తున్న సమయంలో, గుండు సూది కదిలిన కనిపించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు ప్లాంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, వాటిని అధికారులు కనెక్ట్ చేసుకోవడం వంటివి చేపట్టాలన్నారు. ప్లాంట్ లోకి వచ్చే ప్రతి మనిషికి చిన్న ఆక్సిజన్ సిలిండర్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. భద్రతా చర్యల విషయంలో నిధులు సమస్య కాదు, మనిషి ప్రాణం విలువైనది, స్వీపర్ నుంచి సీఈ వరకు ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు. ప్లాంట్లో భద్రతా చర్యలకు సంబంధించి కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. %ఖుఅశ్రీజూశీఅ% తెగిపోయింది మరమ్మతులు చేయలేదని ఎమ్మెల్యేలు సమావేశంలో దృష్టికి తెచ్చారు, దీనికి సంబంధించి ఎమ్మెల్యేలు ప్రతిపాదిస్తూ లేఖలు ఇస్తే వెంటనే ఆ పనులు చేపడదామని డిప్యూటీ సీఎం అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం, విద్యుత్ శాఖలో స్వీపర్ నుంచి సిఇ వరకు ఒక కుటుంబంలా పనిచేయాలని, అందరం కలిసి సంపాదన సృష్టించి ఆస్తులు పెంచాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా వినడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది, పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు.. ఆర్టిజన్ల రెగ్యులరైజేషన్, ఉద్యోగులకు డి మోషన్స్ ఒంటి అంశాలు తన దృష్టికి వచ్చాయని ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మెగా రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాజేష్ రెడ్డి, పరిణికా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## జగిత్యాల అభివృద్ధి కోసమే పార్టీ మారా

- ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల,జూన్ 24 (జనంసాక్షి) :** జగిత్యాల అభివృద్ధి కోసమే తాను బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. అధికార పార్టీలో ఉంటే అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని అన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. జగిత్యాల నూకపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులతో టెలికాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మౌలిక వసతుల కోసం రూ. 80 కోట్లు కావాలని నిధుల కేటాయింపు కొరకు సీఎంను కలసానని చెప్పారు. అప్పుడే ఆయన తనను పార్టీలోకి ఆహ్వానించారని తెలిపారు. మౌలిక వసతులు నియోజకవర్గర అభివృద్ధి అవసరమయ్యే నిధులు విడుదల చేస్తానని చెప్పడంతో కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. తన వ్యక్తిగత అవసరాలకే పార్టీ మారారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని నమ్మొద్దని సూచించారు సంజయ్ కుమార్.

## మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం

### ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,జూన్24 : తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర ఎంతో కీలకమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు – సమ్మిళిత అభివృద్ధి' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు వ్యాపారాల్లో తోడ్పాటునందిస్తామని తెలిపారు. వాళ్లు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. అందులో మహిళా పారిశ్రామికవేత్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. పారిశ్రామిక విధానంలో భాగంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా ఏర్పాటు చేస్తామన్నారు. ఓఆర్ఆర్ లోపల ఐటీ కంపెనీలకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో పరిశ్రమలు, మిగతా ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తామని శ్రీధర్‌బాబు వివరించారు.

## కలెక్టరేట్ భవనం ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

**జనగామ, జూన్ 24 (జనంసాక్షి) :** జనగామ పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పసరమట్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగరావు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. కలెక్టరేట్ భవనం ఎక్కి పురుగుల మందు తాగి సూసైడ్ అటెంప్ట్ చేశాడు. తాను బతికి ఉండగానే చనిపోయాననంటూ తన భూమిని అధికారులు ఇతరులకు పట్టా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందు సేవించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా నర్సింగరావు పలుమార్లు కలెక్టరేట్ దగ్గర నిరసన తెలిపాడు. తన ఆవేదనను అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగెత్తి ఇవాళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.

## గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకున్నారు

- ఆనాడొక నీతి..ఇప్పుడొక నీతా?
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ



**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి) :** గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యలేను గంపగుత్తగా బిఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు నీతి సూత్రాలు ఏమయ్యాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. ఆనాడు నిస్సిగ్గుగా చేరికలను ప్రోత్సహించి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడాన్ని భారాస నేతలు తప్పుపడుతున్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను గతంలో భారాస చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. శాసనసభలో భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది మీరు కాదా? అని నిలదీశారు. శాసనమండలిలో తనకు ప్రతిపక్ష నేత హోదా తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారాస పార్టీ కార్యాలయం కోసం 11 ఎకరాలు ఎందుకు..కార్యాలయం ఉన్న భూమిని ప్రభుత్వం తీసుకోవాలి. కోకాపేటలో భారాసకు ఇచ్చిన భూముల్ని వెనక్కి తీసుకొని వేలం వేయాలి. వేలం వేసిన డబ్బులు రుణమాఫీకి ఉపయోగించాలి. భారాస ఖతం అయ్యింది అని షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు.

## చెంచు మహిళ ఈశ్వరమ్మకు

# మెరుగైన వైద్యం

- నిమ్స్ డైరెక్టర్‌కు రాజనర్సింహ ఆదేశం



**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లికి చెందిన గిరిజన మహిళ ఈశ్వరమ్మ (25)పై ఆమె బంధువులు పాశవికంగా దాడికి పాల్పడ్డ సంగతి తెలిసిందే. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను ఆదేశించారు. ఈ మేరకు బీరప్పతో రాజనర్సింహ ఫోన్‌లో మాట్లాడారు. ఈశ్వరమ్మ ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని మంత్రి ఆదేశించారు. ఆమె వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుదని మంత్రి స్పష్టం చేశారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని రాజనర్సింహ భరోసా ఇచ్చారు. కాగా, ఈశ్వరమ్మ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈశ్వరమ్మ కుటుంబానికి 25 ఏండ్ల కింద ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమి, ఇంటి పత్రాలను వెంటనే వారి పేర చేయాలని అధికారులను కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

## కెసిఆర్‌ను, బిఆర్ఎస్‌ను మోసం చేసిన సంజయ్

- ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడంపై మండిపడ్డ కొప్పుల
- ఎమ్మెల్యే ఇంటిముందు బిఆర్ఎస్ శ్రేణుల ఆందోళన



**జగిత్యాల, జూన్ 24 (జనంసాక్షి) :** కేసీఆర్, బీఆర్ఎస్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మోసం చేశారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. కష్టకాలంలో పార్టీని మోసం చేసి స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్‌ని జగిత్యాలలో తిరుగని వ్వమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే సంజయ్ ఇంటిని ముట్టడించాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. దిష్టి బొమ్మలను తగులబెట్టారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యమంలో పాల్గొనకున్నా ఆయనకు కేసీఆర్ పిలిచి మరీ టికెట్ ఇచ్చారు. ఎమ్మెల్సీ కవిత చంటిపిల్లాడిలా అతడిని ఊరూరు తిప్పి ఎమ్మెల్యేగా గెలిపించారు. కేసీఆర్ నమ్మకాన్ని వమ్ము చేసి జగిత్యాల ప్రజలను సంజయ్ మోసం చేశాడని మండిపడ్డారు. రూ.40 కోట్లు తీసుకొని కాంగ్రెస్‌లో చేరాడని ఆరోపించారు. అధికారం కోల్పోగానే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి పార్టీని వీడటం దారుణమన్నారు. పోచారానికి కేసీఆర్ ఎంతో విలువ ఇచ్చారని గుర్తు చేశారు. వ్యక్తగత స్వార్థంతోనే పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీ ఫిరాయింపులను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఆపాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్ తన పదవికి రాజీనామా చేసి భేషరతుగా ప్రజలకు క్షమాణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే జగిత్యాలలో తిరుగనివ్వమని హెచ్చరించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి అన్ని విధాల లబ్దిపొంది ఎమ్మెల్యేగా గెలిచాక వ్యక్తిగత అవసరాల కోసం పార్టీ మారడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సంజయ్ దిష్టిబొమ్మలను తగుల బెట్టారు. వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు నిరసనగా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని ఆదుకున్న సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి ఎలాంటి సమాచారం లేకుండా సీఎం రేవంత్ రెడ్డి సంజయ్ కుమార్ ను పార్టీలో చేర్పించుకోవడం సరికాదని తెలిపారు. ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యకర్తగానే కొనసాగుతానని ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు సంజయ్ చేరికపై కాంగ్రెస్ శ్రేణులు సైతం ఆగ్రహంగా ఉన్నారు.

## నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలి

- పరీక్షను మళ్ళీ నిర్వహించాలి
- పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా వైద్య, విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు చేత విచారణ చేపట్టి, అందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ( పిడిఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అసమర్థత మూలంగా 24 లక్షల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించటం లేదని, మోడీ దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ఎన్‌టీఏను రద్దుచేసి, లక్షలాది మంది విద్యార్థుల కోరిక మేరకు తిరిగి మరల పరీక్షను నిర్వహించి, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఢిల్లీలో ఎన్ఎస్‌యూఐ నాయకుల అరెస్ట్

- నీట్ విద్యార్థులకు న్యాయం చేయాల్సిందే
- ఎన్ఎస్‌యూఐ జాతీయాధ్యక్షులు వరుణ్ చైదరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్

**ఢిల్లీ, జూన్ 24 (జనంసాక్షి) :** జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ ముట్టడి కి బయలుదేరిన ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, ఎమ్మెల్సీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్‌ని ఇతర ముఖ్యనాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అవకతవకల పై కేంద్ర ప్రభుత్వ, ఎన్‌టీఏ తీరుకు నిరసనగా నీట్ విద్యార్థుల పక్షాన పార్లమెంట్ ముట్టడికి ఎన్ఎస్‌యూఐ ప్రయత్నించింది. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుస్తామని నాయకులు పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలని, ఎన్‌టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



## సింగరేణి నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం

- త్వరలోనే అటవీ భూమి బదలాయింపునకు అన్ని చర్యలు
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ విజ్ఞప్తిపై ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సానుకూల స్పందన
- మూడు నెలల్లో నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం : సీఎండీ ఎన్.బలరామ్



(ప్రత్యేక ప్రతినిధి- జనంసాక్షి)

సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు గని నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యే విధంగా, అలాగే నైనీ సమీపంలో నిర్మించతలపెట్టిన థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తింపు కోసం సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందుకోసం సోమవారం ఆయన ఒడిశాలో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాతో ప్రత్యేకంగా సమావేశమై నైనీ బ్లాక్కు సంబంధించి అన్ని అనుమతులు లభించిన విషయాన్ని.. అలాగే రెండో దశ అటవీ అనుమతుల్లో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా సింగరేణి చర్యలు తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా వన్య ప్రాణి నిర్వహణ ప్రణాళికలో పొందుపరిచినట్లుగా రూ.39 కోట్లను కూడా డిపాజిట్ చేశామని.. దీంతో ఇప్పటి వరకు రూ.180 కోట్లను పూర్తిగా ప్రభుత్వానికి చెల్లించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ప్రారంభం కోసం కావాల్సిన 783 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి బదలాయించాలని కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో నైనీ ప్రాజెక్టుకు సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మాట్లాడుతూ.. సింగరేణి నైనీ ప్రాజెక్టు నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలను పూర్తిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. అటవీ భూమిని వీలైనంత త్వరగా అప్పగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అనంతరం ఆయన ఒడిశా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ (ఇడ్కో) ఛైర్మన్ హేమంత్ శర్మ ను కలిశారు. సింగరేణి త్వరలోనే నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి చేపట్టనుందని.. అయితే ఈ బొగ్గును సింగరేణి థర్మల్ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నైనీ గనికి 50 కిలోమీటర్ల దూరంలోనే 1600 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు.. ఇందుకోసం సింగరేణి ఉన్నతాధికారుల బృందం గతంలో ఒడిశాలో పర్యటించి నాలుగు ప్రదేశాలను పరిశీలించిందని వివరించారు. 800 ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు.

## ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ

# ఫలితాల్లో 'అల్ఫోర్స్' సంచలనం



**కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి) :** సోమవారం రోజు ప్రకటించబడిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో అఖండ విజయం సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బైపీసీ విభాగంలో జె.అంజన 440 మార్కులకు గాను 439 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో (స్టెట్ ఫస్ట్) నిలిచింది. ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకు 468 మార్కులతో చారిత్రాత్మక విజయం సాధించారు. ఇంతేకాకుండా 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులతో సంచలనం సృష్టించారు. అనేక మంది విద్యార్థులు 465 మార్కులు సాధించడం విశేషం అన్నారు. బైపీసి విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులు సాధించడంతోపాటు 4 గురు విద్యార్థులు 438 మార్కులు, 14 మంది విద్యార్థులు 437 మార్కులు , 34 మంది విద్యార్థులు 436 మార్కులు సాధించారు. ఏంఈసి విభాగంలో టి.అఖిల్, వి.రిషిత, యం.శ్రీవల్లికాపటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానంలో నిలిచారని సిఇసి విభాగంలో బి.గ్రీష్మ , సిహెచ్. నిఖిత 500 మార్కులకు గాను 494 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానంలో నిలిచారన్నారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడం అల్ఫోర్ కు మాత్రమే సాధ్యమని ఈ సందర్భంగా తెలిపారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల ఆహర్నిశల కృషివలన ఇంతటి ఘనవిజయం సాధ్యమైందని ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన మా అల్ఫోర్స్ అణిముత్యాలను, వారి తల్లిదండ్రులను మన స్ఫూర్తిగా అభినందిస్తూన్నానని ఇంతటి విజయానికి తోడ్పడిన అల్ఫోర్స్ అధ్యాపక , అధ్యాపకేతర బృందానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ పోరాటయోధుల స్ఫూర్తి అజరామరం

తెలంగాణ యోధుల పుస్తకం
పార్ట్-1




'స్వాతంత్ర ఉద్యమంలో తెలంగాణ ముస్లిం యోధులు' అనే పుస్తకం తాజాగా వచ్చింది. చరిత్ర అన్వేషణ యోధ రచయిత నసిర్ అహ్మద్ రాసిన 350 పేజీల గ్రంథం ఇది! చదువుతా ఉంటే విడిచి పెట్ట బుద్ధి కాదు! ఆయన రచనల్లో ఉన్న గొప్ప తనం అదే! చాలా లోతు గా శోధించి రాస్తారు ఆయన! ఆశమాశి రచయిత కాదు నశిర్ భాయ్! ఈ పుస్తకంలోని 'స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు'లో అక్బర్ అలీ ఖాన్ మీర్

**సిరాజుల్ హసన్ తిర్మిజి : హైదరాబాదు నగరం నివాసి**

ఈ యోధుని గురించి హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్కు సారధ్యం వహించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు స్వామి రామానంద తీర్థ 1966లో రాసిన 'హైదరాబాదు స్వాతంత్ర్య పోరాటం (అనుభవాలు, జ్ఞాపకాలు) అను గ్రంథంలో పేర్కొన్న వివరాలు ఇలా బలం చేకూర్చిన విషయాలు ఉన్నాయి. ఈ సందర్భంలో మా సత్యాగ్రహోద్యమానికి ముఖ్యమైన ప్రగతిశీల సంఘటనను గురించి ఇప్పుడు చెప్పడం తగినపని అనీ, అవసరమనీ అనిపిస్తుంది. అది సిరాజుల్ హసన్ తిర్మిజి, హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటంలో నిర్వహించిన పాత్రకు సంబంధించింది. తిర్మిజి ఆ నాటి కాంగ్రెసు వాదులందరిలో అత్యున్నతుడు. ముస్లిం మతావేశంలో నిండి వున్న హైదరాబాదు సంస్థానంలో తన అసాధారణ ధైర్య సాహసాల వల్లా సహజ దేశభక్తి విశ్వాసాల వల్లా శ్రీ తిర్మిజి ప్రజల హృదయాల్లో నిలిచి పోయారు.

**అబ్దుల్ సుభాన్, హైదరాబాదు : తెలంగాణ రాష్ట్రం రాజధాని హైదరాబాదు నగరం నివాసి**

**తండ్రి:** అబ్దుస్ సలాం. 1920 నాటి ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమాలలో ప్రముఖ పాత్రవహించారు. ఆ సందర్భంగా సభలు-సమావేశాలను జరపరాదని నిజాం జారీ చేసిన ఫర్మానాలను ఉల్లంఘించి అబ్దుస్ సుభాన్ సభలు నిర్వహించారు. ఆ కారణంగా 1921 వరకు మహబూబ్నగర్ జిల్లా మన్ననూరులో గృహనిర్బంధం శిక్షకు గురయ్యారు.

**అహ్మద్ అలీ ఖాన్ మీర్ :** 1905లో హైదరాబాద్లో జననం. 1920 నాటి ఖిలాఫత్ -సహాయనిరాకరణ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశం. ఖాదీ ప్రచారంలో భాగంగా అనేక సంవత్సరాలు 'హైదరాబాద్ ఖాదీ ప్రచార సంఘం' సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు.

**ఆధిపత్యం మీద అవిశ్రాంతంగా పోరాడిన అక్షరయోధుడు**

**05. జహందర్ అఫ్సర్**





స్వేచ్ఛా -స్వతంత్ర భావనలు, ప్రజా సంక్షేమాభిలాష, పరాయిపాలకుల పెత్తనం సహించలేని ఆత్మాభిమానం గల వ్యక్తులు ఎక్కడున్నా, ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా నిర్భయంగా, నిబద్దతో అభిప్రాయాలను వ్యక్తంచేస్తారు. స్వాతంత్రోద్యమ చరిత్రలో దర్శమిస్తారు. అటువంటి నిబద్ధతగల నిర్భయులైన వ్యక్తులలో జహందర్ అఫ్సర్ ఒకరు. ఆ కోవకు చెందిన యోధులు జహందర్ అఫ్సర్ సంపన్న నవాబుల వంశంలో 1926లో హైదరాబాద్లో జన్మించారు. నవాబు వంశస్తుల సుఖభోగలాలసకు భిన్నంగా వ్యవహరించిన ఆయన విద్యార్థి దశ నుండి పరాయి పాలకుల పెత్తనాన్ని వ్యతిరేకించారు. నవాబు వంశస్థులై వుండి సంస్థా నాధీశుడి నిర్ణయాలను విమర్శించ పూనుకోవడం సరికాదని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఎంతగా చెప్పినా వినకుండా ప్రజాశ్రేయస్సే ప్రధానంగా పోరుబాటన సాగటానికి అఫ్సర్ నిర్ణయించుకుని, ఆ నిర్ణయం మేరకు అక్షరాన్ని ఆయుధం చేసుకున్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రజలలో స్వేచ్ఛ-స్వతంత్ర భావనలను ప్రోది చేయడానికి, ఆ దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి ఆయన అక్షరయుద్ధం ఆరంభించారు

**మహిళల పాత్ర అమోఘం!**

ఆయన రచనల పట్ల కినుక వహించిన నిజాం మద్దతుదారులు, మత ప్రజా పోరాటాలకు బాసటగా నిలచిన యోధురాలు జమాలున్నీసా బాజి జాతీయోద్యమంలో ప్రవేశించి తద్వారా బ్రిటిషర్ల బానిస బంధనాల నుండి మాతృభూమి విముక్తి కోసం పోరాడడం మాత్రమే కాకుండా విముక్తి పోరాటాల స్ఫూర్తితో సమతా మమతల ఉత్తమ వ్యవస్థలను స్థాపించాలన్న లక్ష్యంతో ఉద్యమించిన మహిళలు ఎందరో భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కన్పిస్తారు. జాతీయోద్యమంలో, ఇండియన్ యూనియన్లో నైజాం రాష్ట్రం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొనడమే మాత్రమే కాకుండా ఆ క్రమంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాటంలో కూడా ప్రజలపక్షం వహించిన అరుదైన ముస్లిం మహిళా ఉద్యమకారులలో జమాలున్నీసా బాజి ఒకరు.

జమాలున్నీసా 1915 ప్రాంతంలో హైదరాబాదులో జన్మించారు. ఆమె తల్లి హైదరాబాదుకు చెందినవారు కాగా తండ్రిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. తండ్రి నైజాం సంస్థానంలో న్యాయాధికారిగా పనిచేశారు. కుటుంబంలోని పెద్దలు ఆచార సంప్రదాయాల పట్ల అనురక్తులైనప్పటికి తల్లితండ్రులు మాత్రం ఉదార స్వభావులు. ఆ కారణంగా తండ్రి నుంచి లభించిన స్వేచ్ఛ ఫలితంగా చిన్నతనంలోనే జమాలున్నీసాకు స్వతంత్ర భావనలతోపాటుగా జాతీయ భావనలు అలవడ్డాయి. భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న విప్లవకారులకు కరదీపికగా ఖ్యాతిగాంచిన, నిషేధిత 'నిగార్' ఉర్దూ పత్రిక ఉంది. రజాకార్ల మీద నిషేధం విధించమని నేరుగా నిజాంను కోరిన సాహసి బేగం ఉన్నారు.

**ముల్లా అబ్దుల్ బాసిత్ (1889-0)**

స్వదేశీ పాలకుల మీద పరాయి ప్రభువుల పెత్తనం అంగీకరించలేక వలస పాలకులను పాలద్రోలాలన్న ఆశయానికి కట్టుబడి శతాబ్దికాలంగా కృషిచేసిన యోధుల కుటుంబం నుండి వచ్చిన ప్రముఖులు ముల్లా అబ్దుల్ బాసిత్. 1889లో ప్రస్తుత కర్నాటక రాష్ట్రం గుల్బర్గాలో ముల్లా అబ్దుల్ బాసిత్ జన్మించారు. పునర్వికాసోద్యమ తొలి తరం నాయకునిగా ఖ్యాతిగడించిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం ఆయన తండ్రి. సోదరుడు అబ్దుల్ మునీం కూడా జాతీయ భావాలు కలిగిన రచయిత. అబ్దుల్ బాసిత్ పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి 'ఫాజిల్' పూర్తిచేశారు. తండ్రి ముల్లా అబ్దుల్ ఖయ్యూం జాతీయ భావాల మీద వెలువడిన కువిమర్శలకు తన పదునైన సమాధానాలతో ఇటు తండ్రికి, అటు జాతీయోద్యమానికి ముల్లా బాసిత్ వెన్నుదన్నుగా నిలిచారు. ఆయన నైజాం ప్రభుత్వంలో జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ముల్లా అబ్దుల్ బాసిత్ తండ్రి అబ్దుల్ ఖయ్యూం మార్గంలో జాతీయ భావాలను పుణికి పుచ్చుకున్నారు. తండ్రి బాటలో నడుస్తూ 'ది రెడ్ క్రెసెంట్ సొసైటీ' అను స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి 1912 నాటి బాల్కన్ యుద్ధంలోని టర్కీ క్షతగాత్రులకు మూడు లక్షల రూపాయలను విరాళం అందచేశారు. 1905లో తండ్రి ప్రోత్సాహంతో ఏర్పడిన 'అంజుమన్ మారిఫ్' లో ప్రధానపాత్ర వహించారు.

**విలీనం కోరుతూ లేఖ!**

**విలీనం కోరుతూ నిజాం నవాబుకు లేఖ రాసిన సాహసి బాఖర్ అలీ మీర్జా (1900-1973)**

ఇండియన్ యూనియన్లో నైజాంను విలీనం చేయమని నైజాం సంస్థానాధీశుడికి సలహా ఇస్తూ వెలువడిన చారిత్రాత్మక ప్రకటనను రూపొందించిన సాహసి బాఖర్ అలీ మీర్జా, 1900 మార్చి ఏడున హైదరాబాద్లో జన్మించిన బాఖర్ అలీ మీర్జా ఆక్స్ఫర్డ్ నుండి బి.ఎ (ఆనర్స్) చేశారు. విద్యార్థి దశ నుండి సామ్రాజ్యవాద శక్తులను వ్యతిరేకిస్తూ వచ్చిన ఆయన ఆక్స్ఫర్డ్లో చదువుతున్న జాతీయభావాలు గల విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రస్సెల్లో జరిగిన అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేక సభలకు కూడా హజరయ్యారు. నిజాం ప్రభుత్వంలోని అటవీశాఖలో సహాయ కన్సర్వేటర్ ఉద్యోగం చేస్తున్న ఆయనను బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనని పూచీకత్తు ఇవ్వమని పాలకులు కోరగా, అది తన స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలకు వ్యతిరేకమని నిరాకరిస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవకు పూర్తిగా అంకితమయ్యారు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో పాల్గొంటూ కార్మిక పరిశోధన శాఖలో ఆయన బాధ్యతలు నిర్వహించారు. మూడులక్షల మంది శ్రామికుల సభ్యత్వం గల జనపనార కార్మికుల సంఘాన్ని బలోపేతం చేసి సమ్మెదిశగా నడిపి కార్మికుల డిమాండ్లను సాధించారు. ఈ సందర్భంగా అరెస్టుకు గురయ్యిన బాబర్ అలీ మీర్జా చాలాకాలం కారాగారంలో గడిపారు.

**-ఎండి.మునీర్, సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు, 9951865223**

# సాధన చేస్తే...గణితమే విద్యార్థికి ఉత్తమ నేస్తం

***గణితం.. గణితం...ఈ పదం కొంతమంది విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగిస్తే, మరి కొంతమందికి భయాన్ని(ఫోబియా) కలిగిస్తుంది. ఫోబియా అనేది వాస్తవికమైనది కాదు , ఒక ఊహాజనితమైనది. కొంతమంది మనుషుల్లో ఉండే అనేకరకాల భయాల మాదిరిగానే కొంతమంది విద్యార్థుల్లో గణిత భయం (మ్యాథ్స్ ఫోబియా) ఉంటుంది. ఈ మ్యాథ్స్ ఫోబియా వలన, గణితం అంటే చాలా కష్టం, అది మనకు ఎప్పటికీ రాదు అనే అపోహ కొంతమంది విద్యార్థుల మనసుల్లో గూడు కట్టుకుని ఉంటుంది. ఈ అపోహ వలన మ్యాథమెటిక్స్ కోర్సులలోనే కాకుండా, మ్యాథమెటిక్స్ అప్లికేషన్స్ తో సంబంధం ఉన్న ఇతర కోర్సులలో, పోటీ పరీక్షలలో కూడా విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఈ వెనుకబాటు తనం విద్యార్థుల మంచి భవిష్యత్తుపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మ్యాథ్స్ ఫోబియా విద్యార్థుల విద్యాభివృద్ధికి మరియు వారి ఉద్యోగావకాశాలకు ఆటంకంగా మారుతుంది. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం చేసిన ఒక అధ్యయనం, గణిత సమస్యలను పరిష్కరించగల ఆత్మవిశ్వాసం ఉన్న విద్యార్థులు, మ్యాథ్స్ ఫోబియా ఉన్న విద్యార్థుల కంటే ఎక్కువ తార్కిక నైపుణ్యాలను మరియు సృజనాత్మకతను కలిగి ఉంటారని నిరూపించింది. అసలు, ఈ మాథ్స్ ఫోబియా అంటే ఏమిటి మరియు దానిని అధిగమించే మార్గాలను గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.***



**గణితం భయం (మ్యాథ్స్ ఫోబియా) - లక్షణాలు:** గణిత సమస్యలను సాధిస్తున్నప్పుడు మీకు చెమట పట్టుతుందా?... అయితే, మీకే కాదు "మ్యాథ్ ఫోబియా" తో బాధపడే చాలా మందిలో ఈ లక్షణం సర్వ సాధారణం. కొన్ని సర్వేలు ప్రకారం 7 నుండి 10 తరగతులలో 82% మంది విద్యార్థులు మ్యాథ్ ఫోబియాతో భయపడుతున్నారని వెల్లడయింది. ప్రతి 10 మంది విద్యార్థులలో ఒకరు మాత్రమే వారి గణిత సామర్థ్యం పై నమ్మకాన్ని కలిగి ఉన్నారని ఈ సర్వేలు చెబుతున్నాయి. ఈ మ్యాథ్ ఫోబియా సరైన సాధన లేకపోవడం వల్ల విద్యార్థులలో విస్తృతంగా వ్యాపిస్తుంది. మ్యాథ్స్ ఫోబియా అనేది గణిత శాస్త్రం పేరు వింటేనే విద్యార్థుల్లో తెలియకుండానే కలిగే ఒక భయం లేదా ఆందోళన. మ్యాథ్స్ ఫోబియా తో ఆందోళనకు గురౌతున్న విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చెయ్యలేక గణిత సంబంధిత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. మ్యాథ్స్ ఫోబియా ఉన్న విద్యార్థులు విషయాలను అవగాహన చేసుకుని సమస్యలను సాధించడం కంటే, సమస్యలకు సంబంధించిన సమాధానాలను కంఠస్త పద్ధతి ద్వారా గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. మ్యాథ్స్ ఫోబియాతో బాధపడే విద్యార్థులకు,గణిత సంబంధిత సబ్జెక్టులు పెద్ద భూతం లాగా కనిపిస్తాయి. అంతేకాదు, గణిత శాస్త్రంలోని అంశాలను అర్థం చేసుకుని, సంబంధిత సమస్యలను సాధించే ప్రయత్నం చేయకుండానే, ఆ అంశాలు తమకు అర్థం కానివని, ఆ సమస్యలను తాము సాధించలేమనే అపోహలతో విద్యార్థులు సతమతమవుతుంటారు. అందువల్ల, గణిత శాస్త్రం పట్ల ఆసక్తి తగ్గి, దానిని నేర్చుకునే సమయంలో విద్యార్థులు నిద్రపోతూ ఉంటారు. గణితం పట్ల సరైన అవగాహన, సంసిద్ధత, మరియు ఆత్మవిశ్వాసం లేకపోవడం వలన చాలామంది విద్యార్థులు గణితంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇలా విఫలమవుతున్న విద్యార్థులు, తమకు గణిత శాస్త్రం చదివే సామర్థ్యం లేదనుకుని గణిత శాస్త్రం పట్ల పెద్ద భయాన్ని సృష్టించుకుంటారు. దీనినే మనం "గణిత భయం(మ్యాథ్ ఫోబియా)"అని అంటాము.

**మ్యాథ్స్ ఫోబియా కారణాలు :** ప్రాథమిక విద్య నుండే "మ్యాథ్స్ ఫోబియా" విద్యార్థుల మనసుల్లో ప్రవేశించడానికి అనేక కారణాలు ఉన్నాయి.

**1. ప్రాథమిక విద్యలోనే బీజం:** ప్రాథమిక విద్యలోనే గణిత శాస్త్రాన్ని చదవడానికి సరైన బోధన, అవసరమైన ప్రోత్సాహం లభించక, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం వలన చిన్న వయసులోనే చాలామంది విద్యార్థుల మనసుల్లో కి మ్యాథ్స్ ఫోబియా ప్రవేశిస్తుంది. ఇలా ప్రవేశించిన ఈ ఫోబియా పెరిగి పెద్దదై విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తి లేకుండా చేస్తుంది.

**2. గణిత శాస్త్రం కఠినమైనదనే భావన:** తల్లిదండ్రులు మరియు చుట్టూ ఉన్నవారు తరచుగా గణితం చాలా కష్టమైనదని చర్చించుకోవడంతో,చాలామంది విద్యార్థులు చిన్న వయసులోనే, గణితం అర్థం కాని సబ్జెక్ట్ అని,అది చాలా కష్టమైనదని,మరియు మనం చదవలేమనే భావనకు లోనౌతున్నారు. ఈ భావనే విద్యార్థులకు చిన్న వయసులోనే గణితం పట్ల భయాన్ని కలిగిస్తుంది.

**3. బోధనా పద్ధతుల్లోని లోపాలు:** కొందరు ఉపాధ్యాయులు ఉపయోగించే బోధనా పద్ధతులు సరైనవిగా లేనప్పుడు, విద్యార్థులు విషయాలను సులభంగా గ్రహించలేక ఆందోళనకు గురవుతుంటారు. అలాగే, ఉపాధ్యాయులు గణిత శాస్త్రం గురించి విద్యార్థులకు సరైన అవగాహన కల్పించలేకపోవడం కూడా మాథ్స్ ఫోబియా కి దారితీస్తుంది.

**4. భయపెట్టే గణిత ఖచ్చితత్వం :** గణితం అనేది సంఖ్యల ఆట, దీనిలో విద్యార్థులు సమస్యలకు ఖచ్చితమైన సమాధానాలను రాబట్టవలసి ఉంటుంది. సరైన సాధన చెయ్యకపోవడం వల్ల, గణిత సమస్యలను సాధిస్తున్నప్పుడు ఖచ్చితమైన సమాధానాలను రాబట్టలేక విద్యార్థులు గణితం అంటే భయపడుతున్నారు.

**5. ఏకాగ్రతతో కూడిన సాధన లేకపోవడం:** గణితానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోని, క్రమం తప్పకుండా ఏకాగ్రతతో గణితాన్ని సాధన చెయ్యకపోవడం వల్ల కూడా విద్యార్థుల్లో మ్యాథ్స్ ఫోబియా ఏర్పడుతుంది.

**మ్యాథ్స్ ఫోబియాని ఎలా అధిగమించాలి?**

అనుసరించడానికి సులభతరమైన ఈ తొమ్మిది నివారణలతో మ్యాథ్స్ ఫోబియాను అధిగమించవచ్చు.

**1.విద్యార్థుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలి:** 'నేను చేయలేను,' 'గణితం నా సబ్జెక్ట్ కాదు,' మరియు 'గణితం చేయడం చాలా కష్టం' అనే ఆలోచనలు విద్యార్థులకు గణితం పట్ల భయాన్ని పెంచి ఆసక్తిని తగ్గిస్తాయి. అందువల్ల గణితాన్ని బోధించడానికి ముందే ఇలాంటి ఆలోచనలను విద్యార్థుల మనసుల్లో నుంచి ఉపాధ్యాయులు చెరిపివేయాలి. అలాగే, ఉపాధ్యాయులు విద్యార్థులకు 'వారు తమ మనసులో నేను చేయగలను అని అనుకుంటే ఏదైనా చేయగలరని,' 'గణితం సులభంగా, సరదాగా ఉంటుందని,' మరియు 'సరైన విధానంతో ఎలాంటి గణిత సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని' చెప్పి వారికి గణితం పట్ల ఆసక్తిని కలిగించాలి. విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంచడంకోసం ప్రారంభంలో సులభతరంగా పరిష్కారమయ్యే చిన్న చిన్న సమస్యలను విద్యార్థుల చేత సాధన చేయించాలి.

**2.విద్యార్థులు మ్యాథ్స్ ఫోబియా గురించి స్వేచ్ఛగా మాట్లాడాలి:** విద్యార్థులు తమ గణిత భయం గురించి స్వేచ్ఛగా మాట్లాడేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలి. గణితశాస్త్ర పై విద్యార్థులకు ఉన్న అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. విద్యార్థులు ఎందుకు గణితం గురించి భయపడుతున్నారో, ఏ సమస్యలను సాధించడానికి కష్టపడుతున్నారో విపులంగా అడిగి తెలుసుకుని తగిన సూచనలను విద్యార్థులకు ఇవ్వడం వలన వారిలో గణితం పట్ల ఆసక్తి కలుగుతుంది.

**3. శ్వాస వ్యాయామాలు:** గణిత ఆందోళన ఎక్కువగా ఉన్నప్పుడు, శ్వాసపై దృష్టి పెట్టడం ద్వారా మనస్సును స్థిరీకరించ వచ్చును. విద్యార్థులు లోతైన శ్వాసను తీసుకొని, శ్వాస పై దృష్టి కేంద్రీకరించి, కొద్దిసేపు ధ్యానంలో ఉండటం వలన వారి మనసు కుదుటపడుతుంది. ఆ తర్వాత ఉపాధ్యాయులు విద్యార్థులను వారి మనసులో 'గణితాన్ని నేర్చుకోవడంలో నాకు సౌకర్యం ఉంది,' 'నేను గణితంలో విఫలం కాను,' 'నేను సమర్థుడైన గణిత అభ్యాసకుడిని,' మరియు 'గణితం నా భవిష్యత్తుకు సహాయపడుతుంది' అని సంకల్పం చేసుకోమని సూచించాలి. ఈ శ్వాస ప్రక్రియ సాధన వల్ల విద్యార్థుల్లో గణితం పట్ల ఆత్మవిశ్వాసం క్రమంగా పెరుగుతూ... మ్యాథ్స్ ఫోబియా తగ్గుతుంది.

**4. సాధనే కీలకం:** గణితంలో ఎంత ఎక్కువ సాధన చేస్తే, అంత మెరుగైన ప్రావీణ్యతను పొందగలరు. గణితం పై పట్టు సాధించడానికి సాధన ఒక్కటే ఉత్తమమైన మార్గం. సాధనతోనే గణిత భయాన్ని జయించవచ్చు. గణితానికి సంబంధించిన ప్రాథమిక భావనలను (బేసిక్ కాన్సెప్ట్స్) పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే, విద్యార్థులు గణిత సమస్యలను సొంతంగా సాధన చేయాలి. సాధన చేస్తున్నప్పుడు విద్యార్థులకు కలిగే అనుమానాలను ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చెయ్యాలి. ఈ విధంగా ప్రాథమిక భావనలను అర్థం చేసుకుని సమస్యలను సాధించడం వల్ల విద్యార్థులకు గణిత సమస్యలను సాధించడం సులభతరమవుతుంది. తద్వారా వారికి గణితంపై పట్టు వస్తుంది. కంఠస్థ పద్ధతి ద్వారా గణిత సమస్యలను, వాటికి సంబంధించిన సమాధానాలను గుర్తుపెట్టుకునే ప్రయత్నం చేయకూడదు.ఇది గణిత శాస్త్రం నేర్చుకునే పద్ధతి కాదు.

**5. గణితం తేలికగా, సరదాగా ఉంటుందనే భావన కల్పించాలి :** నిజానికి, గణిత సమస్యలు కొంత సంక్లిష్టంగానే ఉంటాయి. గణితంలో ఉండే ఈ సంక్లిష్టతే మనిషి మేధస్సుకు విశ్లేషణాత్మక పరిజ్ఞానాన్ని, సృజనాత్మకతను అందిస్తుంది. అదే సంక్లిష్టత విద్యార్థులను భయపెడుతుంది. ఉపాధ్యాయులు గణితంలోని సంక్లిష్టతను తమ బోధనా విధానం ద్వారా సులభతరం చేసి, దశలవారీగా నేర్పినప్పుడు, విద్యార్థులు గణిత భావనలను బాగా అర్థం చేసుకుని గణితం పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తారు. అలాగే, గణితానికి సంబంధించిన చిన్నచిన్న సరదా గేమ్స్ ని మరియు పజిల్స్ ని విద్యార్థులతో చేయించడం వలన వారికి గణితం పట్ల భయం పోయి ఆసక్తి కలుగుతుంది.

**6. నిజజీవితంలో గణిత యొక్క ప్రాముఖ్యతను వివరించాలి:** గణితాన్ని పరిపూర్ణంగా నేర్చుకోవడం వల్ల నిజజీవితంలో కలిగే ఉపయోగాలను, ప్రాథమిక దశలోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు విపులంగా వివరించడం వల్ల వారికి గణితం యొక్క ఆవశ్యకత తెలిసి, భయం పోయి, గణితం పై ఆసక్తి కలుగుతుంది.

**7. తోటి విద్యార్థులతో అభ్యాసనను ప్రోత్సహించాలి:** విద్యార్థులు తరగతిలో బహిరంగంగా వారి సందేహాలను అడగటానికి వెనుకాడవచ్చు. కానీ, వారి తోటి విద్యార్థులతో చర్చించడానికి సిగ్గుపడరు. కాబట్టి ఉపాధ్యాయులు సహ విద్యార్థులతో కలిసి చదువుకునే విధానాన్ని విద్యార్థుల్లో ప్రోత్సహించాలి. విద్యార్థుల పరస్పర చర్చల్లో వ్యక్తమైన సందేహాలను ఉపాధ్యాయులు నివృతి చేయాలి.

**8. సృజనాత్మకతతో గణితాన్ని నేర్పాలి :** ఉపాధ్యాయులు కొన్ని సృజనాత్మక కార్యకలాపాల ద్వారా గణితానికి సంబంధించిన అంశాలను వివరిస్తే, విద్యార్థులు మరింత సులభంగా అర్థం చేసుకుంటారు.. దీనికోసం, గణితానికి సంబంధించిన అంశాలలో చిన్నచిన్న ప్రాజెక్ట్ ను , పోస్టర్స్ ను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ ను, మరియు ఇతర సృజనాత్మక కార్యకలాపాలను తయారు చేయమని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించాలి. ఇలాంటి సృజనాత్మక కార్యకలాపాలు విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని కలిగిస్తాయి.

**9.గణితాన్ని నేర్చుకునే దశలో కంప్యూటింగ్ సాఫ్ట్వేర్లను ఉపయోగించరాదు :** ఈ సాంకేతిక యుగంలో గణితానికి సంబంధించిన అనేక కంప్యూటింగ్ సాఫ్ట్వేర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, విద్యార్థులు గణితాన్ని నేర్చుకుంటున్న దశలో ఈ సాఫ్ట్వేర్స్ ని ఉపయోగించి గణిత సమస్యలను సాధిస్తే, వారు గణితంలో ప్రాథమిక అంశాలపై పట్టును కోల్పోవడంతో పాటుగా, విశ్లేషణాత్మక మరియు తార్కిక నైపుణ్యాలను, సృజనాత్మకతను కోల్పోతారు. కాబట్టి,విద్యార్థులు గణిత శాస్త్రంలో పూర్తి ప్రావణ్యత సంపాదించి, పరిశోధన స్థాయికి వచ్చిన తర్వాతే ఈ గణిత సాఫ్ట్వేర్లను ఉపయోగించడం ఉత్తమం.

ఆర్థిక అక్షరాస్యత, వృత్తి అవకాశాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన మరియు విశ్లేషణాత్మక నైపుణ్యాలు, సాంకేతిక పురోగతి, శాస్త్రీయ ఆవిష్కరణలు మరియు సృజనాత్మకత, రోజువారీ కొలతలు ,ఇంజనీరింగ్, వైద్య మరియు ఆరోగ్య శాస్త్రాలు, పర్యావరణ అధ్యయనాలు మరియు పరిరక్షణ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరియు వాణిజ్యం, అంతరిక్ష అన్వేషణ మరియు నావిగేషన్, క్రీడా విశ్లేషణ మొదలగు రంగాలలో గణిత శాస్త్రానికి సంబంధించిన అనేక అనువర్తనాలు ఉన్నాయి. గణితాన్ని ఉపయోగించని వృత్తి, విభాగం ప్రపంచంలో ఏదీ లేదు.అందుకే, గణితాన్ని "క్వీన్ ఆఫ్ ఆల్ సైన్సెస్" మరియు "ది లాంగ్వేజ్ ఆఫ్ ది యూనివర్స్" అని అంటారు. ఇంతటి ప్రాముఖ్యతను కలిగిన గణితాన్ని ప్రేమిస్తూ.. శోధిస్తూ...సాధించాలి.



నసుబోలు రాజశేఖర్,
హెచ్ఓడి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్,
ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్,
శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల,
పెద్ద తాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా,ఆంధ్రప్రదేశ్,
పిన్ నెంబర్:534101,
9885739808, 8330969808

# సేమ్ టూ సేమ్! పోలీట్రిక్స్!





ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిది ఏండ్లు మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మాదిరే పోలీట్రిక్స్ కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ల ఎమ్మెల్యే లను ఎక్కడికక్కడ చీల్చి కేసీఆర్ చెండాడో, అదే పద్ధతిని ఇప్పుడు బిఆర్ఎస్ ను చీల్చి ఎమ్మెల్యే లను కాంగ్రెస్ పార్టీ లో చేర్చుకుంటున్నారు, సీఎం రేవంత్ రెడ్డి అంటే అతిషయోక్తి కాదు.మాజీ స్పీకర్ బిఆర్ఎస్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి సీనియర్ కాంగ్రెస్ లో చేరిన కొన్ని గంటల్లోనే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ లో చేరిపోయారు. సంజయ్ బిఆర్ఎస్ లో మాజీ మంత్రి కెటి ఆర్ శిష్యుడు గా పేరుగాంచాడు. ఆయన బిఆర్ఎస్ లో గంటల తరబడి కేటీఆర్ తో కూర్చునే వాడని అంటారు. ఇతని చేరికను ఎమ్మెల్సీ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బిఆర్ఎస్ నుంచి కూడ ఈ ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరడం మీద చాలా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ని తీవ్రంగా తూర్పర బట్టిన, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ను ఇబ్బంది పెట్టిన బిఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ లో ఎలా చేర్చుకుంటారు, అనే ప్రశ్నలు, అప్పట్లో బి ఆర్ఎస్ లో ఉద్యమం తో సంబంధం లేని వారిని చేర్చుకుని పదవులు ఇచ్చినపుడు ఉత్పన్నం అయిన విధంగానే ఇప్పుడు ఉత్పన్నం అవుతున్నాయి. పార్టీ లు మార్చే వారికి, ఎలాగూ సిగ్గు, శరం ఉండదు.ఒక ప్రిన్సిపల్ ఉండదు, వారి వ్యక్తిగత ప్రతిష్ట, వారి ప్రాపకం తప్ప మరోటి ఉండదు,అది జగమెరిగిన సత్యం!కాని ఇలాంటి జంప్ జిలానిలను చేర్చుకోవడం ద్వారా ఏమి సాధిస్తారు! ఎదుటి పార్టీ ని బలహీనం చేసి వికట సంతోషం పొందిన కేసీఆర్ కు ఏమి మిగిలింది!39 సీట్లు అసెంబ్లీ లో వచ్చాయి. మంచి గట్టి ప్రతిపక్ష హోదా లభించింది, అయినా తృప్తి లేదు! అధికారం కోల్పోయిన దుఃఖంను పట్టుకుని, విక్టిం కార్డుతో, అధికారంలో ఉన్నవారి మీద విమర్శలతో కాలం గడుపడం, మినహా ఒక కార్యక్రమం లేదు!అధికారం లో ఉన్నపుడు చేసిన తప్పులకు, ఆత్మ విమర్శ లేదు!చెంపలు వేసుకోవడం లేదు!పైగా జనమే బిఆర్ఎస్ ను ఓడించి తప్పు చేసారు, అంటారు. అందుకే ఇలాంటి మాటల వల్లే పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఫలితాలు దక్కాయి.మాజీ సీఎం కేసీఆర్ చేసిన తప్పునే ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారు. విపక్షం ను బలహీనం చేసే కేసీఆర్ వ్యూహం ను అమలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యం లో ఇది మంచి లక్షణం కానే, కాదు! కేంద్రంలో గత రెండు పర్యాయాలు పీఎం గా ఉన్న సందర్భంగా పీఎం నరేంద్ర మోడీ ఇదే చేశారు. మూడో సారికి ఆయన బీజేపీ కి పూర్తి మెజారిటీ తీసుకుని రాలేక పోయారు. 400 పార్ అని నినాదం ఇచ్చి, పూర్తి మెజారిటీ కి 32 తక్కువ,అంటే 240 సీట్లు మాత్రమే సాధించి, ఎన్డిఏ మిత్రుల సహకారం తో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది. ఎక్కడ అయినా, పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. సీఎం రేవంత్ రెడ్డి పార్టీ లో ఇతర పార్టీ ల ఎమ్మెల్యే లను చేర్చుకోవడం లో తొందర పడుతున్నట్లు కనిపిస్తున్నది. ఇంతకన్నా మించిన పనులు రాష్ట్రంలో, ఎక్కువ చేయాల్సినవి ఉన్నాయి. వాటి మీద దృష్టి పెడితే మంచిదేమో!ఏ భాయ్ జరా దేఖ్ కె ఛలో! ఆగేభి నహీ! ఫిచేభి!రాష్ట్రం లోని గత అనుభవాలను గుణపాఠాలు గా తీసుకోవడం మర్చిపోవద్దు! ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడ్డ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి తెలంగాణ వైపు కూడ చూస్తున్నది. అక్కడి సీఎం ను తక్కువ అంచనా వేయవద్దు!కొందరు బిఆర్ఎస్ వాళ్ళు టీడీపీ వైపు, బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని వార్తలు వినవస్తున్నాయి. నలు దిక్కుల చూడాల్సిన సమయం ఇది! ఒక దిక్కే చూసి చంకలు గుద్దుకుంటే కుదరదు! అందుకే జరా సంభల్ కే, ఔర్ సంభాల్ కె ఛలో సీఎం రేవంత్ రెడ్డి జీ! బి అలర్ట్! అండ్ టేక్ కేర్!

# వలస పక్షులు

ఉనికి ప్రమాదకరమై
పక్షులన్నీ వలస బాట
వనం కరువై..
జంతుజాలం జాడ మరుగు
కమీషన్ల కక్కుర్తికి
ఖనిజ సంపద తరలింపు
గిట్టుబాటు ధర కరువై,
వివిధ సరుకులు విదేశీ బాట
శ్రమ దోపిడి చవకని,
పలు విదేశీ కంపెనీలు ప్రత్యక్షం
నాడు బడిలో..
'భారతదేశం నా మాతృభూమి'
అంటూ ప్రతిజ్ఞ చేసిన యువత..
పక్షుల వలె, వస్తువుల వలె నేడు
విదేశీ వలస బాట పట్టింది
మద్య, దిగువ మధ్య తరగతి సైతం
ససేమిరా అన్నట్టు...
అమ్మవంటి దేశాన్ని అడ్డంగా కాలదన్ని
అమ్ముడు పోతుంది 'మేధస్సు'
ఇదేమిరా అంటే...
మన దేశంలో మనుగడ లేదట
కావల్సినంత 'ప్యాకేజీ' లు ఇవ్వలేదట
నాటి నుండి నేటి దాకా నిరుపేద దేశమే
మన దేశం అని జవాబు !
ప్రభుత్వం ..
లక్షల్లో ఖర్చుపెట్టి విద్యార్థిని చదివిస్తే
అది దేశానికి నిరుపయోగం
ఇక అభివృద్ధి ఎక్కడిది ?
అన్ని రంగాల్లో తలదన్నాము అంటున్న
ప్రసంగాల మాటున 'నిజం' ఏది.. వెరసి
ప్రపంచీకరణ అంటే - వలసల్లో అభివృద్ధి ???

న్యాలకంటి నారాయణ
9550833490

# ప్రజలను ఇబ్బందులు పెడితే సహించం

## బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ధర్నా!



మల్కాజిగిరి,జూన్24 (జనంసాక్షి)

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మిర్జాల్ గూడలో బాక్స్ డ్రైనేజీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి శ్రీనివాస్ నగర్, రాజా నగర్ పరిసర ప్రాంతాలలో మురుగునీరు రోడ్లపై నిలిచి ఇండ్లలోకి చేరాయని దీంతో స్థానికులు దుర్వాసనతో ఇక్కట్లకు గురవుతున్నారని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన సంఘటన స్థలానికి చేరుకొని కాలనీలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. సంవత్సరం క్రితమే పూర్తి కావాల్సిన బాక్స్ డ్రైనేజీ పనులు ఎందుకు పూర్తి కాలేదని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి అర్ధంతరంగా నిలిచిపోయిన బాక్స్ డ్రైనేజీపై కూర్చొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా ఉన్న బాక్స్ డ్రైనేజీలో చెత్త వ్యర్థాలు తొలగించకపోవడంతో చిన్నపాటి వర్షానికి బాక్స్ డ్రైనేజీ పొంగి మురుగునీరు ఇళ్లలోకి చేరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజిగిరి సర్కిల్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్నోసార్లు కాలనీవాసులతో కలిసి అధికారులకు వినతి పత్రాలు అందజేసిన చలనం లేదని ఆరోపించారు. అభివృద్ధి పనులు పూర్తి చేయక అర్ధాంతరంగా నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్ స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘాలతో కాలనీలు అభివృద్ధి



ఎమ్మెల్యే కేపీ వివేకానంద

కుత్బుల్లాపూర్ జూన్ 24 (జనంసాక్షి)

సంక్షేమ సంఘాల తో కాలనీలు అభివృద్ధి చెందుతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. సోమవారం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేపీ వివేకానంద మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యులు ఐకమత్యంగా కాలనీ అభివృద్ధి కృషి చేయాలని సూచించారు. కాలనీలో మౌలిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు కే రాములు యాదవ్, బుచ్చిరెడ్డి, నరేందర్ రెడ్డి, నాగిరెడ్డి, గంగాధర్, బాలా చారి, మహేష్, రఘు, రాజు, రంగారావు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం

దౌల్తాబాద్ జూన్ 24(జనంసాక్షి):

దౌల్తాబాద్ మండలంలోని బిచ్చల్ గ్రామంలో ఈనెల 12న కొరిడే అశోక్ గౌడ్ (35) మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అశోక్ గౌడ్ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మృతుని సోదరుడు నర్సిములు గౌడ్. ఈ సందర్భంగా ఎస్సై రవి గౌడ్ కేసు నమోదు చేసి సోమవారం శవాని వెలికి తీసి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపిన ఎస్సై రవి గౌడ్. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయ్ కుమార్, కొడంగల్ సిహెచ్ శ్రావణి, ఎస్సై రవి గౌడ్ ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్ పాల్గొన్నారు.

## బడ్జెట్ కేటాయించకుండా నాణ్యమైన భోజనాన్ని ఎలా నిర్వహిస్తారు?

- పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- సిఐటియు రాష్ట్ర నాయకుడు నర్సింగ్ రావు




మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి)

మధ్యాహ్న భోజన కార్మిక సమస్య పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కోశాధికారి ఉన్నికృష్ణ అధ్యక్షత వహిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10వేలు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర నాయకులు నరసింహ రావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారు. దీంతో కార్మికులు అప్పులపాలౌతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు పున:ప్రారంభం అయినాయి, చేసిన వాటికే బిల్లులు రాలేదు. పైగా రాగి జావ పెట్టాలి. బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా? కనుక ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరుతున్నాము. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారు. అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదు. కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయి. కార్మికులకు ఇచ్చే జీతమే తక్కువ, అది కూడా రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదు. మెనూ ఛార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి, కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలి. వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలని, రాగి జావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారు. గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ 2 గుడ్లే సరిపోదు. 3 గుడ్లు ఎలా పెట్టాలి. గుడ్లకు అదనం బడ్జెట్ కేటాయించాలి లేదా అంగన్వాడీ సెంటర్స్‌కి సప్లయ్ చేసినట్లుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లయ్ చేయాలన్నారు. అనంతరం సిఐటియు నాయకుడు ఉన్నికృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఏ.అశోక్, ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ఎన్ శ్రీనివాస్, మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షురాలు ప్రేమలత, నాయకులు సువర్ణ, పద్మ, భాగ్య, విజయలక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

### జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి నిర్మాణ పనులపై పిఆర్, ఆర్అండ్‌బి, మిషన్ భగీరథ ఈఈలతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా కొడంగల్ నియోజకవర్గంలోని కొస్గి, మద్దూరు, గుండుమల్, కొత్తపల్లి మండలాలలో ప్రతిపాదించిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రాల నుంచి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, ఇప్పటివరకు మద్దూరు, కోస్గి మండలాలలోని అన్ని గ్రామాలకు ఆయా మండల కేంద్రాల నుంచి రోడ్లు ఉన్నాయా ?ఉంటే ప్రస్తుతం ఆ రోడ్ల పరిస్థితి ఎలా ఉందని పంచాయతీరాజ్ ఈఈ హిర్యా నాయక్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ రోడ్డు లేని చోట కొత్తగా రోడ్లు వేయాలని సూచించారు. కొత్తవాటికి ప్రతిపాదనలు పంపాలన్నారు. మద్దూరు, కోస్గి, గుండుమల్, కొత్తపల్లి మండలాల నుంచి కొత్తగా వేసే సింగిల్ లైన్, డబుల్ లైన్ రోడ్ల పనులకు టెండర్లు ముగిశాయని, అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉందని ఆర్ అండ్ బి ఈఈ రాములు అదనపు కలెక్టర్ కు తెలిపారు. తొందరగా అగ్రిమెంట్ చేసి పనులు ప్రారంభించాలని మాయంక్ మిత్తల్ ఆదేశించారు. మద్దూరు మండల కేంద్రంలోనూ రోడ్డు విస్తరణ పనులకు అగ్రిమెంట్ చేయించాలన్నారు. ఇంకా ఎక్కడైనా రోడ్ల నిర్మాణం అవసరమైతే ప్రతిపాదనలు చేసి పంపించాలని సూచించారు. రెండు మండలాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు పూర్తయిన వాటిలో పది పాఠశాలల ను ఎంపిక చేసి రంగులు వేయించాలని చెప్పారు. వాటిలో ఫర్నిచర్ ఏం అవసరమో పరిశీలించి చెప్పాలని డీఈవో అబ్దుల్ ఘనికి తెలిపారు. పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వీటితో పాటు ఆ రెండు మండలాలలో మిషన్ భగీరథ తాగునీటి పథకానికి సంబంధించి మిషన్ భగీరథ ఈఈలు వెంకట్ రెడ్డి, రంగారావుతో అదనపు కలెక్టర్ చర్చించి, తాగునీటి సరఫరాను మెరుగు పర్చాలన్నారు. అవసరమైన చోట్ల కొత్తగా పైప్ లైన్లు వేయాలన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలి

- పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మస్కు చరణ్



యాచారం, జూన్ 24 (జనంసాక్షి)

యాచారం మండలం కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలకు ఎలాంటి పర్మిషన్ లేకుండా నడిపిస్తున్నారని పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చరణ్ మాట్లాడుతూ ఎలాంటి పర్మిషన్ లేకుండా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేసి అడ్మిషన్ తీసుకున్న శ్రీ చైతన్య యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ అధికారికంగా పేపర్ ప్రకటన చేసిన, నోటీసులు ఇచ్చిన ఆ నోటీసులను పెడచెవిన పెట్టి మళ్లీ యధావిధిగా నడిపిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యం అటు విద్యార్థులను ఇటు తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం కోసం, పర్మిషన్ లేని పూర్తికాని భవనంలోనే క్లాసులు నిర్వహించడంకై అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇప్పటికైనా డీఈఓ చొరవ తీసుకొని శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని అన్నారు. లేని పక్షంలో విద్యార్థులను వాళ్ళ తల్లి తండ్రులను ఏకం చేసి ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్, ఇబ్రహీంపట్నం డివిజన్ ఉపాధ్యక్షులు విప్లవ్ కుమార్, శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు లిఖిత్ కుమార్, అలాగే ఎస్ఎఫ్ఐ నాయకులు రాకేష్, శివ, నిఖిల్, శివ, తదరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిత తనిఖీ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

మర్పల్లి జూన్ 24 (జనంసాక్షి)

వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం నాడు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకస్మితంగా తనిఖీ చేశారు. అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, డిహెచ్ఎంవో కు ఫోన్ చేస్తే ఆయన స్పందించలేరు. జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి ఇక్కడ ఉన్న సమస్యలను వివరించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి, శుభ్రంగా లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న హాజీరు పట్టికను పరిశీలించారు. ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు యాదవ్, పట్లూర్ ఎంపీటీసీ స్వప్న సురేష్, పట్లూర్ మాజీ సర్పంచ్ సురేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్లలో జిల్లా ఉపాధ్యాయులకు అన్యాయం

### డీఈవో ఇస్తున్న ఎక్సెస్ డేటా వాస్తవ డేటాకు పొంతనలేదు




చేవెళ్ళ జూన్ 24 (జనం సాక్షి)

రంగారెడ్డి జిల్లా అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను సరిచేస్తూ ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్డ్‌లో ప్రమోషన్స్, బదిలీలు నిర్వహించడం వల్ల స్థానికులకు అన్యాయం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ ఐక్యవేదిక సెర్లింగ్ కమిటీ సోమవారం చేవెళ్ల తహసిల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. పిఓ 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు జీవో. ఎంఎస్ నెంబర్ 317 ప్రకారం నూతన జిల్లాలకు ఉపాధ్యాయులను కేటాయింపులో భాగంగా రంగారెడ్డి జిల్లాకు కేటాయించిన క్యాడర్ స్ట్రెంథ్‌కు మించి వివిధ కారణాలతో అనగా 317 అపిల్స్, స్పోజ్ కేసులు అంతర్జిల్లా బదిలీల ద్వారా సుమారు 400 మంది ఉపాధ్యాయులు క్యాడర్ స్ట్రెంత్‌కు భిన్నంగా రావడం జరిగిందన్నారు. దీని వల్ల స్థానిక జిల్లా ఉపాధ్యాయులకు పదోన్నతులో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం ప్రభుత్వ బడులలో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల పిల్లల చదువుపై పడి నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలియజేశారు. కావున తమరు కల్పించుకొని జిల్లాలో పనిచేస్తున్న అదనపు ఉపాధ్యాయులను వారి వారి సొంత జిల్లాలకు పంపి స్థానిక ఉపాధ్యాయ, నిరుద్యోగులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణిలో 109 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి



మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం(కలెక్టరేట్) సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 109 మంది దరఖాస్తులు అందచేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్క రించాలని అన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసిల్దార్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి కెవివి రవి కుమార్, జడ్‌పిసిఈఓ రాఘవేందర్ రావు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## యాచారం కందుకూర్ రూట్‌లో అదనపు బస్సులు నడిపించండి

- పలుమార్లు అధికారులను కోరిన స్పందన శూన్యం
- ఇబ్బందులు పడుతున్న వృద్ధులు వికలాంగులు

ఇబ్రహీంపట్నం, జూన్ 24 (జనంసాక్షి)

యాచారం నుండి కందుకూరు వెట్కపు రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల ఉన్న ఒకటి రెండు బస్సులలో ప్రమాదకంగా ప్రయాణం చేస్తు పోతున్నారు. యాచారం నుండి కందుకూరు వైపు ప్రయాణికులకు సరిపడా ప్రజలు నడిపించాలని పలుమార్లు అధికారులను కోరిన పట్టించుకోవడం లేదు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు బస్సులు నడిపించాలి. లేని పక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. వృద్ధులు, వికలాంగులు బస్సులు ఎక్కాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. బస్సులలో ఎక్కలేక ప్రవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే విషయం డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో తెలిపిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి యాచారం కందుకూరుకు బస్సులను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు ఇబ్రహీంపట్నం నుండి నుండీ బొల్లిగుట్టతండా బస్సు సర్వీసు నెంబర్ 111 ఈ బస్సు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం యాచారం బస్టాండ్ కీ వెళ్లడం లేదు. డైరెక్ట్ యాచారం చౌరస్తా నుండి ఇబ్రహీంపట్నం వెళ్తూ వస్తూంది. ఈ బస్సు యాచారం బస్టాండుకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలి



జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జనం సాక్షి):

అమ్మ ఆదర్శ పాఠశాలలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆ పాఠశాలలో చేపట్టిన పనులన్ని నాణ్యతతో కూడుకొని ఉండాలన్నారు. ప్రత్యేక ప్రాధాన్యతగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా 20 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్ చొప్పున ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల వివరాలను బ్లాక్ వారిగా, తరగతి వారిగా నంబర్లతో కూడుకున్న ఫోటోలను సమర్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులైన త్రాగు నీరు, ట్యూబ్ లైట్స్ , ఫ్యాన్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లల కోసం పని చేస్తున్న క్రమంలో మనకు వచ్చిన మంచి అవకాశాన్ని గర్వమైన అనుభూతిని పొందాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ప్రత్యేక అధికారులు ఆర్ అండ్‌బి ఇఇ లాల్ సింగ్, పంచాయతీరాజ్ ఉమేష్, మండల ప్రత్యేక అధికారులు రామ్ రెడ్డి, దీపా రెడ్డి, మల్లేశం, బాబు మోజెస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ అల్లర్ల ఘటనలో పలువురి అరెస్ట్

శేరిలింగంపల్లి, జూన్ 24 (జనంసాక్షి) :

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 100, 101లో పలుమార్లు అక్రమాలకు పాల్పడడంతో పాటు పెద్ద ఎత్తున జనాలను సమీకరించి వారికి ప్లాట్లను ఆశగా చూపి అల్లర్లకు కారణభూతమైన వారిపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలకు పూనుకోవడం జరుగుతుందని, అక్రమ ల్యాండ్ గ్రాబింగ్, అమాయకుల సమీకరణ, పుకార్ల ప్రచారం, పోలీసు రెవెన్యూ అధికారులపై రాళ్లదాడి నేపథ్యంలో ఇందులో క్రియాశీల పాత్ర పోషించిన 21 మందిపై పరి సెక్షన్ల కింద కేసులను నమోదు చేయడం జరిగిందని మియాపూర్ ఇన్స్పెక్టర్ సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రధానంగా 307, 333, 447, 147, 148, 120(బి) ఐపి సి, 149(బి) తదితర సెక్షన్ల కింద కేసులు నమో దు చేసి సోమవారం అందులో పది మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అరెస్ట్ అయిన వారిలో రతాలవత్ మోహన్(27), మూ డవ మోహన్ నాయక్(23), బేగరి దేవమ్మ(30), దినేష్ చౌహాన్ (21), అంగుడోత్ కుమార్ నాయక్(28), లబ్ధియా కిషన్(24), అయ్యగారి రవి(33), మంద నగేష్ (26), అంగుడు ప్రభాకర్ (30), బంకల మధు (31) లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగిందని, ఇందులోని కుట్ర కోణాన్ని పూర్తిగా బట్టబయలు చేసేందుకు కేసును పూర్తిస్థాయిలో విచారణ కొనసాగిస్తామని, భూకబ్జాల వెనుక ఎంతటి స్థాయి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని మియాపూర్ ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు.

# ధరణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- ప్రభుత్వ భూమిని ఎట్టిపరిస్థితుల్లోనూ పట్టా భూమి చేయొద్దు
- హిందూ సక్సెస్షన్ యాక్ట్‌ను క్షుణ్ణంగా చదవండి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి బ్యూరో జూన్ 24 (జనం సాక్షి)

ధరణి పెండింగ్ దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహశీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ధరణి, భూమి మార్కెట్ విలువలు, విద్యుత్ సబ్ స్టేషన్లకు భూసేకరణ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూ రికార్డుల పరిరక్షణ, ధరణి దరఖాస్తుల పరిష్కారం పై తహశీల్దార్లకు అవగాహన కల్పించారు. హిందూ సక్సెషన్ యాక్టు ను బాగా చదవాలని, భూ రికార్డుల యాక్టులను క్షుణ్ణంగా చదివి ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ బదలాయింపు ఎన్ని రకాలుగా ఉంటాయి వాటిని ఏవిధంగా నిర్ధారించుకోవాలి అనేది పూర్తి అవగాహన ఉండాలి అన్నారు. తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. పెండింగ్ మ్యూటేశన్, సక్సెశేషన్, కరెక్షన్ వంటి సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలి అనేది అవగాహన కల్పించారు. తహశీల్దార్లు, ఆర్డీఓ తమ లాగిన్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

### భూమి మార్కెట్ విలువల నిర్ధారణ

రిజిస్ట్రేషన్‌లో భూమి మార్కెట్ నిర్ధారిత విలువ చాలా కాలం నుండి ఒకే విధంగా ఉందని, కాలానుగుణంగా మారిన సరాసరి మార్కెట్ విలువ నిర్ధారించి మండలం వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సియంఆర్ ధాన్యం అప్పగింత వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ధాన్యాన్ని ఎఫ్‌సిఐకి అందించడం లేదన్నారు. అందువల్ల తహశీల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లులపై ఒత్తిడి పెంచాలని ఆదేశించారు. సకాలంలో ధాన్యం అప్పగింత జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు భూకేటాయింపు సమస్యలు

విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు తహశీల్దార్లు భూమి సేకరించి విద్యుత్ శాఖకు కేటాయించే క్రమంలో ఉన్న ఇబ్బందులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉంటే వాటిని క్షుణ్ణంగా చదివి తదుపరి చర్యలు చేపట్టి త్వరగా భూమి కేటాయించాలన్నారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీఓ పద్మావతి, వనపర్తి సబ్ రిజిస్ట్రార్ రాజేష్, తహశీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

## నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**కల్హేర్ జూన్ 24 (జనంసాక్షి):**

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఏ ఉద్యోగంలోనైనా బదిలీలు సహజమని, కాని తాను చేసిన పనితీరును బట్టి అక్కడ ప్రజల మనస్సులో ఉండిపోతారని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కల్హేర్ ఉన్నత పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్, సైన్స్ ఉపాధ్యాయుడు బాచ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత కొన్నేళగా కల్హేర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా శ్రీనివాస్ చేసి విద్యార్థులకు బోధించారన్నారు. విధి నిర్వాహణలో శ్రీనివాస్ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారని, ఉత్తమ పనితీరు కనభర్చి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అంతకు ముందు బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ పలువురు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గుండు లక్ష్మణ్, బోజి రెడ్డి, పోచయ్య, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# దొంగలకు రిమాండ్



## డిఎస్పీ ఎన్ లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):**

జల్సాలకు అలవాటు పడి ఇండ్లకు తాళాలు వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించమని డిఎస్పి ఎన్ లింగయ్య తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్కురు గ్రామ ంలో రెండు ఇండ్లలో దొం గతనాలకు పాల్పడిన వారి వివరాలను డిఎస్పి తెలి పారు. ఈనెల 20 అర్ధ రాత్రి వర్కుర్ గ్రామం లో తాళం వున్న ఇంటికి తా ళాలు పగుల గొట్టి బంగారు నగలు వెండి వస్తువులను దొంగ తనం చేయగా వర్కుర్ గ్రామానికి చెందిన ఇంటి యజమాని బొజ్జ మొల్ల సుజాత పిర్యాదు మేరకు21 రోజు మగానూ ర్ పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఈ రోజూ అనగా 24 న ఉదయం 07:00 గంటలకు మగానూర్ పోలీస్ వారు నమ్మదగిన సంచారం మేరకు నల్లగట్టు మా రెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమనితులైన వ్యక్తులను పట్టుకొని విచారించగా వారిలో ఒక వ్యక్తి వర్క్కర్ గ్రామానికి చెందిన ఊరు ముందర నరేశ్ కార్తీక్ అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొండ మండలం పి. కోట కొండ గ్రామానికి చెందిన బోయ వీరేంద్ర ఉరుకుంది ఇద్దరు గత 3 నెలలు గా పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి జల్సా లకు అలవాటు పడినారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఊదేశ్యంతో, ఇద్దరు కలిసి ఈ నెల19.వార్క్కర్ గ్రామానికి వచ్చినారనీ తెలిపారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇండ్లను అదునుగా చూసి వర్క్కర్ గ్రామంలోని నరేష్ ఇంటి వెనకాల వున్న రెండు ఇండ్లలో తాళం వేసి ఉన్నాయి. అది చూసి 20నాడు అర్ధరాత్రి ఇద్దరు కలిసి తాళాలు విరగగొట్టి దొంగతనం చేసినారు. వారి ఇంటిలో అందాజ 6 తులల బంగారం వాటి విలువ 3,00,000/- లక్షల రూపాయలు ,1.5 తులల వెండి, 200 చిల్లర పైసలు, ఒక మొబైలు ఫోన్ దొంగతనం చేసినారని తెలిపారు. ఈ రోజు మగానూర్ పోలీస్ లు పట్టుకొని వారిని విచారించి వారి నుండి 5.5 తులల బంగారూ ఆభరణాలు,1.5 వెండి వస్తువులు, ఒక సాంసంగ్ మొబైలు ఫోన్ 8560/- రూయలు స్వాదినం చేసుకొని ఈ వారిని అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించినందున మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్సై అబ్దుల్ ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవీందర్ సాయికుమార్, రాజశేఖర్ లను డీఎస్పీ అభినందించి వారికి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# డీకే అరుణకు స్టేట్ బీజేపీ చీఫ్

# పదవి వరించేనా..?

- ఆశల పల్లకిలో పార్టీ శ్రేణులు
- పాలమూరు నుంచే గతంలో ముగ్గురు రాష్ట్ర పార్టీల అధ్యక్షులు



**వనపర్తి, జూన్24 (జనం సాక్షి):**

మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణను రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా నియమిస్తారన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. మహిళా కోటాలో కేంద్ర మంత్రి పదవి లభిస్తుందన్న నమ్మకం నెరవేరపోవక పోవడంతో ఆమె అభిమానులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్ నగర్ పార్లమెంటు స్థానం నుంచి విజయం సాధించినందున బీజేపీ అధిష్టానం డీకే అరుణకు కేంద్ర మంత్రి వర్గంలో చోటిచ్చి సముచిత స్థానాన్ని కల్పిస్తారని రాజకీయ పరిశీలకుల చేసిన విశ్లేషణలు కూడా నెరవేర లేదు. దీంతో ఆమెను రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా నియమిస్తారనే చర్చ జరుగుతున్నది.

### చరిత్రలో నిలిచిపోనున్న పాలమూరు

డీకే అరుణకు బీజేపీ చీఫ్ పదవి వరిస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రాజకీయ చరిత్రలో నిలిచిపోనున్నది. ఓ మహిళా ఎంపీని మొట్టమొదటి రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలిగా చేసిన ఘనత బీజేపీకి దక్కనుంది. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా నుంచి వేర్వేరు పార్టీల రాష్ట్ర అధ్యక్షులుగా నలుగురు ఎంపీలు పనిచేయడంతో అరుదైన చారిత్రక రికార్డు నమోదు కానుంది. గతంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడైన దివంగత మల్లు అనంత రాములు, మహబూబ్ నగర్ ఎంపీ మల్లికార్జున్‌లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కావడం వలన రాజకీయ చరిత్రలోనే నలుగురు వివిధ రాష్ట్ర పార్టీల అధ్యక్షులుగా పనిచేయడం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు గర్వకారణంగా నిలుస్తుందనడం అతిశయోక్తి కాదు.

# కలెక్టర్‌ను సన్మానించిన వికలాంగుల వేదిక

**వనపర్తి, జూన్ 24 (జనంసాక్షి):**

వనపర్తి జిల్లాకు నూతన కలెక్టర్‌గా వచ్చిన ఆదర్శ్ సురభిని వికలాంగుల హక్కుల జాతీయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో కలిసి సన్మానించారు. పించన్ల పంపిణీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం నెలకు 6 వేల రూపాయలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారం కొరకు ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ కమిటీ వనపర్తి జిల్లా అధ్యక్షులు జనార్దన్, జిల్లా కార్యదర్శి విజయ్, మహిళా కార్యదర్శి అన్నపూర్ణ, రాంలీ ,సుశీల, వనపర్తి టౌన్ అధ్యక్షురాలు మహేశ్వరి, గణపురం మండలం మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు రాజు, శ్రీరంగాపురం మండల కార్యదర్శి గోవిందమ్మ, పెద్ద మందడి మండల అధ్యక్షులు రాములు, శాంతన్న, మన్నమ్ తదితరులు పాల్గొన్నారు.



# పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులు తలెత్త నీయొద్దు

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనంసాక్షి):**

నారాయణ పేట జిల్లాలో జరుగుచున్న ఉపాధ్యాయుల బది లీలు, ప్రమోషన్‌లలో ఇబ్బందులు రాకుం డా చూడాలని పిఆర్ టియు నాయకులు కో రారు. సోమవారం ప్రక్రియను పరిశీలించడానికి వచ్చిన డీఎస్సీ జెడి మదన్ మోహన్ యాదవ్‌ను కలిసి ప్రమోషన్‌లలో ఎలాంటి ఇబ్బం దిలు రాకుండా, అదేవిధంగా బదిలీలలో ఏమైనా సాంకేతిక సమస్య లు వస్తే వెంటనే పరిష్కారం చేయాలనీ కోరారు. వారు ఎలాంటి ఇబ్బందిలు రాకుండా నిబంధనలకు అనుగుణంగా చేద్దాం అని, అందరూ సహకరించా అని అన్నారు. పలు విషయాలు చర్చిస్తున్న పిఆర్‌టియు నారాయణ పేట జిల్లా అధ్యక్షులు పి. నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. జనార్దన్ రెడ్డి, అధ్యక్షులు లక్ష్మారెడ్డి, మద్దూర్ మండలం ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

# శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

## ఎంపిసి విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంక్




**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,జూన్ 24(జనంసాక్షి):**

సోమవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పలితాలలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు మార్కుల ప్రభంజనం సృష్టించింది. ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులతో జి. పల్లవి స్టేట్ సెకండ్ మరియు జిల్లా ఫస్ట్ ర్యాంకు , డి.కల్యాణి 467 మార్కులతో స్టేట్ మూడవ ర్యాంకు జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించడం జరిగింది. వీరితో పాటు ఎస్. శ్రీవిద్య 466, బిషాల్ జినా 464 మార్కులతో జిల్లా ర్యాంక్ ల ను సాదించడం జరిగింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె. మురళీధర్ రావు మరియు అధ్యాపక బృందం అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు విద్యార్థులను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ రావు మాట్లాడుతూ మా కళాశాలలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని అలాగే ఉచితంగా స్టడీ మెటీరియల్ ను అందిస్తున్నామని మరియు స్వంత ఖర్చులతో ఎమ్ సెట్,నీట్ కోచింగులకు పంపిస్తున్నామని తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



- అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేసిన బీజేవైఎం
- బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి డిమాండ్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, మౌలిక సదుపాయాల మరియు సమస్యల పరిష్కారం, ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజు వసూళ్లు, పుస్తకాలు, స్కూలు డ్రెస్సుల పేరిట చేస్తున్న దోపిడి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి, జిల్లా విద్యాశాఖ అధికారి కి ఫిర్యాదు చేసినట్లు బీజేవైఎం జిల్లా శాఖ అధ్యక్షులు పల్లె తిరుపతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు, సదుపాయాలు అలాగే పెండింగ్‌లో ఉన్న చాలా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తూన్నారని, పాఠ్యపుస్తకాలు, స్కూలు డ్రస్సుల పేరు పై కూడా అధిక మొత్తంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా చేస్తూన్న ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తీసుకొని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మహబూబ్ నగర్ జిల్లా నాయకులు రాచాల శ్రీధర్, నవీన్ రెడ్డి, చెన్నయ్య, నరేందర్, శ్రీశైలం, నరేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలపై శ్రీశైల మల్లన్న ఆశీస్సులు

## ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి)**

శ్రీశైల మల్లికార్జున స్వామి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షిం చారు. ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన సతీసమేతంగా సోమవారం శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల మల్లికార్జున స్వామి ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి



## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

ప్రజావాణి, ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి సోమవారం కలెక్టర్ ఛాంబర్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆమె సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు ఎక్కువ సంఖ్యలో రావడంతో మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా ప్రజలు తీసుకువచ్చిన దరఖాస్తులన్నిటిని స్వీకరించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్‌డిఓ మధు మోహన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎంసి సభ్యులతో కలెక్టర్ భేటీ

నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు సంబంధించిన ఐదుగురు సెంట్రల్ టీం సభ్యులతో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ టీమ్ సభ్యులతో కలెక్టర్ మెడికల్ కళాశాలకు సంబంధించిన నియామకాలు, వివిధ అంశాల గురించి క్లుప్తంగా తెలిపారు. వైద్య కళాశాల నియామకాల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్ గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బయోమెట్రిక్ హాజరు, ఫ్యాకల్టీ, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినందున త్వరలోనే నియమిస్తామన్నారు. మినిమం ఫ్యాకల్టీ ఏర్పాటు చేయాలని, ఇన్ఫెక్షన్ టీమ్ కాంటాక్ట్ బేస్‌పై తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. జిల్లా అడ్మిస్ట్రేషన్ తరపున కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.





# అక్కడ నింగిలో పంటలు పండిస్తారు

సుందరగిరి గ్రామంలో, రవీందదర్‌కి నాలుగు ఎకరాల పొలం ఉంది. భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ వరి పండిరచ కుండా కూరగాయలు పండిస్తున్నాడు. దానికి కారణం తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండిరచాలని అంటాడు. అయినప్పటికీ అతడి కష్టానికి తగిన ఆదాయం లేక నిరాశకు లోనయ్యాడు.

ఆ సమయంలో జనవికాస సంస్థ సభ్యులు అతడికి కొన్ని సూచనలు చేశారు. ఫలితంగా అతడి సాగు విధానమే మారి పోయింది.. " నేను ఇంతకు ముందు, బీర , కాకరను నేలపైన సాగుచేస్తే, ఎకరాకు 5టన్నుల కాయలు మాత్రమే వచ్చేవి. మాకు పందిర్లు మీద సాగు చేయడం నేర్పారు. దీనివల్ల 9 నుండి 12 టన్నుల వరకు దిగుబడి పెరిగింది. బీర, టమాటా కూడా పండిస్తున్నాం. ఇపుడు ఆదాయం పెరగడంతో మాతో పాటు నలుగురు కూలీలకు పని దొరికింది."

తీగజాతి పంటలు నేల మీద కంటే నింగిలో పందిర్ల మీద పండిస్తే, ఎక్కువ ఆదాయం వస్తుందని రవీందర్ తెలుసుకు న్నాడు. ఇతడి విజయాన్ని చూసిన మిగతా రైతులంతా ఆదే బాటలో అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో వ్యవసాయం వర్షాధారమైనది. కూరగాయలు పండిరచే రైతులకు కష్టానికి తగిన ఆదాయం రాక అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక చిన్న ఆలోచనతో ,నూతన సాగుపద్ధతులు ద్వారా మెరుగైన దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. కరీంనగర్ జిల్లా కి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో చిగురుమామిడి మండలంలోనివి సుందరగిరి , బొల్లోనిపల్లి. ఈ గ్రామాల్లో వర్షపాతం చాలా తక్కువ. తీవ్రమైన నీటి ఎద్దడిని రైతులు ఎదుర్కొంటూ, పంటల వ్యవసాయంలో నష్టపోయారు. దీనికి పరిష్కారం దిశగా,జనవికాస రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఈ రెండు గ్రామాల్లో 50 మంది రైతులను ఎంపిక చేసి, నేలమీద పంటలను నింగిలో సాగు చేసేలా ఆధునిక పద్ధతిలో పందిర్ల మీద సాగు విధానంలో శిక్షణ ఇచ్చారు.

**తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టు!**

దేశంలోనే తొలిసారిగా నాబార్డ్ ఆర్థిక సాయంతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టుఇది. రైతుల కోసం పనిచేస్తున్న జనవికాస సంస్థ ద్వారా అమలు చేశారు రైతులకు నష్టాలు పాలు కాకుండా దిగుబడి పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. సేంద్రీయ సాగు పై రైతులకు ఉద్యాన నిపుణుల తో శిక్షణ ఇప్పించారు. హైదరాబా దు, జీడిమెట్లలోని ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్ లో వైవిధ్యమైన పందిర్ల సాగును రైతులకు చూపించి అవగాహన కల్పించారు.

**పంట మార్పిడి పద్ధతిలో**

ప్రతి రైతు 10 గుంటాస్‌లో పందిరి కూరగాయలు, మిగతా 30 గుంటాస్‌లో టమాటా, మిర్చి, వంకాయ, బెండకాయ మొదల్కెనవి సాగుచేస్తున్నారు. 9 ఫీట్ల రాతి స్తంభాలు ఇచ్చి పందిర్లు వేయించారు. కూరగాయల విత్తనాలు, మల్చింగ్ షీట్స్, వర్మీ కంపోస్ట్, వేప పిండి ని కూడా రైతులకు అందించారు.

ఇపుడు ఈ రైతులు ఒకే రకం పంటలు కాకుండా పంట మార్పిడి పద్దతి అనుసరిస్తున్నారు. దీని వల్ల నేల సారం కోల్పోకుండా ఉంటుంది. బహుళ పంటలు సాగు చేస్తున్నారు. ఒక పంట దెబ్బతిన్నా మరో పంటలో లాభం పొందుతున్నారు. ఇలా ఎక్కువ దిగుబడి సాధించి, స్వయం సమృద్ధి సాధించిన రైతులు ఏమంటారంటే

**ఉద్యోగం వదిలి పొలానికి..**

" గతంలో ప్రైవుట్ కంపెనీలో పనిచేస్తూ నెలకు రూ.10 వేలు జీతం పొందే వాడిని,అది సరిపోక ఆ ఉద్యోగం వదిలి వ్యవసా యం చేస్తున్నా.. మాకు పందిర్లకు, మల్చింగ్‌కి సాయం చేసి, వేపపిండి, తక్కువ ధరకు అందించారు. వీటితో సేంద్రియ సద్ధతిలో కూరగాయలు పండిస్తూ ఇపుడు నెలకు రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నాను." అంటారు యువరైతు కిషన్. దిగుబడి పెరిగింది..

**తేమను కాపాడుతున్నాం..**

"గతంలో కూరగాయలు పండిరచేటోళ్లం కానీ, చీడ,పీడల వల్ల చాలా తక్కువ దిగుబడి వచ్చేది. బీర, కాకర నేల మీద పాకించడం వల్ల కాయల్లో నాణ్యత తగ్గిపోయేది. స్వచ్ఛంద సంస్థవారు 20 మంది రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించారు. 50మందికి పందిర్లు వేసుకోవడానికి, మల్చింగ్ కోసం అర్థిక సాయం అందించారు. వీటి వల్ల భూగర్భజలాలను పొదుపు చేస్తు, ఎక్కువ పంటలు సాగు చేస్తున్నాం. మల్చింగ్ షీట్లు కూడా ఇచ్చారు. దీని వల్ల తేమను కాపాడుతున్నాం. కలుపు పెరగడం లేదు. పెరిగిన పంట ఉత్పత్తుల రైతు సంఘాల ద్వారా అమ్ముతూ రైతుకు తోడ్పాటునందిసున్నాం' అంటారు,

రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్, తిరుపతి.

**సొంతంగా ఎరువులు**

" మాకు ఆర్థిక స్తోమత లేక పందిర్లు వేసుకోలేక పోయాం. నాబార్డు సాయం వల్ల ఇపుడు పందిర్లు వేసి, బీర, కాకర, పండిస్తూ అధిక దిగుబడి పొందుతున్నాం. సేంద్రియ ఎరువుల తయారీలో శిక్షణ ఇచ్చారు. దీని వల్ల కూడా మా పొలాల్లో భూసారం దెబ్బతినకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నాం. వీటికి మార్కెట్‌లో డిమాండ్ కూడా ఉన్నది." అంటాడు నాగరాజు.

" పందిర్ల పై తీగలు చిక్కగా అల్లుకుని నీడ ఏర్పడటం వల్ల, కలుపు పెరగలేదు. దీనివల్ల సాగు ఖర్చు తగ్గింది. నేల మీద కాకర పంట 120 రోజుల్లో పూర్తయితే.. అదే పందిరిపై ఆరు నెలల పంట కాలం ఉంటుంది. నేల పైన సాగు చేస్తే, ఎకరాకు 5 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తే.. పందిరిపై 15టన్నులకు పైగా దిగుబడి వస్తుంది." అంటారు మరో రైతు అమృతమ్మ.

**నీటి ఎద్దడిని తట్టుకొని..**

చిగురుమామిడి మండలం తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్న ప్రాంతం. సుందరగిరి, బొల్లోనిపల్లి గ్రామాలలో ఉన్న స్వల్ప భూగర్భజలాలను వినియోగించుకుని ఎక్కువ పంటలను పండిరచడానికి రైతులకు తోడ్పాటు నందించారు ఎన్జీఓలు.

పందిర్ల మీద తీగజాతి కాయగూరలను సాగు చేయడం వల్ల రైతులు తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. నాణ్యమైన సేంద్రియ విధానంలో పండిరచిడం వల్ల మార్కెట్లో గిట్టుబాటు ధరలు పొందుతూ, స్వయం సమృద్ధి సాధించారు. ఆదాయాలు పెరగడం వల్ల గ్రామాలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నాయి. భవిష్యత్‌లో వీరి పంటలకు సేంద్రీయ సర్టి ఫికేట్‌లు కూడా ఇప్పించడానికి నాబార్డు ముందుకు వచ్చింది.

**రైతులు సాధించిన ఫలితాలు**

1. గతంలో తీగజాతి కూరగాయలను నేల మీద సాగు చేయడం వల్ల గాలి, వెలుతురు సోకక, చీడ పీడల బెడద ఎక్కువై నాణ్యత లోపించేది. ఇపుడు పెండాల్స్ వల్ల ఆ సమస్యలు తగ్గి, నాణ్యమైన దిగుబడులు ఇవ్వడమే కాక రైతులకు శ్రమ,ఖర్చు తగ్గింది.
2. కాకర పంట కాలం నేల మీద సాగు చేస్తే, 120 రోజుల్లో పూర్తవుతుంది. అదే పందిరి పై అయితే ఆరునెలల వరకు పంట కాలం ఉంటుంది. కాకరను నేలపైన సాగుచేస్తే, ఎకరాకు 5 నుండి 8 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుంది. అదే పందిరి మీద అయితే 15 నుండి 20 టన్నుల దిగుబడి పెరుగుతుంది.
3. డ్రిప్ సౌకర్యం వల్ల భూగర్భజలాలను పొదుపు చేస్తున్నారు. పండిరచిన కూరగాయలను ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గన్కెజేషన్ల ద్వారా మార్కెట్ చేసుకొని గిట్టుబాటు ధరలు పొందుతున్నారు.
4. అగ్రినిపుణులతో శిక్షణ అనంతరం రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువులను, వాడుతూ, భూసారాన్ని కాపాడుతున్నారు.
5. నింగిలో సాగు వల్ల దిగుబడులు పెరిగి, ప్రతీ రైతు నెలకు రూ. 20 వేల నుండి రూ.30 వేల వరకు ఆదాయం పొందుతూ, సుస్థిర జీవనోపాధులు పొందుతున్నాడు.

బీడు భూముల్లో తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందడానికి ,కూరగాయల సాగుతో ఆహార భద్రత, ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రయోగా త్మకంగా ప్రవేశపెట్టిన ఫార్మ్‌సెక్టార్ ప్రమోషన్ ఫండ్ విజయ వంతమవ్వడంలో రైతుల పట్టుదల, కృషి ఇతర గ్రామాలకు స్ఫూర్తి నిచ్చింది. ఒకపుడు చాలీ చాలని ఆదాయం తో నిరశకు గురైన రైతులు నేడు మెరుగైన ఆర్థిక అభివృద్ధి సాధించి సుస్థిర జీవనోపాధులు పొందుతున్నారు.

'50 మంది రైతులతో సేంద్రియ విధానంలో సాగు బడిని అమలు చేస్తున్నాము. నేల మీద పండిరచే బీర, కాకర పాదులను పందిర్ల మీద పెంచడం వల్ల 50 శాతం అదనంగా దిగుబడి పెరిగింది. ఈ విధానంలో నాటిన 60 నుండి 70 రోజుల్లో కోత కు వస్తున్నాయి. సేంద్రియ ఎరువులతో పండిరచి న కూరగాయలు త్వరగా చెడిపోకుండా నాలుగు రోజుల వరకు నిల్వఉంటున్నాయి. అని జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి సంపత్ కుమార్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్యాతం ప్రమీల సుందరగిరి, కరీంనగర్ జిల్లా





# జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలి
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్

**శంషాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** నిరుద్యోగ యువతకోసం పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాల్లగూడ వెళ్లే ప్రధాన రహదారిలో బీజేవైఎం మండల నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తూ ధర్నా నిర్వహించారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై టిజిపిఎస్‌సి ముందు ధర్నా నిర్వహించగా బీజేవైఎం నాయాకులపై ప్రభుత్వ చేసిన దాడులను వ్యతిరేకి స్తూ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లు గూడా వెళ్లే ప్రధాన రహదారిలో లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులు పైన దాడులు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో టీపీసీసీ అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చారో ఆ హామీలను తక్షణ మే నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలబడుతూ, నిరుద్యోగులకు అండగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేసిందేమీ లేదు అదే ధోరణితో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తునారు. హామీలు నెరవేర్చకపోతే తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి. గ్రూప్ 2 గ్రూప్ 3 నోటిఫికేషన్లలో పోస్టులను అదనంగా పెంచాలి. 25 వేల టీచర్ పోస్టులతో పాటు మెగా డీఎస్సీని నిర్వహించాలి. జాబ్ క్యాలెండర్ ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శ్రీను యాదవ్, సిద్ధు, ప్రదీప్, నర్సింగ్, నర్సింగ్, సాయి, చుక్క ప్రకాష్, ప్రశాంత్, సురేష్, చిన్న, స్వామి, మహేష్, ఆనంద్, వీరేందర్, శ్రీను నాయక్, రాహుల్, శివ, క్యామా శ్రీకాంత్, హరీష్, వినేయ్ కుమార్, మల్లికార్జున్, ప్రవణ్, పవన్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలి

**అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. సోమవారం రోజున కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తో కలసి ప్రజావాణి లో వచ్చిన 121 అర్జీలు దరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల ను ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించా లని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 140 ఫిర్యాదులు

- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ శశాంక



**ఇబ్రహీంపట్నం, జూన్ 24(జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (140) ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డిఆర్ఓ సంగీత తో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు, సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపించడం జరిగిందని, అధికారులు ప్రజా సమస్యలను ఆన్‌లైన్‌లో సత్వరమే పరిష్కరించాలని, ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొని దరఖాస్తులకు ఎండార్స్ వేసి వివరాలు తెలిపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను వారం లోపు పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా కోర్టుకు సంబంధించిన కంటెంట్ కేసులకు మండల తహశీల్దారులు హాజరై వివరణ ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ 'నాలుగు జీవితాలు'

*రోజూ మనం ఎన్ని రకాల జీవితాలను గడుపుతున్నామో మీరెప్పుడ్కెనా ఆలోచించారా? ఒక్కసారి ఆలోచించండి. ఈ తరంలో ప్రతి స్త్రీ ఒకేసారి నాలుగు జీవితాలు గడపాల్సి వస్తుంది. ఒకటి ఫ్యామిలీ లైఫ్, మరొకటి ప్రొఫెషనల్ లైఫ్, ఇంకొకటి సోషల్ లైఫ్, వేరొకటి సోషల్ మీడియా లైఫ్.*



ఫ్యామిలీ లైఫ్: ఇంట్లో ఉన్న అందరి మధ్య ఒక థ్రెడ్‌లా ఉండి, ప్రతి ఒక్కరి అవసరాన్ని సమయానికి గుర్తించి ఆ అవసరం తీర్చాల్సిన బాధ్యత స్త్రీ మీదనే ఉంటుంది. మన కుటుంబాలలో ప్రతి మహిళా మూడు తరాల అంతరాల మధ్య సంఘర్షిస్తూ జీవితం కొనసాగిస్తుంది. పెద్ద తరం అయితే తన వెనకాల రెండు తరాలతోనూ, మధ్య తరం అయితే ముందు తరం, వెనక తరంతోనూ, యువతరం అయితే ముందున్న రెండు తరాలతోనూ అనునిత్యం సంఘర్షణ పడడం అందరికీ అనుభవమే. ఒక తరం నుండి ఇంకొక తరంలోకి వెళ్ళాకే అక్కడ ఉన్న ఇబ్బందులు తెలుస్తాయి. అంతకు ముందు ఆ సమస్యల మీద అవగాహన లేదా అంటే అలాంటిదేమీ ఉండదు. అవగాహన వేరు, అనుభవం వేరు. అవగాహన ఉన్నప్పుడు ఆ సమస్యల యొక్క తీవ్రత అర్థం కాదు. అనుభవించినప్పుడే ఏ సమస్య యొక్క తీవ్రత అయినా అర్థమవుతుంది. మరీ ముఖ్యంగా మధ్యతరంలో ఉన్న స్త్రీల మీద మానసికమైన ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళ అవసరాలను సమయానికి తీరుస్తూ వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి వారి ఆహార నియమాలను నియంత్రించాల్సి ఉంటుంది. పెద్దవాళ్ళకి అది మనస్తాపం కలిగిస్తుంది. మరో పక్క యువతరం వాళ్ళ యొక్క స్నేహాలనీ, వాళ్ళ ప్రవర్తన గాడి తప్పకుండా ఉండేలా నియంత్రణ బాధ్యత తనమీదే ఎక్కువ పడుతుంది. ఇక పెద్ద తరానికి, యువతరానికి మధ్య ఉన్న అంతరాల పట్ల కుటుంబంలో కలతలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మధ్యలో ఉన్న వాళ్ళమీదే పడుతుంది. ఇంట్లో ఉన్న అందరి మధ్యన ఒక ఇరుసులా బాధ్యతలు మోస్తున్న పరిస్థితి ప్రతి ఫ్యామిలీలో ఉంది.

ప్రొఫెషనల్ లైఫ్: మన దేశంలో వృత్తిపరంగా మహిళా ఉద్యోగులతో పోలిస్తే పురుష ఉద్యోగులు ఎక్కువ సమానం అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. మహిళా ఉద్యోగులు ఎంత కష్టపడ్డా సెకండ్ క్లాస్ సిటిజన్స్‌లా మిగిలిపోతారే తప్ప గుర్తిం పుకి నోచుకునే అవకాశం చాలా తక్కువ. ఒకవేళ ఒకరో, ఇద్దరో గుర్తించబడ్డా, ఆ గుర్తింపు వెనకాల ఎన్నో గాసిప్స్‌ని ప్రచారం చేసేస్తారు. 'నాకెందుకు వచ్చిన గుర్తింపు ఇది' అని వాళ్ళు బాధపడాల్సిందే. ఇక ఉద్యోగం చేసే స్త్రీ అంటే అందరికీ అలుసే. ఆఫీసులలో ల్కెంగిక వేధింపుల సంగతి సరేసరి. ఎన్నో చట్టాలున్నా, ఏదీ బయటికి చెప్పుకోలేని పరిస్థితి అన్నది అందరికీ అనుభవమే. ఎందుకంటే ధ్కెర్యంగా తనకి జరుగుతున్న వేధింపులు బయట పెడదామని చూస్తే సహెూద్యోగుల్కెన మహిళలే తోడు రాని పరిస్థితి. అంతవరకూ ఫర్వాలేదు. వెనకాల, వాళ్ళే గాసిప్స్‌ని ప్రచారం చేసేసి పురుషోద్యోగుల కీచకత్వాన్ని మరుగున పడేలా చేసేస్తూ ఉంటారు.

సోషల్ లైఫ్: ఈ సోషల్ లైఫ్‌లోకి మన బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు.. అందరూ వస్తారు. ఈ సోషల్ ల్కెఫ్‌లో బంధువులతో సంబంధాలు చాలా సెన్సిటివ్ గా ఉంటాయి. కుటుంబపరంగా జరిగే ప్రతి కార్యక్రమంలో మన ప్రజెన్స్‌ని గమనిస్తూ ఉండి, ఎప్పుడ్కెనా మనకి వీలుపడక అటెండ్ అవ్వకపోతే దాని యొక్క ప్రభావాన్ని బంధుత్వం లేదా చూపించి కినుక వహిస్తూ ఉంటారు. స్నేహితులకి నచ్చచెప్పగలిగి నంతగా బంధువులకి నచ్చచెప్పడం కష్టం.ఇంకొకటి ఏమిటంటే ఒక స్త్రీ సోషల్ ల్కెఫ్‌లో చాలా వరకు తన స్థాయికి కాస్త అటూ ఇటూగా ఉండేవారు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. దాంతో కంపారిజన్స్ మొదలవుతూ ఉంటాయి. ఎక్కువ తక్కువ భావనలు మొదలవుతాయి. పిల్లల చదువులు, తమ ఉద్యోగాలు, తాము కట్టుకున్న ఇళ్ళు, తమకున్న ఆస్తులు, తమ తమ స్నేహితులు, బంధువులు.. ఇలా కంపారిజన్స్‌కి అంతు అంటూ ఏమీ ఉండదు. ఎప్పుడ్కెతే పోల్చి చూసుకోవడం మొదలవు తుందో దాని ప్రభావం వారి సామాజిక సంబంధాల మీద పడుతుంది. మనశ్శాంతి కరువవుతుంది.

సోషల్ మీడియా లైఫ్: ప్రస్తుత తరం మహిళలకు సోషల్ మీడియా లైఫ్ అన్నది చాలా పెద్ద అవసరంగా మారిపోయింది. మనమెంత దూరంగా ఉందామని అనుకున్నా కుదరని పరిస్థితి వచ్చేసింది. ప్రొఫెషనల్ వర్క్‌ని డిస్కస్ చేయడం కోసమో, అలాట్ చెయ్యడం కోసమో సామాజిక మాధ్యమాలు అవసరంగా మారిపోయాయి. ఒకసారి సామాజిక మాధ్యమాల్లో ఉన్నాక మనకి సంబంధం లేని అనేక విషయాల్లోకి బలవంతంగా లాగబడతాం. మనమెం త పక్కకి తప్పించుకుందామని చూసినా వీలుపడని పరిస్థితులు వస్తూ ఉంటాయి. మనకి ముఖతా పరిచ యం లేని వారు కూడా స్నేహితులుగా, శత్రువులు గా మారుతూ ఉంటారు. ఎవరికి ఎందుకు శత్రు వులవు తామో, ఎందుకు స్నేహితులమవుతామో మనకసలు అర్థం కాదు. దాన్ని అర్థం చేసుకో వడానికి ప్రయత్నించడం అంత తెలివి తక్కువతనం ఏమీ లేదు.

దీని అర్థమేమిటంటే ప్రతి స్త్రీ కూడా ఒక రోజులో నాలుగు రకాల జీవితాల ను జీవిం చాల్సి ఉంటుంది. ఒకేరోజు ఒకే సమయం లో ఒక ల్కెఫ్ నుండి ఇంకో లైఫ్‌కి షిఫ్టవడం ఎంత కష్టమో స్త్రీలుగా మనకు తప్ప మరొకరికి తెలియదు. ఇన్ని జీవితాలనీ మనం ఒకేసారి జీవించాల్సి వస్తుందన్న స్పృహ మనలో చాలా మందికి లేదు. ఒకవేళ విడమరచి చెప్పినా అర్థం చేసుకుంటారన్న నమ్మకమూ లేదు. ఒక జీవితంలో ఒకే సమయంలో ఇన్ని పార్శ్వాలలోకి వెళ్ళి ప్రతి చోటా సమర్థత నిరూపించుకోవాల్సి రావడమే తమకున్న అతి పెద్ద ఛాలెంజ్ అని ఎవరూ అనుకోరు. ఎందుకంటే ఇవన్నీ మన ప్రస్తుత జీవన విధానంలో కలగలసి పోయి ఉన్నాయి కాబట్టి, సమాజం మన ఆలోచనలను అలా ప్రభావం చేసింది కాబట్టి.

గమనించి చూస్తే ఈ నాలుగు రకాల లైఫ్‌లలో ఏ స్త్రీ అయినా ఒకదానిలోనో లేదా రెండిరటిలోనో సమర్థురాలిగా పేరు తెచ్చుకుంటుంది తప్ప అన్నింటిలో కాదు. తన సమర్థత కనిపించని చోటే తనయొక్క మానసిక ఆందోళన మొదలవుతుంది. కానీ అదెందుకు మొదలయిందో అన్న సమాధానం మాత్రం తనకి దొరకదు. ఈ నాలుగు లైఫ్స్ మగవాళ్ళకీ ఉంటాయి. కాక పోతే ఇద్దరి యొక్క సమస్యల తీవ్రత వేరు. అవి తమ తమ జీవితాల మీద చూపించే ప్రభావం వేరు. ముఖ్యంగా ఫ్యామిలీ లైఫ్‌లో కానీ, సోషల్ ల్కెఫ్‌లో కానీ సమస్యల తీవ్రతని ఆడవారి మీదకి నెట్టేసి తాము తప్పించు కుంటారు. వాటిని కేవలం ఆడవారి విషయాలుగా సమాజంలో ప్రచారం చేసేస్తారు. ఇక ఆ సమస్యలను తమ నెత్తిన వేసుకుని వాటి బరువును మొయ్యడం తప్ప వేరే దారి స్త్రీలకు ఉండదు. జీవితంలో బ్యాలెన్స్ కోసం ప్రాక్టీస్ చేస్తుంది. కాకపోతే ఈ నాలుగు రకాల లైఫ్‌లను దాటి మనకి ఒక జీవితం ఉండాలి అన్న సంగతే మనం మరిచిపోతున్నాం. మనల్ని మనకి ఇచ్చే జీవితం కదా మనకి కావాల్సింది. ఆ నాలుగు జీవితాలు మనమీద పెడుతున్న స్ట్రెస్‌ని ఎప్పటికప్పుడు తగ్గించే అవకాశమే లేదా అంటే ఎందుకుండదు.. ఉంటుంది.. మన మనసుకు సంతోషాన్ని ఇచ్చే జీవితం అది. ఒక పువ్వు పూస్తుంటే మురిసిపోతూ వేడుకగా సంతోషపడే సందర్భం,

క పక్షి కూత విని గొంతు కలిపే సంబరం సముద్రపు అలలలో కాళ్ళు కడుక్కుని మనసుని తడుపుకునే సమయం చిన్నిపాప నవ్వులోకి తృళ్ళిపడి బాల్యాన్ని వెనక్కి లాక్కుతెచ్చుకునే పసితనం పుస్తకాలలోకి ప్రయాణం చేసి ప్రపంచాన్ని చుట్టువచ్చిన ధీరత్వం. ఇలా ఎన్నెన్ని ఉన్నాయో కదా మనం కన్న కలలు.. ఎక్కడ ఆగిపోయాయి అవన్నీ.. ఎక్కడ ఘనీభవించాయి? ప్రతి ఇష్టాన్నీ బయటికి తెచ్చుకుందాం. మన రోజువారీ జీవితాల మరుగున మాయమైపోతున్న మన ఇష్టాలన్నిటికీ రోజుకో గంటో..రెండు గంటలో సమయాన్ని ఇవ్వగలిగితే.. మన జీవితంలో మనమూ ఉన్నామన్న చిన్న తృప్తి ఒక్కటి దొరకదూ..!

మన అసలైన లైఫ్ దొరికేది అక్కడ కదా మరి!

- జక్కని కరుణ, హైదరాబాద్

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 జూన్ 2024
తెలంగాణ

# కొత్తగూడెం దాహార్తిని తీర్చేందుకు రూ.124.48 కోట్లతో మంచినీటి పథకం

- సెంట్రల్, స్టేట్, మున్సిపల్ నిధులతో ఏర్పాటు
- 27న శంకుస్థాపనకు రానున్న భట్టి, కోమరెడ్డి, తుమ్మల, పొంగులేటి
- మున్సిపల్ కార్పొరేషన్ కు కృషి
- సింగరేణి పరిరక్షణకు ఎంతటిత్యాగానికైనా సిద్ధమే
- విలేకరుల సమావేశంలో కూనంనేని



**కొత్తగూడెం, జూన్ 24 (జనంసాక్షి):**
కొత్తగూడెం దాహార్తిని తీర్చేందుకు రూ.124.48 కోట్ల సంయుక్త నిధులతో మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం స్థానిక తాటిపెల్లి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచినీటి పథకం శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్కతో పాటు జిల్లా ఇంచార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. కొత్తగూడెంలో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేసామన్నారు. కిన్నెరసాని నుండి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధితో పాటు ఇతర ప్రాంతాలకు 150 కి.మీ మేరా నూతన పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందు కోసం ఖర్చుయ్యే మొత్తంలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు 10 శాతం మున్సిపల్ నిధులు వెచ్చిస్తారని అన్నారు. ఈ నీటి పథకంలో భాగంగా ఇల్లెందు క్రాస్లెడ్ వద్ద 2.65 లక్షల లీటర్ల నీటిని ప్రతి రోజు శుద్ధి చేసే కేంద్రం ఉంటుంది. శుద్ధి చేసిన నీటిని హైలెవల్ ట్యాంకులకు సరఫరా చేసి అక్కడి నుండి ఇంటింటికీ సరఫరా చేస్తారని చెప్పారు. ఇందు కోసం పాతకొత్తగూడెంలో 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, విశ్వనాథ్ కాలనీలో 10 లక్షల లీటర్లు, రామవరంలో 8 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పైపులైన్ల నిర్మాణం సమయంలో పాతపైపులైన్ల లీకులను పూడ్చటంతో పాటు ప్రతీ ఒక్కరికీ నీరు సరఫరా అయ్యేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా అనునిత్యం పర్యవేక్షణ చేస్తూ ప్రజా కట్టడాలు కలకాలం నిలిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.. అదే విధంగా రూ.4కోట్లతో పోస్టాఫీస్ సెంటర్, జివి మాల్ ఏరియాలతో పాటు సెయింట్ మేరీస్ స్కూల్ ఎదురుగా వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**సింగరేణి పరిరక్షణకు త్యాగాలకైనా సిద్ధం**

సింగరేణిని ప్రైవేటీ కరణ చేసి బొగ్గు గనులు వేలం వేసేందుకు నరేంద్రమోడి ఆధ్వర్యంలో కేంద్ర యోచిస్తోందని, దీనికి ఇక్కడి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సిద్ధపడుతున్నారని, తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణిని కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమే అని కూనంనేని అన్నారు. 80 శాతం ఇప్పటికే ప్రైవేటీ కరణవైపు నడుస్తోందని, కోయగూడెంలో అరవిందో కంపెనీ పనులు చేస్తోందని, రామకృష్ణాపురం, సత్తుపల్లి మైన్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలు సాగుతున్నాయన్నారు. గుజరాత్, ఒడిస్సాలో బొగ గనులను ప్రభుత్వమే నిర్వహిస్తుంటే ఇక్కడ ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు 2/2 చేటరన్నారు. సింగరేణి పరిరక్షణకు త్వరలో కార్యాచర్యణ ప్రకటిస్తామని, ఆమరణదీక్ష చేసి రక్షించుకుంటామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకన్న, చలగంటి శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మీ, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణ చారి, మునిగడప పద్మ, కాసుల ఉమారాణి, విజయలక్ష్మీ, బండి నర్సింహా, అనీల్, సత్యభామ, విమల, ఆమని, వేణు, ప్రసాద్, దుర్గ, కో ఆప్షన్ సభ్యులు అనురాధ, బుచ్చయ్య, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, శ్రీధర్, దుర్గాప్రసాద్, మసూద్, రావి రాంబాబు, శ్రీరాములు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ జి. వేంకటేశ్వర రెడ్డి

- 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి..
- భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..
- రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక..





**మణుగూరు, జూన్ 24 (జనంసాక్షి):**
సింగరేణి కాలరీస్ డైరెక్టర్ (ప్లానింగ్ & ప్రాజెక్ట్) జి వేంకటేశ్వర రెడ్డి తమ అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం మణుగూరు ఏరియాలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తో కలిసి ఉపరితల గనులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తిని, య%శీ%త్రాల ద్వారా పికేఓసి-2, పికేఓసి-4 మల్లేపల్లి ఉపరితల గనులలో బొగ్గు లోడింగ్ ప్రక్రియను క్వారిలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణుగూరు ఉపరితల గని అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... మణుగూరు ఏరియాలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్టమైన ప్రణాళికలు వెంటనే రూపొందించుకోవాలి. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పూర్తి స్థాయిలో రక్షణ పాటిస్తూ మణుగూరు ఏరియా 2024-25 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యమైన 126.5 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఓబి లక్ష్యాలను చేరుకునేందుకు రోజు వారిగా లక్ష్యాలను సాధించాలి. పని గంటలు పూర్తిగా సద్వినియోగ పర్చుకుంటూ యాంత్రిక శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి ఓబి వెలికితీత వేగవంతం చేయాలన్నారు. బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకం కలుగకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్య సాధనకు పాటుపడాలని సూచించారు. ఏరియా వార్షిక లక్ష్యాన్ని సాధించడంతో పాటు కంపెనీ వార్షిక లక్ష్యమైన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి తోడ్పడేలా మణుగూరు ఏరియా ఉద్యోగులు, సూపర్వైజర్లు, అధికారులు తన వంతు బాధ్యత నిర్వర్తించాలి. వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా ఉపరితల గనులలో చేరే వర్షపు నీటిని డిపార్ట్మెంటల్ మరియు ఔట్ సోర్సింగ్ ద్వారా బయటకు పంపే విధంగా ముందస్తు చర్యలు చేబట్టి సరిపడా మోటార్లు కండిషన్లో ఉండేలా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకొని అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి పికేఓసీ డి. శ్యామ్ సుందర్, ఏరియా ఇంజినీర్ ఎం నర్సీ రెడ్డి , ప్రాజెక్ట్ అధికారి కేపియూజి టి వీరభద్ర రావు, ప్రాజెక్ట్ మేనేజర్ పికేఓసి రాంబాబు, ప్రాజెక్ట్ ఇంజినీర్ పికేఓసి వీరభద్రుడు , డీ జి ఎం (పర్సనల్) ఎస్ రమేష్. మేనేజర్ పికేఓసి సురేశ్ , మేనేజర్ ఎంఎన్జిఓసి రాజేశ్వర రావు , ఏరియా సెక్యూరిటి అదికారి షబ్బీరుద్దీన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్ జితేష్ పాటిల్..

**కొత్తగూడెం, జూన్ 24 (జనంసాక్షి):**
ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వీవీ ప్యాడ్స్ లో స్లిప్పుల తొలగింపు, అడ్రస్ టాక్స్, ధర్మల్ పేపర్స్ రిమూవల్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ఫ్యాడ్స్ నిల్వ ఉంచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ట భద్రత కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గోడౌన్ పక్కన ఉన్న పాత బిల్డింగ్ ను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో ఎన్నికల ప్రక్రియ సమయంలో కావాల్సిన షెడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈవీఎంలు, వీవీ ఫ్యాట్ లు పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు దారా ప్రసాద్, రంగా ప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, బి ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్, ఆమ్ ఆద్మీ,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం

**ప్రతి ఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి**

**ప్రత్యేక అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ ఇందిరా**



**దేవరకొండ జూన్ 24 జనంసాక్షి**
ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించాలన్న ఉద్దేశంతో మండల ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రత్యేక అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ ఇందిరా తెలిపారు.సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 72 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీరాములు, ఎంపీడీవో జే. సుదర్శన్ రెడ్డి, తహసిల్దార్ సంతోష్ కిరణ్, వ్యవసాయ అధికారి రవికుమార్, ఎంపీఓ నీలిమ, ఏటీఎం జయప్రసాద్, ఎంఈఓ మాత్రు నాయక్,మహమ్మద్ లతీఫ్ సీనియర్ అసిస్టెంట్ వివిధ శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



# వద్దిరాజు రవిచంద్ర కు నామ శుభాకాంక్షలు

## రాజ్యసభ లోపల, బయట బాగా పోరాడారు..



**ఖమ్మం ఆర్సి,జూన్24(జనంసాక్షి):**
:రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ గా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు నియమించడం పట్ల పార్టీ మాజీ లోక్ సభా పక్ష నేత, మాజీ ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసి, ఆయన్ని అభినందించి, శుభా కాంక్షలు తెలియజేశారు. కేసీఆర్ ఆశీస్సులతో ఆయన ఇటీవలే రెండో సారి రాజ్య సభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమేనని, బీసీ వర్గానికి చెందిన రవిచంద్రను.. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేతగా నియమించడం అభిన్సందనీయమని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర విభజన సమస్యలు, రాష్ట్రానికి రావా ల్సిన నిధులు, ప్రాజెక్టులు సాధనకు గతంలో లోక్ సభ నాయకత్వంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించి, క్రియా శీలక పాత్ర పోషించారని నామ పేర్కొన్నారు. రాజ్యసభ సభ లోపల, బయట రాష్ట్ర సమస్య లపై విభిన్నమైన రీతిలో పోరా డిన నాయకుడని, అందుకే తాను రెండోసారి కూడా ఆయన్ని రాజ్యసభ కు పంపిం చాలని కేసీఆర్ ను కోరడం జరిగిన సంగతిని గుర్తు చేశారు. భవిష్యత్ లో వద్దిరాజు రవి చంద్ర డిప్యూటీ లీడర్ గా మరిం త చైతన్యవంతమైన పాత్ర పోషిస్తారని నామ నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

**రామచంద్రయ్య మృతికి నామ సంతాపం**

మణుగూరు ప్రాంతానికి చెందిన డోలు వాయిద్య జానపద కళాకారుడు , పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వేరొక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసి, నివాళ్ళు ర్పించారు.జానపద కళల్లో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు.వన దేవతల చరిత్రను ప్రజలకు వివరించడంలో ఆయన దిట్ట అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను ఆయన కాపాడారని అన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు..వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నామ నాగేశ్వరరావు కోరారు..

# ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్



**చింతపల్లి జూన్ 24 (జనంసాక్షి):**
సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలన్న ఉద్దేశంతో మండల ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మొదటి సోమ వారం ఆయన నల్గొండ జిల్లా చింతపల్లి, మండలం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజావాణి కార్యక్రమం జరిగే తీరుతెన్నులను తెలుసుకోవడమే కాకుండా ,మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రజావాణి కార్యక్రమం పై మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతేకాక జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి మండల ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు.ఎక్కడి సమస్యలకు అక్కడే పరిస్కారందొరకాలని, ప్రత్యేకించి గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం కావాలన్న ఉద్దేశ్యంతో మండల స్థాయి ప్రజావాణి చేపట్టామన్నారు. ప్రతి సోమ వారం రెగ్యులర్ గా ప్రజావాణి నిర్వహించాలని,ప్రతి ఫిర్యాదును క్షున్నంగా చదవాలని, పరిష్కారం అయ్యేవి వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పిర్యాదుదారుకు స్పష్టంగా చెప్పాలన్నారు.ప్రతి సోమ వారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని, ఆ సమావేశంలో రాబోయే వారం, నెలలో చేయాల్సిన పనులు చర్చించాలని సూచించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ ప్రజల వద్దనుండి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులను తన వద్దకు పిలిపించుకుని సమస్యల పై చర్చించి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ,ఆర్ డి ఓ శ్రీరాములు,మండల ప్రత్యేకాధికారి సక్కుబాయి, ,తహసీల్దార్, విజయకుమార్, ఎంపిడివో.సుజాత, , ఎంపిపి కొండూరు భవాని పవన్ కుమార్, ఇతర అధికారులు,తదితరులు హాజరయ్యారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలి

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్గొండటౌన్, జూన్ 24(జనంసాక్షి)**
ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 80 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ రోజు వచ్చిన పిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన పిర్యాదులు రావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



# జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను సన్మానించిన ఐవిఓ సభ్యులు

**ఐవిఓ ఆధ్వర్యంలో కోదాడలో 100 అడుగుల జాతీయ జెండా నిర్మాణం**

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి) :**
సూర్యాపేట జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తేజస్ నందలాల్ పవార్ ను ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.విద్యార్థులు,యువత, ప్రజలలో జాతీయ భావాన్ని, ఐక్యతను, దేశభక్తిని పెంపొందించడం కొరకు ఆగస్టు 15న కోదాడలో ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న 100 అడుగుల జాతీయ జెండా నిర్మాణం, కార్యక్రమ నిర్వహణ గురించి వివరించారు. అనంతరం ఐవీఓ జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర కో ఆర్డినేటర్ గుండా మధుసూదన్ రావు మాట్లాడుతూ గతంలో కోదాడలో మహావీర్ చక్ర కల్నల్ సంతోష్ బాబు, కార్గిల్ వీరులు గోపయ్య విగ్రహాలను ఐవీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కోదాడలో తమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 100 అడుగుల జాతీయ జెండా దేశంలోనే ఐవీఓ తరుపున మొట్టమొదటి విగ్రహం కావడం సూర్యాపేట జిల్లాకే గర్వకారణమని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న ఐవిఓ సభ్యులను జిల్లా కలెక్టర్ అభినందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐవిఓ వైస్ ప్రెసిడెంట్ ఎన్.రామారావు,ట్రెజరర్ కె.వెంకన్న, కో ఆర్డినేటర్ జి.వెంకన్న, జిల్లా పాట్రన్ జగిని ప్రసాద్, జిల్లా పీఆర్ఓ సేకు రమేష్, కార్యదర్శి జి.గోపీనాథ్, కో ఆర్డినేటర్ ఐ.చక్రి, ఈసీ మెంబర్ వి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల వెల్లువ

**చిట్యాల జూన్ 24(జనం సాక్షి):**
మొదటి ప్రజావాణి కార్యక్రమాన్ని చిట్యాల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నాడు మండల నోడల్ అధికారి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు.అన్నీ శాఖలకు సంబంధించి మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయి అందులో గ్రామీణ ప్రాంతాల దరఖాస్తులు 59, మున్సిపాలిటీ కేంద్రం పరిధినుండి 2 దరఖాస్తులు రావడం జరిగింది. ప్రజావాణి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పూర్ణచంద్రరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కొరకై ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదుని ఆన్లైన్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సమస్యను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య ఇక్కడే పరిష్కారం కావాలని జిల్లా స్థాయికి వచ్చే విధంగా ఉండకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండ్లు, విద్యుత్, పెన్షన్, భూ సమస్యలు, రేషన్కార్డులు, ఉపాధి, వాటి సమస్యల గూర్చి దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జి.కృష్ణ, మున్సిపల్ కమిష నర్ పి.వీరేందర్, ఎంపీడీవో ఎస్.పి జయలక్ష్మి,ఎంపిఓ బి.సత్య నారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విపణి



## ఆరంభ నష్టాల నుంచి గట్టెక్కి.. లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు..
ఐసీఐసీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. నిఫ్టీ 23,500 ఎగువన ముగిసింది.
సెన్సెక్స్ 76,885 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,209.90) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు నష్టాల్లోనే కొనసాగింది. 11 గంటల తర్వాత లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 77,423.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 131.18 పాయింట్ల లాభంతో 77,341 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.30 పాయింట్ల లాభంతో 23,547 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.48 గా ఉంది.
సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 85.58 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 2,337 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



## క్రెడ్, ఫోన్‌పేలో క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులు

# నిలిచిపోనున్నాయా?



క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల కోసం చాలా మంది ఫోన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను వాడుతుంటారు.
రివార్డు పాయింట్లు వస్తాయనో, బిల్లు చెల్లింపులన్నీ ఒక చోట ఉంటాయనో.. చాలా మంది వీటిని వినియోగిస్తుంటారు. ఒకవేళ మీరూ ఇలానే క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తుంటే జూన్ 30 తర్వాత అవాంతరాలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఆర్‌బీఐ తీసుకొచ్చిన నిబంధనలే దీనికి కారణం.
క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ ద్వారానే జరగాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. జులై 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బిల్లు చెల్లింపుల్లో సమర్థత, భద్రతను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా బ్యాంకులు భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కోటక్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ వంటి 8 బ్యాంకులు మాత్రమే ఈ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు ఇంకా ఈ పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోలేదు. అతి ఎక్కువ క్రెడిట్ కార్డులు జారీ చేసిన సంస్థలు కూడా ఇవే కావడం గమనార్హం. ఆయా బ్యాంకులు భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోకపోవడం వల్ల ఫోన్ పే, క్రెడ్ వంటి కంపెనీలు కస్టమర్ల క్రెడిట్ కార్డుల బిల్లులను ప్రాసెస్ చేయలేవు. దీనివల్ల ఆయా యాప్స్‌లో క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించడం వీలు పడదు. అయితే, బ్యాంక్ వెబ్‌సైట్, యాప్ ద్వారా యథావిధిగా చెల్లింపులు చేయడంలో ఎలాంటి ఇబ్బందులూ లేవు. దీనికి సంబంధించిన గడువు పొడిగించాలని పరిశ్రమ వర్గాలు ఆర్‌బీఐని కోరుతున్నాయి.

| గుడ్ల ధరలు | |
|---|---|
| హైదరాబాద్ | వరంగల్ |
| ₹5.15 | ₹ 5.17 |

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹66,350 (22 క్యారెట్లు) | ₹72,380 (24 క్యారెట్లు) |
| చెన్నై ₹66,950 (22 క్యారెట్లు) | ₹ 73,040 (24 క్యారెట్లు) |

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 96,500

## ఎల్ఐసీ ఆఫ్ ఇండియా పాలసీదారులకు నోటీసు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ప్రస్తుత పాలసీ హోల్డర్‌లు కలిగి ఉన్న (విక్రయం/బదిలీ, అసైన్‌మెంట్ లేదా ఇతరత్రా) పాలసీలను పొందేందుకు (అమ్మకం/బదిలీ ద్వారా, అసైన్‌మెంట్ లేదా ఇతరత్రా) అందించే ఉత్పత్తి / సేవా సమర్పణలకు సంబంధించిన విషయాలను ఎల్ఐసీ వెల్లడించింది. 'ఎల్ఐసీ అటువంటి సంస్థతో లేదా అటువంటి సంస్థలు అందించే ఉత్పత్తులు లేదా సేవలతో అనుబంధించ బడలేదు. ఎల్ఐసీ మాజీ ఉద్యోగులు/పర్సనల్ చేసిన ఏవైనా ప్రకటనలు అటువంటి వ్యక్తులకు వ్యక్తిగత మైనవి. మా బాధ్యత లేదు' అని ప్రకటించింది. ఎల్ఐసి పాలసీల ఏదైనా విక్రయం/బదిలీ లేదా అసైన్‌మెంట్‌ను బీమా చట్టం, 1938 ప్రకారం సెక్షన్ 38తో సహా చేపట్టాలి. వర్తించే చట్టాల ప్రకారం, పాలసీల విక్రయం/బదిలీ లేదా అసైన్‌మెంట్‌పై చర్య తీసుకోవడానికి ఎల్ఐసీ నిరాకరించవచ్చు. అటువంటి విక్రయం/బదిలీ లేదా అసైన్‌మెంట్ విశ్వసనీయమైనది కాదని లేదా పాలసీదారుకు లేదా ప్రజా ప్రయోజనాలకు సంబంధించినది కాదని విశ్వసించడానికి తగిన కారణం ఎల్ఐసీకి ఉంది. బీమా పాలసీ ట్రేడింగ్ ప్రయోజనం కోసం వారి ఆర్థిక భద్రత, వారి కుటుంబానికి రిస్క్ కవర్‌కు హాని కలిగించే పాలసీపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పాలసీదారులందరూ పూర్తి జాగ్రత్త వహించాలని తాము కోరుతున్నట్టు పేర్కొంది. ఏదైనా ఆఫర్‌లకు ప్రతిస్పందించే ముందు, దయచేసి తమ బ్రాంచ్‌లలోని ఎల్ఐసీ అధికారులలో సంప్రదించాలని సూచించింది.

## రోజుకు గ్యాలన్ నీరు తాగి.. 10రోజులు ప్రాణాలు కాపాడుకొని..!



సరదాగా మూడు గంటలపాటు హైకింగ్‌కు(కొండల్లో నడవటం) వెళదామనుకొని బయల్దేరాడు ఆ వ్యక్తి. కానీ, అతడి టైం బాగోలేదు.. మార్గం తప్పాడు.
తిరిగి అతడు ఆ పర్వతాల నుంచి బయటపడటానికి 10 రోజులు పట్టింది. రోజుకు కొంత నీరు, అక్కడక్కడా దొరికే వైల్డ్ బెర్రీలతో మాత్రమే ప్రాణాలు నిలుపుకొన్నాడు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన లూకాస్ మెక్లిష్ అనే వ్యక్తి జూన్ 11న సరదాగా ది శాంటక్రజ్ పర్వతాలపైకి ఓ మూడు గంటల పాటు హైకింగ్‌కు వెళదామనుకొన్నాడు. అతడు కొద్దిసేపు నడిచాక దారి తప్పాడు. ముఖ్యంగా ఆ మార్గంలో ఉండాల్సిన గుర్తులు కార్చిచ్చు కారణంగా ధ్వంసమయ్యాయి. దీంతో అతడు తీవ్ర గందరగోళానికి గురయ్యాడు. అతడు కుటుంబ సభ్యులు జూన్ 16 వరకు ఎదురుచూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెక్లిష్ కోసం గాలింపుచర్యలు చేపట్టారు. ఎవరో సాయం కోసం అరవడం గమనించినా.. కచ్చితంగా అతడు ఎక్కడ ఉన్నాడో గుర్తించలేకపోయారు. కొన్ని రోజులపాటు గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో గత వారం పలు డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టారు. అతడు పురాతన బిగ్ బేసిన్ రెడ్‌ఉడ్ స్టేట్ పార్క్‌లో చిక్కుకుపోయినట్లు గుర్తించారు. అత్యంత నీరసంగా ఉన్న పరిస్థితుల్లో అతడిని రక్షించారు. అతడి వద్ద ఓ ఫ్లాష్ లైట్, ఫోల్డింగ్ సిజర్స్, బూట్లు మాత్రమే ఉన్నాయి. చిన్నచిన్న సెలయేర్లలో పారే నీటిని రోజుకు ఒక గ్యాలన్ తాగి ప్రాణాలు కాపాడుకొన్నాడు. అడవిలో అక్కడక్కడా లభించే వైల్డ్ బెర్రీస్‌తోనే పొట్ట పోసుకొన్నట్లు మెక్లిష్ చెప్పాడు. అమెరికా లోని ఇలాంటి చిక్కటి అడవుల్లో తప్పిపోతే ప్రాణాలతో బయటపడటం చాలా కష్టం.

## హీరో మోటోకార్ప్ వాహన ధరలు పెంపు.. 1 నుంచి కొత్త ధరలు




దిల్లీ: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన వాహనాల ధరలను పెంచనుంది. ఎంపిక చేసిన మోటార్ సైకిళ్లు, స్కూటర్ల ధరలు పెంచుతున్నట్లు హీరో మోటోకార్ప్ సోమవారం తెలిపింది. గరిష్ఠంగా రూ.1500 వరకు ఈ పెంపు చేపడుతున్నట్లు పేర్కొంది. జులై 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరిగినందునే ధరలు పెంచాల్సి వచ్చిందని హీరో ఓ ప్రకటనలో తెలిపింది. మోడల్‌ను బట్టి, మార్కెట్‌ను బట్టి ఈ పెంపు ఉంటుందని తెలిపింది. హీరో సంస్థ స్ప్లెండర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, గ్లామర్ వంటి మోటార్ సైకిళ్లతో పాటు జూమ్, డెస్టినీ 125 ఎక్స్‌టెక్ వంటి స్కూటర్లను విక్రయిస్తోంది. హీరో మోటోకార్ప్ షేరు స్వల్ప లాభంతో రూ.5,477 వద్ద ట్రేడవుతోంది.

## భారత్‌లోకి 'మెటా ఏఐ'.. వాట్సప్, ఎఫ్‌బీ, ఇన్‌స్టాలో ఏఐ అసిస్టెంట్




దిల్లీ: బిలియనీర్ మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని టెక్ సంస్థ మెటా రూపొందించిన ఏఐ అసిస్టెంట్ 'మెటా ఏఐ' భారత్‌లో అందుబాటులోకి వచ్చింది. వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్ సహా మెటా.ఏఐ పోర్టల్‌లో దీన్ని ఉపయోగించుకోవచ్చని సోమవారం వెల్లడించింది. యూజర్లు ఇకపై మెటా ఏఐ ని సామాజిక మాధ్యమ యాప్‌లలో చాటింగ్, కంటెంట్ క్రియేషన్ సహా ఆయా టాపిక్‌లపై లోతుగా శోధించేందుకు ఉపయోగించుకోవచ్చు. యాప్‌లను వీడకుండానే కావాల్సిన పనిని పూర్తి చేయొచ్చు. మెటా రూపొందించిన లామా3 ఎల్‌ఎల్‌ఎం ఆధారిత ఏఐ అసిస్టెంట్‌ను భారత యూజర్లకు అందుబాటులోకి తెచ్చినట్లు కంపెనీ తెలిపింది.
మెటా ఏఐ సాయంతో వాట్సప్ గ్రూప్ చాట్‌లో దగ్గర్లోని రెస్టారెంట్ల వివరాలు తెలుసుకోవచ్చు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు కాసేపు విడిది కోసం ఎక్కడ ఆగొచ్చో ఆరా తీయొచ్చు. వెబ్‌లో మల్టిపుల్ ఛాయిస్ టెస్ట్‌ను క్రియేట్ చేయమని కూడా మెటా ఏఐని కోరవచ్చు. ఇలా యూజర్లకు పలు రకాలుగా ఈ ఏఐ అసిస్టెంట్ అండగా ఉంటుంది. ఫేస్‌బుక్ వాడుతున్నప్పుడు మీకు కావాల్సిన ఫీడ్‌ను వెతికిపెట్టడంలో మెటా ఏఐ సాయంగా ఉంటుంది. ఓ పోస్ట్‌పై లోతైన సమాచారం తెలుసుకునేందుకూ వాడుకోవచ్చు. ఏదైనా పర్యటక స్థలం చిత్రం ఎఫ్‌బీలో కనిపించినప్పుడు.. అక్కడికి వెళ్లడానికి ఏ సమయం అనుకూలంగా ఉంటుందో ఏఐ అసిస్టెంట్‌ను అడిగితే సరిపోతుంది.

## బైజూస్‌లో 4 వేల కోట్ల పెట్టుబడి.. ఇప్పుడు సున్నా..!




ఆర్థికంగా కుదేలైన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో భారీగా పెట్టుబడులు కుమ్మరించిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ ఎన్‌వీ నిండా మునిగింది.
ఆ కంపెనీ పెట్టుబడి ఇప్పుడు సున్నాకు చేరింది. ఈ క్రమంలోనే బైజూస్‌లో తమ వాటాను సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసుకుంటున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. తద్వారా తమకు 493 మిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ.4 వేల కోట్ల పైమాటే) మేర నష్టం వాటిల్లినట్లు ఆ కంపెనీ నెదర్లాండ్స్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో పేర్కొంది.
బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ సంస్థ తెలిపింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో తమకు 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని తన వార్షిక నివేదికలో పేర్కొంది. రైట్స్ ఇష్యూకు ముందు బైజూస్‌లో తమకు 9.6 శాతం వాటా ఉందని ఆ కంపెనీ పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్ అంచనాలకు సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను తాము సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి పేర్కొన్నారు. పెట్టుబడికి ప్రతిఫలాన్ని కొలిచే ఐఆర్‌ఆర్‌ను మైనస్ 100 శాతంగా వాటాదారులకు తెలియజేసింది.

**బైజూస్‌పై విమర్శలు**

బైజూస్‌లో 2018లో తొలి పెట్టుబడి పెట్టిన ప్రోసస్ సంస్థ.. కంపెనీలో పాలనాపరమైన లోపాలున్నాయంటూ గతంలోనే బహిరంగంగా విమర్శలు గుప్పించింది. 2023 జులైలో బైజూస్ బోర్డులో డైరెక్టర్‌గా వ్యవహరించిన వ్యక్తి రాజీనామా అనంతరం ఈ విమర్శలు చేసింది. కంపెనీలో కార్పొరేట్ పాలనలో లోపాల గురించి తమ డైరెక్టర్ పలుమార్లు సలహాలు ఇచ్చినా కంపెనీ పెడచెవిన పెట్టిందని ఆరోపించింది. ఈ క్రమంలోనే 22 బిలియన్ డాలర్లుగా పేర్కొన్న బైజూస్ విలువను 5.1 బిలియన్ డాలర్లకు ప్రోసస్ తగ్గించింది. ఇప్పుడు ఏకంగా సున్నాకు కుదించింది. కొన్ని నెలల క్రితం జరిగిన ఈజీఎం నిర్వహించి రవీంద్రన్‌ను తొలగిస్తూ తీర్మానం చేయడంలోనూ ఈ సంస్థ కీలకంగా వ్యవహరించింది. దీనిపై బైజూస్ సంస్థ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. దీంతో బైజూస్‌తో న్యాయపోరాటం చేస్తోంది.

## ఎఫ్‌పీఓను భగ్నం చేయాలనే హిండెన్‌బర్గ్ ఆరోపణలు: గౌతమ్ అదానీ



దిల్లీ: అమెరికా షార్ట్‌సెల్లర్ గత ఏడాది అదానీ గ్రూపుపై చేసిన ఆరోపణలు కుట్రపూరితమైనవని ఛైర్మన్ గౌతమ్ అదానీ పునరుద్ఘాటించారు.
తమ మలిదశ పబ్లిక్ ఆఫర్ )ను భగ్నం చేయాలనే ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు గుప్పించారని పేర్కొన్నారు. అదానీ గ్రూప్ 32వ వార్షిక సమావేశంలో మాట్లాడుతూ సోమవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
హిండెన్‌బర్గ్ ఆరోపణల వెనక రాజకీయ శక్తులు కూడా ఉన్నాయని అదానీ ఆరోపించారు. వీటిని మీడియాలోని ఒక వర్గం మరింత ఎక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించిందన్నారు. తద్వారా తమ గ్రూప్ ప్రతిష్ఠను దిగజార్చి కంపెనీల మార్కెట్ విలువను కుంగదీయాలని చూశారన్నారు. తమ కంపెనీలను అప్రతిష్ఠ పాల్జేసి ఆర్థికంగా హాని తలపెట్టాలనే ఉద్దేశంతోనే అలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. తద్వారా తమ గ్రూప్‌పై మార్కెట్ వర్గాల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారని ఆరోపించారు.
హిండెన్‌బర్గ్ నిరాధార ఆరోపణలన్నింటినీ తాము సమర్థంగా ఎదుర్కొన్నామని అదానీ తెలిపారు. రూ.17,500 కోట్ల రుణ వాయిదాలను ముందస్తుగా చెల్లించి మదుపర్లు, రుణదాతల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలిగామని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓ విషయంలోనూ తమ కంపెనీ నైతిక విలువలకు కట్టుబడి వ్యవహరించిందని తెలిపారు. రూ.20 వేల కోట్లు సమీకరించినప్పటికీ.. వాటన్నింటిని తిరిగి ఇచ్చేశామని గుర్తుచేశారు. ఇన్వెస్టర్ల ప్రయోజనాలు, విలువలతో కూడిన వ్యాపారంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.
అదానీ వార్షిక వేతనం రూ.9.26 కోట్లు
తమ స్థానంలో ఇంకే కంపెనీ ఉన్నా.. తిరిగి కోలుకోవడం సాధ్యం అయ్యేది కాదని అదానీ (%ూఙఋఅఱ%) అభిప్రాయపడ్డారు. తమ వద్ద ఉన్న అధిక ద్రవ్య లభ్యతే తమని కాపాడిందని తెలిపారు. నగదు నిల్వలను మరింత పెంచుకోవడం కోసం రూ.40వేల కోట్లు అదనంగా సమీకరించినట్లు వెల్లడించారు.

**ఇవీ హిండెన్‌బర్గ్ ఆరోపణలు..**

అదానీ గ్రూప్ తమ నమోదిత కంపెనీల షేర్ల ధరల్ని కృత్రిమంగా పెంచిందని 2023 జనవరి 23న వెలువడిన నివేదికలో అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. అలా విలువ పెరిగిన షేర్లను తనఖా పెట్టి రుణాలు పొందిందని ఆరోపించింది. అకౌంటింగ్ మోసాలకు పాల్పడినట్లు పేర్కొంది. పన్నుల విషయంలో స్నేహపూరితంగా ఉండే కరీబియన్, మారిషస్‌ల నుంచి యూఏఈ దేశాల్లో అదానీ కుటుంబం పలు డొల్ల కంపెనీలను నియంత్రిస్తోందని తెలిపింది. వీటిద్వారానే అవినీతి, అక్రమ నగదు బదలాయింపులకు పాల్పడుతోందని ఆరోపించింది. ఈ ఆరోపణల్ని అదానీ గ్రూప్ తీవ్రంగా ఖండించింది. పలు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దీంతో కంపెనీల షేర్లు తిరిగి భారీగా పుంజుకున్నాయి.

జనంసాక్షి

# జాతీయం అంతర్జాతీయం

## సంపద పన్నుకు 74% మంది భారతీయుల మద్దతు!

దిల్లీ: అత్యంత ధనవంతులపై 'సంపద పన్ను' విధించే అంశాన్ని పరిగణలోకి తీసుకోవడానికి వచ్చే నెలలో జీ20 కూటమి దేశాల ఆర్థిక మంత్రులు సమావేశం కానున్నారు.
ఈ తరుణంలో సభ్యదేశాల్లోని 68 శాతం మంది ప్రజలు ఈ ప్రతిపాదనకు మద్దతిస్తున్నారని ఓ ప్రముఖ సర్వే వెల్లడించింది. భారత్‌లో ఏకంగా 74 శాతం మంది దీనిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపింది. ప్రపంచ ఆకలి, ఆర్థిక అసమానతలు, వాతావరణ మార్పులు వంటి సమస్యల పరిష్కారానికి సందప పన్ను సరైందేనని అభిప్రాయపడ్డారు.
ఈ సర్వేను ఎర్త్4ఆల్, గ్లోబల్ కామన్స్ అలయన్స్ సంయుక్తంగా నిర్వహించాయి. జీ20 సభ్యదేశాల్లోని దాదాపు 22,000 మంది పౌరుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సంపన్నులపై పన్ను ప్రతిపాదన 2013 నుంచి చర్చలో ఉంది. ఏటా దీనికి మద్దతు పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం జీ20 కూటమికి బ్రెజిల్ అధ్యక్షత వహిస్తోంది. సంపద పన్ను అంశంపై ఏకాభిప్రాయానికి కృషి చేస్తోంది. జులైలో జరిగే ఆర్థిక మంత్రుల సమావేశంలో ఉమ్మడి ప్రకటన వెలువడేలా ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

అదానీ వార్షిక వేతనం రూ.9.26 కోట్లు
ఈ ప్రతిపాదన వెనక ఫ్రెంచ్ ఆర్థికవేత్త గాబ్రియేల్ జుక్మాన్ కీలక పాత్ర పోషించారు. ఆయన మంగళవారం ఓ నివేదికను విడుదల చేయనున్నారు. సంపద పన్ను (%ఔముశ్రీష్ట్ర ఖఇ%) ఎలా పనిచేస్తుంది? ఎంతవరకు ప్రభావం చూపనుందో అందులో వివరించనున్నారు. జుక్మాన్ ప్రకారం.. "సాధారణ ప్రజలతో పోలిస్తే సంపన్నులు చాలా తక్కువ పన్ను చెల్లిస్తారు. సంపద పన్ను వల్ల అంతర్జాతీయంగా ఓ ప్రమాణం ఏర్పడుతుంది. ప్రతి దేశంలోని బిలియనీర్లు తమ సంపదలో కనీసం 2 శాతం వార్షికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది" అని ఆయన వివరించారు.

భారతీయుల మనోగతం..
సర్వే నివేదిక ప్రకారం.. భారతీయుల్లో చాలామంది వాతావరణ మార్పులు, ప్రకృతి సంరక్షణకు సంబంధించి తక్షణమే సంస్కరణలు చేపట్టాలని కోరుకున్నారు. సంపన్నులపై విధించిన పన్నుతో వచ్చే ఆదాయాన్ని అందుకోసం ఉపయోగించాలని వారు ఆకాంక్షించారు. సార్వజనీన కనీస ఆదాయానికి 71 శాతం, ఉద్గారాల నివారణకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై 74 శాతం, మెరుగైన వర్క్‌-లైఫ్ బ్యాలెన్స్‌కు 76 శాతం మంది మద్దతిచ్చారు. విద్యుదుత్పత్తి, రవాణా, నిర్మాణం, పరిశ్రమలు, ఆహారం ఇలా అన్నిరంగాల్లో వచ్చే దశాబ్ద కాలంలో సమూల మార్పులు రావాల్సిఉందని 68 శాతం మంది భారతీయులు అభిప్రాయపడ్డారు. ఆర్థికవృద్ధి కంటే ఆరోగ్యం, పర్యావరణ ఆధారిత అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని 81 శాతం మంది పేర్కొన్నారు.



## పెద్దపల్లి ఎంపీని కలిసిన నాయకులు

పెద్దపల్లి,రామగుండం(జనంసాక్షి)
పెద్దపల్లి ఎంపీగా ప్రమాణస్వీకారం చేయనున్న గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు సోమవారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటులో మంగళవారం ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ క్రమంలో పెద్దపల్లి నాయకులు ఎంపీని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బషీర్, వునుకొండ శ్రీధర్ పటేల్, మల్లిఖార్జున్ గౌడ్, హేమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానం



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):
వేములవాడలో అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రతి రోజు స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు, ఆకలితో అలమటించే అన్నార్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తోట లహరి అన్నారు.పల్లేర్ల శేఖర్,పార్వతి భీమేశ్ లాస్య, ఎద్దండి రాజు సరళ, సంవత్సర దాతలు తోట లక్ష్మిల సహకారంతో ప్రారంభించామని ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిత్యం జరుగుతుందని ఎవరైనా శుభకార్యాలు, పేదలకు అన్నదానం చేయాలనే సంకల్పం ఉన్నవారు ట్రస్టు నెంబర్ ను సంప్రదించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.సంస్థ సభ్యులు తోట రాజేష్,ఎద్దండి రాజు, కూరగాయల మధు, కోరేపు నరేష్, నేరెళ్ళ అఖిల్ గౌడ్, రవి ప్రిన్స్,రాజేష్, జితేందర్,తోట శ్రీకాంత్ పాల్గొన్నారు,

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రురమ సురేష్ రెడ్డి



మంథని, (జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా మంథని ప్రభుత్వ వైద్యశాలను సోమవారం మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెన్డ్రు రమా సురేష్ రెడ్డి పరిశీలించి పేషెంట్స్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలకు అధిక సంఖ్యలో బీదవారే వస్తారు కనుక వాళ్లను చూసుకునే బాధ్యత మనపై ఉందని తెలిపి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రిదుద్దిల్ల శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో మంథని ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలిగే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ తెలిపారు. నాగేంద్ర శంకర్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈఓ

కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి)
మానకొండూరు మండలంలోని పచ్చునూరు హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్.వి.ఎస్. జనార్దన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని తరగతులను తిరిగి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పంపిణీ చేయబడిన టెక్స్ట్ బుక్స్ , నోట్ బుక్స్, యూనిఫామ్స్ చెక్ చేసి అందరికీ వచ్చినాయా లేవా అని అందరికీ స్పష్టే చేయబడిందని తనిఖీ చేశారు. యూనిఫామ్, నోట్ బుక్స్, సకాలంలో ఇవ్వడం సంతోషకరమని అనంతరం ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి అకాడమిక్ పరంగా చేయవలసిన విధివిధానాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓతోపాటు అకాడమిక్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శీలా, ఉపాధ్యాయ బృందం, టిపిటిఎఫ్ అధ్యక్షులు పొరెడ్డి దామోదర రెడ్డి పాల్గొన్నారు.



# రాజకీయ బిక్షపెట్టిన బీఆర్ఎస్‌కు ద్రోహం చేస్తారా!

**ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలి**

**డిమాండ్ చేసిన నాయకులు**



మంథనిలో విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు..

**మంథనిలో..**
బీఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని మంథని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం మంథని పట్టణం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుండి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారడం సిగ్గుచేటని వారు తీవ్రంగా మండిపడ్డారు. జాగృతి అధ్యక్షురాలు కవిత అండతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. అధికార పార్టీలో చేరాలనుకుంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేరాలని అంతేతప్ప ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీలో చేరడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తక్షణమే బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు క్షమాపణ కోరాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వారు తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపులు ప్రోత్స హించే అధికార పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మం థని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్ కాయితి సమ్మయ్య, ఎంపీటీసీ చెరుకు తోట ఓదెలు, జనగామ సంతోష్, వేముల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ముస్తాబాద్‌లో...**
సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి నిరసిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో టిఆంఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు టిఆర్ఎస్ నేతలు కొమ్ము బాలయ్య. రాచమడుగు సంతోష్ రావు గూడూరు భరత్. చెవుల మల్లేష్. ఎండి నవాజ్ మనోహర్. శీలం స్వామి. శరయ్య నవీన్. నల్ల నరసయ్య .సతీష్. పద్మా రెడ్డి. యాది మల్లేష్ యాదవ దోరగల బాలయ్య. టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

**కమాన్పూర్‌లో..**
ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అప్రజాస్వామికంగా కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరశిస్తూ.. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం బీఆర్ఎస్ నాయకులు దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, ఏ. ఎం. సి మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మీమల్లు, బీ. ఆర్. ఎస్ సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్, నాయకులు ఎలాబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్, చొప్పరి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

**సిరిసిల్ల టౌన్‌లో..**
కాంగ్రెస్ పిసిసి ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన పక్కన పెట్టి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం నీచ రాజకీయమని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ మండిపడ్డారు, సిరిసిల్లలోని గాంధీ చౌక్ లో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కంచర్ల రవి గౌడ్ సాయి దీపక్, సికిందర్, కనుకుంట్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు



కమాన్‌పూర్..



ముస్తాబాద్..



సిరిసిల్ల టౌన్..

# సైన్స్‌ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థిని



**విద్యాసంస్థల అధినేత డా.ఇ.ప్రసాదరావు**

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :
పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన శుభశ్రీ సాహు తన శాస్త్రీయ ఆవిష్కరణకు గాను న్యూఢిల్లీలో జరగనున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు ఎంపికైంది.విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు మాట్లాడుతూ శుభశ్రీ తన మార్గదర్శి లలిత్ మోహన్ సాహు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో తన వినూత్న ప్రాజెక్ట్ 'మల్టీ ఫంక్షనల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషిన్' ను ప్రదర్శించారని దాని నుండి ఆమె రాష్ట్ర స్థాయికి ఎంపికైందని రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం 260 మంది విద్యార్థులు పాల్గొన్నారని మొత్తం 260 మందిలో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు ఎగ్జిబిషన్‌లో పాల్గొనడానికి కరీంనగర్ జిల్లా నుండి శుభ శ్రీ యొక్క ఏకైక ప్రాజెక్ట్‌తో సహా మొత్తం తెలంగాణ రాష్ట్రం నుండి 26 ప్రాజెక్ట్‌లు మాత్రమే ఎంపిక చేయబడ్డారన్నారు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి శుభశ్రీని అభినందించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు శుభశ్రీ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పారమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, ప్రాచీ, రమణ, రాకేష్ , వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ , గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు లు పాల్గొన్నారు.

# పాలన పక్కదారి..

- రామగుండంనగరపాలకసంస్థలో వాహనాల నిర్వహణలో లోపాలు
- వాటి జీవితకాలం పూర్తైన వినియోగం
- మరమ్మతులు చేయాల్సిన అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు
- సమస్యలు పరిష్కంచాలని కమిషనర్‌కు సంఘాల నాయకుల వినతి



గోదావరిఖని(జనంసాక్షి):
రామగుండం నగరపాలక సంస్థ అంటేనే రాష్ట్రంలో అవినీతికి చిరునామగా ముద్ర పడింది.పారిశుద్ధ్య విభాగంకు సంబందించిన వాహనాలు లేకున్నా, నడవకున్నా రికార్డులు చేసి అద్దెలు తీసుకోవడం, అద్దె వాహనాల నెంబర్లపైనే డీజిల్ వినియోగం బిల్లు పెట్టడం, కొనుగోళ్ల పేర కోట్ల రూపాయల ఓచర్ బిల్లులు, కొవిడ్ పేర జరిగిన కొనుగోళ్లలో అనేక అవకతవకలు జరిగినాయి, విజిలెన్స్ విచారణలు చెప్పట్టారు. అధికారులు మారినా, ఇప్పటికీ పారిశుధ్య విభాగంలో అదే అవకతవకలు, అదే అవినీతి, అవే తప్పుడు లెక్కలు, అవే పెట్రోల్,డీజిల్ కుంభకోణాలు జరుగుతుండడం బాధాకరం అని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, డిహెచ్పిఎస్ నాయకులు ఏంపి గౌస్ మద్దెల దినేష్‌లు సోమవారం రోజున కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ గారికి పలు సమస్యల పై విన్నవించారు.నగరపాలక సంస్థలో జరుగుతున్న వ్యవహారాలను అవినీతి అక్రమాల చూసి ప్రజలు చీదరించుకుంటున్నారుని అవేదన వ్యక్తం చేశారు. పైగా డ్రైవర్లకు హుకుం జారీచేస్తూ మానసికంగా వేధిస్తున్నారు.ట్రాలీలో పారిశుద్ధ్య విభాగం కొరకు నూతనంగా కొనుగోలు చేసి ఇంటి ఇంటికి చెత్త సేకరణ కోసం కొనుగోలు చేయడం జరిగిందిన్నారు. ట్రాలీల నిర్వహణ కూడా సరిగా లేదని, వాహనాలకు రిపేర్లు వస్తె డ్రైవర్లను వేదించడం సరికాదన్నారు. అవినీతిఅధికారి పై ఆరోపణలు ఉన్న ఆ అధికారిని ఎందుకు మార్చడం లేదని డిమాండ్ చేశారు.డ్రైవర్లను వేధించకుండా ట్రాక్టర్లను ఆటో ట్రాలీల నిర్వహణ ఎప్పటికప్పుడు చూసుకొని నూతన వాహనాలు కొనుగోలు చేయాలని, ఎలాంటి అవినీతికి పాల్పడని అధికారిని నియమించి నగరపాలక సంస్థ ఆధాయాన్ని పెంచుకోవాలి తప్ప నగరపాలక సంస్థ మరియు ప్రజల ఆదాయాన్ని అవినీతిపరుల ఖాతాలో పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని తమరికి తెలియజేస్తున్నాం.పారిశుద్ధ కార్మికులకు డ్రైవర్లకు, నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారికి ఇన్సూరెన్స్ చేయించాలని ఏఐటియుసి కాంట్రాక్ట్ కార్మిక సంఘం , డిహెచ్పిఎస్ పక్షాన నగరపాలక సంస్థ అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు.

# కబ్జాకోరులు ఖబర్దార్!

- పోచమ్మ గుడి మాన్యం ఆక్రమిస్తే జాగ్రత్త
- మంథని మత్స్యశాఖ అధ్యక్షులు క్రాంతి కుమార్



మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి రహదారిని ఆనుకొని ఉన్న పోచమ్మ దేవాలయాన్ని తరతరాలుగా బోయిన్ పేటలోని తెనుగు గూడెం, గొల్లగూడెం, దుబ్బ గూడెం, గంగాపురి, మంథని ప్రజలు ఆరాధ్య దైవంగా భావిస్తూ ఎటువంటి శుభకార్యాన్ని అయినా మొట్ట మొదలుగా పోచమ్మ కొలుపుతో మొదలుపెట్టి ప్రతి యేట వనభోజనాలు ఏర్పాటు చేసుకొని అతి పవిత్రంగా చూసుకునే ఇటువంటి స్థలాన్ని కొంతమంది రాజకీయ అండదండలతో పోచమ్మ గుడి మాన్యానికి సంబంధించిన బొక్కల వాగును ఆనుకుని ఉన్న భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారని కబ్జాదారులు ఖబర్దార్ అని మంథని మత్స్యశాఖ అధ్యక్షులు పోతార వేణి క్రాంతి కుమార్ హెచ్చరించారు. మంథని లో ఇటువంటి ప్రయత్నాలు చెల్లనేరవని బోయినపేట కు సంబంధించిన కుల పెద్దలు వెంటనే ఆ కార్యక్రమం పైన తీవ్ర స్థాయిలో మండి పడి కబ్జాను ఆపడం జరిగింది.. ఇకమీదట ఎవరైనా గుడి జోలికి వచ్చిన గుడి స్థలాల జోలికి వచ్చిన సహించేది లేదని ఎంతటి వారినైనా పోచమ్మ బలి తీసుకుంటుందని ఇకమీదట ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ గుడి మాన్యానికి ప్రహరీ గోడ నిర్మించి, వనభోజనాలకు తగిన సౌకర్యాలు చెట్లను పెంచడం, నీటి వసతి ఏర్పాటు చేసి, పోచమ్మ గుడి అభివృద్ధి చేసే విధంగా ప్రణాళిక రచించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అన్ని కులాల పెద్దలు పోతరవేని లక్ష్మిరాజం (అర్జున్), సబ్బని సమ్మయ్య,పోలు కనకరాజు,గుండా రాజు,కుంట బద్రి,మబ్బు నాగరాజు,పర్వవెన ఓదెలు, ఆర్కె రాజు,పర్వేవెన మోహన్,బంగారు మధునయ్య,మోసం కొమురయ్య,అంబటి కొమురయ్య,మోసం నర్సయ్య,అంబటి సత్తన్న,అంబటి నర్సింగ్,బత్తుల సత్యనారాయణ,బూర్ల శ్రీనివాస్,నల్లి శంకర్,నల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల్ బ్యూరో (జనంసాక్షి):
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసారు. జగిత్యాల పట్టణంలో డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేయుటకు, టీ అర్ నగర్ లో వివిధ కుల సంఘాల భవనాలకు స్థలం కేటాయించడం జరిగింది అని, జర్నలిస్టు లకు సైతం ఇండ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చే విషయం లో వారిని కోరడం జరిగింది అని, జగిత్యాల పట్టణానికి రావాలని కోరగా, వారం రోజుల్లో వచ్చి కలెక్టర్ ఆధ్వర్యం లో రివ్యూ చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని,అధికార పార్టీ తో కలిసి పని చేసే అవకాశం ముఖ్యమంత్రి కల్పించారని, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని,అన్ని వర్గాల ప్రజలు,నాయకులతో కలిసి పని చేసి జగిత్యాల అభివృద్ధి కి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు.







# ప్రాణంపోయిన పార్టీ మారను

- బిఆర్ఎస్ లోనే కొనసాగుతా
- వాళ్ళ స్వలాభం కోసమే పార్టీ మారుతున్నారు
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం, జూన్ 24,(జనం సాక్షి)
కోరుట్ల ప్రజల ఆశీర్వాదంతో బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గెలిచానని , ప్రాణం పోయినా పార్టీ మారే ప్రసక్తే లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్వసభ సమావేశంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతరుల లాగా తాను పార్టీ మారనని , పార్టీ మారిన ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి కోసం కాదని , కేవలం వారి స్వలాభం కొరకే మారుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో బిఆర్ఎస్ నాయకుల్ని సర్పంచ్ , ఎంపిటీసీ లుగా గెలిపించుకుంటామన్నారు.

## ఎంఈఓ డిఓపై చర్యలు తీసుకోవాలి

**- ఏబీవీపీ నాయకుల డిమాండ్**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
ఎంఈఓ డిఈఓ పైన చర్యలు తీసుకోవాలి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి నగర్ శాఖ ఆధ్వర్యంలో నేడు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఏబీవీపీ జిల్లా కన్వీన రోహిత్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలో పుస్తకాల అమ్ముతూ వారిని ఎవరు ఏం చేయలేరని అన్న ధీమాతో యదేచ్చగా విద్యార్థి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈ విషయమై డీఈఓ ఎంఈవో దృష్టికి తీసుకెళ్తే వారు నిమ్మకు నీరత్తినట్టు ప్రవర్తించిన పాపాన పోలేదన్నారు. ఈ విషయమై ఎన్ని సార్లు డిఇవో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కూడా వారు నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తున్నారని ఏమి పట్టనట్టు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికి కూడా ఎలాంటి లాభం లేకపోయేసరికి కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశామని తెలియజేశారు. ఆ తర్వాత కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చామని తెలియజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నటువంటి ఎంఈఓ డిఇఓ పైన చర్యలు తీసుకోవాలని, అలాగే విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేట్ యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. లేనియెడల ఏబీవీపీ దీనిపైన రాను రాను తీవ్రంగా ఉద్యమించడం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, వరుణ్, శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటెం స్పీకర్ ఎంపికలో నిబంధనలు పాటించలేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీలు నిరసకు దిగారు . పార్లమెంట్ పాతభవనం నుంచి కొత్త భవనం వరకు ర్యాలీ తీశారు. ప్రొటెం స్పీకర్ ఎంపిక విషయంలో రూల్స్ పాటించలేదంటూ అభ్యంతరం తెలిపారు. రాజ్యాంగం కాపీలను చేతుల పట్టుకుని గాంధీ విగ్రహం దగ్గర కాసేపు నిరసన చేపట్టారు. సోనియా గాంధీ,రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. మోదీ రాజ్యాంగానికి విలువ ఇవ్వడం లేదంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా మోదీ పాలన సాగిస్తున్నారంటూ ్రర్ అయ్యారు. అనంతరం రాహుల్ సహా కూటమి సభ్యులు లోక్ సభలోకి వెళ్లారు. మోదీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించారని..అందుకే అన్ని పార్టీల నేతలు నిరసనలు తెలుపుతున్నామనిఖర్గే అన్నారు.

# విద్యను వ్యాపారం చెయ్యొద్దు

- వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి
- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్



జమ్మికుంట, జూన్ 24 (జనంసాక్షి):
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అని మండలంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, మామూళ్లకు కక్కుర్తి పడి విద్యాధికారులు తనిఖీలు చేయడం లేదని ,రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడం సిగ్గుచేటు అని కొంతమంది సిబిఎస్ సిలబస్ అని పేరుతో దోపిడి చేస్తున్నారని దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న అక్రమ ఫీజుల వసూళ్లు, సెంట్రల్ సిలబస్ పేరుతో ఫీజుల దోపిడీ అనే అనేక అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని,ప్రైవేట్ పాఠశాలలలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురాకపోవడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో విద్యను వ్యాపారంగా చేశారని మండిపడ్డారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాల ఫీజు నియంత్రణచట్టం తీసుకురావాలని లేదంటే మండలంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి దొంతుల రాజకుమార్, బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి కైలాసకోటి గణేష్, దేవులపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# డబుల్ ఇళ్లు కేటాయించండి

గత ప్రభుత్వ హయాంలో డ్రాద్వారా ఎంపిక చేసిన తమకు తక్షణమే డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని రామగుండం నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులు పెద్దపల్లి కలక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పటి కలెక్టర్ ఆదేశించినా ఇప్పటివరకు ఇండ్లు అప్పగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సమ్మయ్య, జమీర్, దేవేందర్,రాజేష్,గోపి,మాధవి,చాయ,సుజాత,అనురాధపాల్గొన్నారు. -పెద్దపల్లి(జనంసాక్షి) :

# హిట్‌మ్యాన్ సునామీ

## 41 బంతుల్లో 92 పరుగులు చేసిన రోహిత్ శర్మ

### 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసి టీమిండియా



**టీ20 వరల్డ్‌కప్‌లోని సూపర్-8లో భాగంగా.. ఆస్ట్రేలియాతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో (41 బంతుల్లో 92 పరుగులు) ఊచకోత కోయడం వల్లే ఆస్ట్రేలియా ముందు భారత్ 206 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. అతనితో పాటు సూర్యకుమార్ (31), శివమ్ దూబే (28), హార్దిక్ పాండ్యా (27) కూడా మెరుగ్గా రాణించి.. జట్టుకి భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు.**

టీ20 వరల్డ్ కప్‌లో చివరి సూపర్ 8 మ్యాచ్‌లో టీమిండియా రెండొందలు కొట్టేసింది. సెయింట్ లూయిస్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ (92) శివాలెత్తిపోయాడు. ఆస్ట్రేలియా బౌలర్లను ఊచకోత కోశాడు. తన కెప్టెన్సీలో రెండు ఐసీసీ ట్రోఫీలు కాజేశారనే కసితోనేమో సిక్సర్లతో మోత మోగించాడు. దాంతో, పవర్ ప్లేలో టీమిండియా స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు పెట్టింది. ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో రికార్డు బ్రేక్ చేసిన హిట్‌మ్యాన్ ఔటయ్యాక సూర్యకుమార్ యాదవ్(31), వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా(27 నాటౌట్)లు మెరుపు బ్యాటింగ్‌తో అలరించారు. దాంతో, టీమిండియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 రన్స్ కొట్టింది. తద్వారా ఈ సీజన్‌లో భారీ స్కోర్ నమోదు చేసింది.

పొట్టి వరల్డ్ కప్‌లో బిగ్ ఫైట్‌గా అభివర్ణించిన పోరులో కెప్టెన్ రోహిత్ శర్మ(92 : 41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లు ) వీరవిహారం చేశాడు. తన మార్క్ షాట్లతో బంతిని స్టాండ్స్‌లోకి పంపిస్తూ షాన్‌దార్ ఇన్నింగ్స్ ఆడాడు. ఓపెనర్‌గా విరాట్ కోహ్లీ(0) మరోసారి సున్నాకే కోహ్లీ వెనుదిరిగినా ఒత్తిడికి లోనవ్వలేదు. తన పవర్ హిట్టింగ్‌తో ఆసీస్ బౌలర్ల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీశాడు. మిచెల్ స్టార్క్ వేసిన రెండో ఓవర్లో రోహిత్ ఓ రేంజ్‌లో రెచ్చిపోయాడు. వరుసగా.. 6, 6, 4, 6, బాది స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే భారత ఇన్నింగ్స్ 4.1 ఓవర్ వద్ద వాన మొదలైంది. పది నిమిషాల తర్వాత ఆట మొదలుకాగానే రోహిత్ తన బాదుడును కొనసాగించాడు.

**ఎవ్వరినీ వదల్లే..**

డబుల్ హ్యాట్రిక్ హీరో ప్యాట్ కమిన్స్, జంపా, స్టోయినిస్.. ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా ఉతికేశాడు. ఈ క్రమంలోనే 19 బంతుల్లో ఫిఫ్టీతో రికార్డు బద్ధలు కొట్టాడు. రన్ రేట్ 11కు తగ్గకుండా ఆడిన రోహిత్.. రిషభ్ పంత్ (1)తో కలిసి రెండో వికెట్‌కు 87 పరుగులు జోడించాడు. అయితే.. స్టోయినిస్ ఓవర్లో పంత్ బౌండరీ వద్ద హేజిల్‌వుడ్ చేతికి చిక్కడంతో ఆసీస్ ఊపిరి పీల్చుకుంది. ఆ కాసేపటికే సెంచరీకి చేరువైన రోహిత్‌ను మిచెల్ స్టార్క్ సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. అంతే.. బౌండరీల వర్షం వెలిసింది అన్నట్టు మిచెల్ మార్ష్ బృందం సంబురాలు చేసుకుంది.

**రెండు సిక్సర్లతో..**

హిట్‌మ్యాన్ ఔటయ్యాక.. సూర్య(31), శివం దూబే(24)లు బౌండరీలతో చెలరేగారు. వీళ్లిద్దరి దూకుడుతో 14 ఓవర్లోనే స్కోర్ 150 దాటింది. కానీ, ఆ తర్వాత హేజిల్‌వుడ్, జంపాలు కట్టుదిట్టంగా బంతులేశారు. అంతలోనే స్టార్క్ బౌలింగ్‌లో సూర్య వికెట్ పారేసుకున్నాడు. అనంతరం హార్దిక్ పాండ్యా(27 నాటౌట్), దూబేలు కాస్త నెమ్మదిగా ఆడడంతో స్కోర్ 200 దాటడం కష్టమనిపించింది. కానీ, స్టోయినిస్ వేసిన 19వ ఓవర్లో పాండ్యా వరుసగా రెండు సిక్సర్లతో మళ్లీ ఊపు తెచ్చాడు. దూబే ఔటైనా.. రవీంద్ర జడేజా(9 నాటౌట్) 20వ ఓవర్లో సిక్సర్‌తో టీమిండియా స్కోర్ 200లు దాటింది.

**50 ఫాస్టెస్ట్ ఫిఫ్టీ.. హిట్‌మ్యాన్**

: టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డు బద్ధలు కొట్టేశాడు. సెయింట్ లూయిస్‌లో ఆస్ట్రేలియా బౌలర్లను ఊచకోత కోసిన హిట్‌మ్యాన్ 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ప్యాట్ కమిన్స్ వేసిన 5 ఓవర్లో సిక్స్, ఫోర్, సింగిల్ తీసిన రోహిత్ యాభైకి చేరువయ్యాడు. దాంతో, తొమ్మిదో సీజన్‌లో వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేశాడు. రోహిత్ విధ్వంసంతో క్వింటన్ డికాక్(దక్షిణాఫ్రికా), అరోన్ జోన్స్(యూఎస్ఏ) పేరిట ఉన్న రికార్డు బద్దలైంది. టోర్నీ ఆరంభ పోరులో కెనడాపై జోన్స్ 22 బంతుల్లో యాభై కొట్టగా.. ఇంగ్లండ్‌పై డికాక్ సైతం 22 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. దాంతో, భారత జట్టు స్కోర్ రాకెట్ వేగంతో పరుగెట్టింది.

## ఆర్చరీ 'రెండింటి'లో బెర్తు ఖరారు



భారత ఆర్చర్లు ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్నారు. పురుషుల, మహిళల కేటగిరీలో విశ్వ క్రీడల బెర్తు సాధించి డబుల్ ధమాకా మోగించారు. సోమవారం వరల్డ్ ఆర్చరీ రాంకింగ్స్ విడుదల చేసింది. ఐదు పోటీల్లో భారత ఆర్చర్లు అర్హత సాధించారు. మహిళా, పురుష ఆర్చర్లు వ్యక్తిగత విభాగంలో.. మిక్సడ్ కేటగిరీలో క్వాలిఫై అయ్యారు. ఇక స్క్వాడ్ విషయాని కొస్తే.. తరుందీప్ రాయ్, ధీరజ్ బొమ్మదేవర, ప్రవీణ్ జాదవ్‌లు పురుషుల విభాగంలో పోటీ పడనున్నారు. మహిళల స్క్వాడ్‌లో సీనియర్ దీపికా కుమారి, యువకెరటాలు భజన్ కౌర్, అకింత భకత్‌లు విశ్వ క్రీడల బెర్తు దక్కించుకున్నారు.

**మిక్సడ్ ఈవెంట్‌లో..**

భారత పురుష, మహిళా ఆర్చర్ను మూడంచెల ఎంపిక దశను దాటి మరీ ఒలింపిక్స్ రేసులో నిలిచారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచి విశ్వ క్రీడలకు అర్హత సాధించారు. చైనా ఆర్చర్లు కూడా పురుషుల కేటగిరీలో ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యారు. మహిళల విభాగంలో ఇండోనేషియా ఆర్చర్లకు టీమ్ కోటా లభించింది. ప్రతి సెక్షన్‌లో 12 జట్లు పోటీ పడుతాయి. మిక్సడ్ ఈవెంట్‌లో ఐదు జట్లు టైటిల్ వేటలో తలపడుతాయి.

## కోచ్‌గా లక్ష్మణ్?

జింబాబ్వే పర్యటనకు పలువురు సీనియర్లను బీసీసీఐ పక్కన పెట్టనుంది. టీ20 వరల్డ్ కప్ ఆడుతున్నకెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాలతో పాటు సూర్యకుమార్ యాదవ్‌కు భారత బోర్డు విశ్రాంతి ఇవ్వనుంది. దాంతో, యువకులతో నిండిన జట్టును జింబాబ్వేకు పంపాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. ఇప్పటివరకూ ప్రధాన కోచ్ ఎవరో తేలలేదు. టీ20 వరల్డ్ కప్ ముగిసేలోపు గౌతం గంభీర్‌ను హెడ్‌కోచ్‌గా ప్రకటిస్తారో? లేదో తెలియదు. దాంతో, నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా కొనసాగుతున్న వీవీఎస్ లక్ష్మణ్ జింబాబ్వే సిరీస్‌కు కోచ్‌గా వ్యవహరించే చాన్స్ ఉంది.

## ఇర్ఫాన్ పఠాన్ 'మేకప్ బాయ్' మృతి

### ప్రమాదవశాత్తూ బలిగొన్న స్విమ్మింగ్ పూల్..



టీ20 వరల్డ్ కప్‌లో విషాదం నెలకొంది. భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మేకప్ ఆర్టిస్ట్ ప్రమాదవశాత్తూ మరణించాడు. మెగా టోర్నీ కోసం పఠాన్‌తో సహా వెస్టిండీస్‌కు వెళ్లిన ఫయాజ్ అన్సారీ అనకోకుండా స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోయి ఊపిరాడక చనిపోయాడు. స్నానం చేసేందుకు ఈత కొలనులో దిగిన అతడు అందులో మునిగిపోయాడు. జూన్ 12 శుక్రవారం ఈ సంఘటన జరిగినట్టు సమాచారం. ఊహించని పరిణామంతో ఇర్ఫాన్ షాక్‌లో ఉండిపోయాడు. ఫయాజ్‌ది ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నూర్. అతడికి రెండు నెలల క్రితమే పెండ్లి అయింది. ఈత కొలనులో మునిగి ఫయాజ్ మరణించాడనే వార్త తెలియగానే భారత్‌లోని అతడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ముంబైలో సెలూన్..**

స్వగ్రామం నుంచి ముంబైకి మాకం మార్చిన ఫయాజ్ అక్కడ సొంతంగా సెలూన్ ప్రారంభించాడు. అతడి సెలూన్‌కు ఇర్ఫాన్ పఠాన్ మేకప్ కోసం, హెయిర్ స్టయిలింగ్ కోసం తరచూ వెళ్తుండేవాడు. ఇర్ఫాన్‌కు ఫయాజ్ వర్క్ చాలా నచ్చింది. దాంతో, అతడిని తన వ్యక్తిగత మేకప్ ఆర్టిస్టిగ్ నియమించుకున్నాడు. ప్రస్తుతం కామెంటేటర్‌గా కొనసాగుతున్న ఇర్ఫాన్ అప్పటి నుంచి ఫయాజ్‌ను తన వెంట తీసుకెళ్లేవాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో.. ఇప్పుడు టీ20 వరల్డ్ కప్‌లో కోసం ఈ మాజీ ఆల్‌రౌండర్ తన స్టయిలిస్ట్‌తో సహా అమెరికా, వెస్టిండీస్‌లకు వెళ్లాడు. అయితే.. స్నానం చేసేందుకు ఈత కొలనులోకి దిగిన ఫయాజ్ అందులో మునిగిపోయి ప్రాణాలు విడిచాడు. దాంతో, ఫయాజ్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమయ్యే మొత్తం ఖర్చును ఇర్ఫాన్ భరిస్తున్నాడు. మరో రెండు మూడు రోజుల్లో ఫయాజ్ డెడ్ బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## శుభ్‌మన్‌కే కెప్టెన్సీ..

### జింబాబ్వే పర్యటన షెడ్యూల్



పొట్టి ప్రపంచకప్ ముగియకముందే భారత జట్టు మరో పొట్టి సిరీస్‌కు సన్నద్ధం కానుంది. మెగా టోర్నీ ముగిసిన వారంలోపే జింబాబ్వేలో టీమిండియా పర్యటించనుంది. ఇప్పటికే ఈ సిరీస్‌ను ఖరారు చేసిన భారత క్రికెట్ బోర్డు సోమవారం మ్యాచ్ తేదీలను వెల్లడించింది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్ గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను అజిత్ అగార్ నేతృత్వంలోని సెలెక్టర్లు వెల్లడించారు. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, రాంచీ టెస్టు హీరో ధ్రువ్ జురెల్‌లు చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్ 17వ సీజన్‌లో అద్భుతంగా రాణించిన కుర్రాళ్లు అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్, తుషార్ దేశ్ పాండేలు తొలిసారి బ్లూ జెర్సీ వేసుకోనున్నారు. సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ సైతం బృందంలో ఉన్నాడు. హరారే స్పోర్ట్స్‌క్లబ్ వేదికగా జూలై 6న జరిగే తొలి మ్యాచ్‌తో టీ20 సిరీస్ ఆరంభం కానుంది.

**భారత స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

**షెడ్యూల్ ఇదే..** భారత్, జింబాబ్వే జట్లు జూలై 6వ తేదిన తొలి మ్యాచ్ ఆడనున్నాయి. మొత్తం ఐదు మ్యాచ్‌లకు హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదిక కానుంది. జూలై 7 వ తేదీన రెండో టీ20, జూలై 10న మూడో టీ20, జూలై 13న నాలుగో టీ20, జూలై 14న ఐదో టీ20 జరుగనుంది. మధ్యాహ్నం 1 గంటకు మ్యాచ్‌లు షురూ అవుతాయి.





## పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరమ్ ఏకగ్రీవం

### మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షులు రవి ప్రకాష్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి) :**

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ అధ్యక్షతన యూనియన్ నిబంధనలు ఆర్టికల్-18 ప్రకారం పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరమ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయబడింది, షెడ్యూల్ ప్రకారం టిఎన్ జిఓ భవన్ అంతాయిపల్లి ప్రాంగణంలో నిర్వహించారు. నోటిఫై చేసిన పోస్టులకు ఒకే ఒక్క సెట్ నామినేషన్లు మాత్రమే వచ్చావి.పరిశీలన తర్వాత అన్ని నామినేషన్లు చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించబడ్డాయి. నిర్ణీత వ్యవధిలోపు ఎటువంటి నామినేషన్ ఉపసంహరించబడలేదు. మూడు సంవత్సరాల కాలానికి అంటే 2024 - 2027 వరకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కేంద్ర కార్యవర్గ సభ్యుడు, శశికాంత్ రెడ్డి ప్రకటించారు. అధ్యక్షులుగా కె.భాస్కర్ పిఎస్ జిపి మునీరాబాద్, కార్యదర్శిగా డి.వేణు గోపాల్ రెడ్డి పీఎస్ జీపీ అవుషాపూర్, కోశాధికారిగా ఎన్.వెంకట రమణారెడ్డి పి ఎస్ జీపీ శ్రీరంగవరం, ఉపాధ్యక్షులుగా పి. శోభా రాణి పీఎస్ జీపీ లక్ష్మాపూర్, సంయుక్త కార్యదర్శిగా బి.సురేష్ రెడ్డి పీఎస్ జీపీ గోదుమకుంట, కార్యనిర్వక కార్యదర్శిగా కె.మోహన్ సింగ్ పిఎస్ జిపి ఉద్దమర్రి, ప్రచార కార్యదర్శిగా టి.మలికార్జున్ పిఎస్ జిపి కేశ్వాపూర్ కార్యనిర్వాహక సభ్యుడుగా ఎస్.శిరీష్ పీఎస్ జీపీ బడేగూడ కార్యనిర్వాహక సభ్యుడు బి.సుచిత శామ్యూల్ పీఎస్ జీపీ మాధవరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర ఫోరమ్ అధ్యక్షులు మహేష్, కార్యదర్శుల రంగారెడ్డి జిల్లా ఫోరమ్ అధ్యక్షులు శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి శభరత్ కుమార్, కోశాధికారి ఈఎస్ఎస్ గిరికాంత్, పంచాయతీ కార్యదర్శులందరూ పాల్గొన్నారు.

### బిజెఎంసి కౌన్సిల్ సమావేశంలో

## రూ.51.11.35 కోట్లతో పనులకు ఆమోదం




**రాజేంద్రనగర్ జూన్ 24 (జనం సాక్షి) :**

బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం మేయర్ లతా ప్రేమ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు గానూ రూ.5111.35 కోట్లతోకౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అభివృద్ధి పనులు గా బిటి రోడ్లు రూ.88.00 లక్షలు. 63 విడిసిసి రోడ్లకై రూ.1089.70 లక్షలు 98 యుజిడి పనులు 1790.90 లక్షలు,24 కమ్యూనిటీ హాల్స్ 805 లక్షల 4 పార్కులు 130 లక్షలు, 65 ఇతర పనులు 1207.75 లక్షలుగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సమావేశం లో డిప్యూటీ మేయర్ పి.రాజేందర్ రెడ్డి, కమీషనర్ బి.శరత్ చంద్ర కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు, విద్యుత్ శాఖ , జలమండలి అధికారులు పాల్గొన్నారు.

**నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తాం : మేయర్ లతా ప్రేమ్ గౌడ్**

కార్పొరేషన్ లో ముఖ్యంగా నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించే విధంగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు వివరించామని దీనికోసం హిమాయత్ సాగర్ వెదర్ ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్ ప్రజలకు నీరు అందిస్తామన్నారు. ఈ సాధారణ కాన్సిల్ బడ్జెట్లో మంచినీటి సమస్యతో పాటు మాలిక వసతుల అభివృద్ధి పనులు శరవేగంగా జరిపిస్తామన్నారు. కార్పొరేషన్ ప్రజలకు నల్ల కనెక్షన్ ఉన్నవాళ్లు అందరూ క్యాన్ నెంబర్ తీసుకొని తమ, తమ బిల్లులు చెల్లించాలని ఆమె అన్నారు. కౌన్సిల్ సమావేశంలో మొహం చాటేసిన ఆ నలుగురు సోమవారం కౌన్సిల్ సమావేశం లో మాజీ మేయర్ బి. మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు సాగర్ గౌడ్, శ్రీలత, పద్మావతి లు ఒక గంట ముందే కార్పొరేషన్ కార్యాలయం చేరుకొని పాల్గొన్నట్టు సంతకాలు చేసి కౌన్సిల్ సమావేశంలో పాల్గొనక గైరాజరయ్యారు. ఈ విషయంపై గత నాలుగున్నర సంవత్సరాలుగా మాజీ మేయర్ గా మహేందర్ గౌడ్ ఉండి, నూతన మేయర్ ఎన్నికైన మొదటి కౌన్సిల్ సమావేశంలో బాధ్యతగా పాల్గొనక పోవడంపై కార్పొరేషన్ లో పెదవి విరస్తున్న కౌన్సిల్ సమావేశం లో పాల్గొన్న కార్పొరేటర్లు.

## నిరుద్యోగ యువతకు కల్పవృక్షం బీసీ స్టడీ సర్కిల్

- 14 ఏళ్లలో ప్రభుత్వ ఉద్యోగాలకు 655 మంది ఎంపిక
- ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు దీటుగా బీసీ స్టడీ సర్కిల్





**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):**

సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1లో జాబ్ కొట్టాలంటే గతంలో హైద్రాబాద్ లో ఆర్ సి రెడ్డి, ఢిల్లీలో రావుస్ లాంటి ప్రముఖ కోచింగ్ సెంటర్లలో తర్ఫీదు పొందాల్సిందే. దశాబ్దం క్రితం వరకు అవి ఎక్కడున్నాయో నిరుపేద యువతకు తెలిసేది కాదు. ఇప్పుడు ట్రెండ్ మారింది. నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు దీటుగా స్టడీ సర్కిల్లో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధిస్తున్నారు.

**2010లో ఖమ్మంలో ఏర్పాటు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరుపేద బీసీ విద్యార్థుల కోసం 2010 సంవత్సరంలో బీసీ స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేశారు. 2014లొ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత స్టడీ సర్కిల్ కోసం సుమారు ఎకారం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. రూ.3.5 కొట్ల తొ ఆధునాతమైన భవనాలు నిర్మించారు. 2022 నుంచి స్టడీ సర్కిల్ కార్యకలాపాలు ఇక్కడ నుండే సాగుతున్నాయి.

**నిరుద్యోగులకు ఉద్యోగాలు**

స్టడీ సర్కిల్ ఏర్పాటు నుండి ఇప్పటివరకు దీనిలో పదివేల మందికి పైగా నిరుద్యోగులు తర్ఫీదు పొందారు. ఈ స్టడీ సర్కిల్ లో శిక్షణ పొందిన నిరుద్యోగుల్లో 655 మంది యువత వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 3000 మంది యువత ప్రైవేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల మినహా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే నిర్వహించే ప్రతి నోటిఫికేషన్ కు స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన వారికి ఇక్కడ ప్రత్యేక శిక్షణ అందిస్తారు. ప్రతి వారం, నెల మోడల్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన డిజిటల్ లైబ్రరీ విద్యార్థులకు జ్ఞాన బండాగారంగా మారింది.




**సొంత స్టడీ మెటీరియల్**

బీసీ వెల్ఫేర్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ బాల మాయాదేవి ఈ స్టడీ సర్కిల్స్ పై ప్రత్యేక దృష్టి సారించారు. తెలుగు అకాడమీ సహకారంతో విద్యార్థులకు అవసరమైన పాఠ్యప్రణాళికను సొంతం గా తయారు చేయించి విద్యార్థులకు అందిస్తున్నారు. దీనితోపాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రముఖ కోచింగ్ సెంటర్ల నుంచి నాణ్యమైన మెటీరియల్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నా రు. నోటిఫికేషన్ లో పేర్కొన్న సిలబస్‌కు అనుగుణంగా అవసరమై న మేరకు పోటీ పరీక్ష పుస్తకాలను తయారు చేయిస్తున్నారు. ఈమెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.. జి . శ్రీలత, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ , ఖమ్మం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలను విద్యార్థుల కోసం ఖర్చు చేస్తోంది. నిరుద్యోగ పేద యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. త్వరలో హాస్టల్ వసతిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హాస్టల్ వసతి ఏర్పాటు అయితే స్టడీ సర్కిల్ ప్రమాణాలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. ఇది ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు ఎంతో మేలు చేస్తుంది.

## గత మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లు అమలు చేస్తాం

- గత మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లు అమలు చేస్తాం
- కరెంట్ షాక్ తో మరణించిన వారికి తగు న్యాయం చేస్తాం
- సబ్ స్టేషన్‌ల స్థాయిలో కమిటీలు వేసి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం
- విద్యుత్ శాఖ అధికారుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మల్లు



**నాగర్‌కర్నూల్, జూన్ 24 (జనం సాక్షి) :** ఎన్నికల కోడ్ మూలంగా ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లా వాసులు 2500 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకుంటే జీరో బిల్లు సౌకర్యాన్ని పొందలేకపోయారు, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసింది ఆ రెండు ఉమ్మడి జిల్లాల వాసులకు గత మార్చి నుంచే జీరో విద్యుత్ బిల్లు అమలు చేస్తాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సోమవారం ఆయన నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన ఐదు జిల్లాల ట్రాన్స్కో ఎస్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ మూలంగా పొందలేకపోయిన జీరో బిల్లును మార్చి నుంచి అమలు చేస్తాం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారి మాదిరిగానే లబ్ధి చేకూరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఇప్పటికే 200 యూనిట్ల లోపు విద్యుత్ సరఫరా వినియోగించుకొని కరెంటు బిల్లు చెల్లించి ఉంటే వారి నగదు మొత్తాన్ని అకౌంట్లో ఉంచుతాం. ఎప్పుడైనా 200 యూనిట్లకు మించి వాడుకున్న సమయంలో వారి అకౌంట్లో ఉన్న నగదును వినియోగించుకుంటామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువగా విద్యుత్తు సరఫరా చేసాం, గాలి, వాన అన్నిటినీ ఎదుర్కొని మీరు సేవలందిస్తున్నారు అయినా విద్యుత్ శాఖ పై కొద్ది మంది దుష్ప్రచారం చేస్తున్నారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనికి వెనుక గ్రామస్థాయిలో రాజకీయ కారణాలు ఒక అంశం కాగా, విద్యుత్ శాఖలోని కింది స్తాయి సిబ్బంది ఆ ప్రచారాలకు ఊ తమిస్తున్నారని తెలిపారు. కరెంట్ షాక్ తో మరణించిన వారికి పరిహారం అందించడంలో విద్యుత్ శాఖ విఫలం అవుతుందని వినిపిస్తోంది, త్వరలో దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ వైర్లు, స్తంభాలు వంగిపో యీా ఉన్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యేలు ఫోన్ చేసి సమస్య చెప్పినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలి, సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇంధన శాఖ సీఎం డి ఎస్ఎంఏ రిజ్వీ, టిజిఎస్పీడిసిఎల్ సిఎండి ముషారాఫ్ అలీ ఉమ్మడి ఎమ్మెల్యేలు శ్రీహరి, వంశీకృష్ణ, మెగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 జూన్ 2024

# ఉమ్మడి జిల్లాలో నేతల వలసలపై సర్వత్రా ఉత్కంఠ



## అనూహ్యంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పోచారం, సంజయ్ కుమార్..

- సంజయ్ చేరికతో అలకబూనిన సీనియర్ నేత జీవన్‌రెడ్డి
- సమాచారం ఇవ్వకుండా చేర్చుకోవడమేంటని ఆగ్రహం
- పార్టీకి రాజీనామా చేస్తారని సోషల్‌మీడియాలో చర్చ
- మరోవైపు జీవన్‌రెడ్డిని ఆది శ్రీనివాస్ బుజ్జగిస్తున్నట్టు సమాచారం!
- త్వరలో బీజేపీ నేత ఈటలను కలుస్తారని చర్చ?
- హాట్‌హాట్‌గా 'నిజామాబాద్' పాలిటిక్స్..





**నిజామాబాద్/జగిత్యాల బ్యూరో,జూన్ 24 (జనంసాక్షి):** రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు వేగంగా జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరగా.. మరుసటి రోజే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే.. అయితే సంజయ్ చేరికపై రాజకీయ దుమారం నెలకొంది. తనకు తెలియకుండా సంజయ్‌ను పార్టీలో ఎలా చేర్చుకుంటారని స్థానిక సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డితో పాటు ఆయన వర్గీయులు వ్యతిరేక గళం వినిపిస్తున్నట్టు తెలుస్తోంది. సంజయ్ చేరిక అంశం గురించి స్థానిక నేతలతో చర్చించడంతో పాటు హైదరాబాద్ వెళ్లి అధిష్టానంతో మాట్లాడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. మొత్తంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పాలిటిక్స్ హాట్ టాపిక్‌గా మారాయి.

స్థానిక నేత జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నేత. జగిత్యాల నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించడంతో పాటు గత వైఎస్ హయాంలో రోడ్లు, భవనాల శాఖా మంత్రిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా, పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ నేపథ్యంలోనే జగిత్యాలలో మరో నేతకు అవకాశం లేకుండా సంజయ్ వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌లో చేరారని పలువురు చర్చించుకుంటున్నారు.మరోవైపు పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రం తన తనయుడి రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారారని చర్చించుకుంటున్నారు.

### కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తారని ప్రచారం..!

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిక అంశం ఆ పార్టీలో చిచ్చు రేపింది. జీవన్‌రెడ్డి అలకబూనినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవికి జీవన్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై తన అనుచరులు, పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గంలో 2014 నుంచి మూడు పర్యా యాలు సంజయ్, జీవన్‌రెడ్డి ప్రత్యర్థులుగా కొనసా గుతున్నారు. 2023 ఎన్నికల్లోనూ వీరిద్దరే పోటీప డ్డారు. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయన్ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని వారు కోరినట్లు సమాచారం. 40 ఏళ్లు గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని.. పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

### త్వరలో బీజేపీ నేతలు బండి, ఈటలను కలుస్తారని చర్చ?

అలకబూనిన జీవన్‌రెడ్డి.. తన అనుచరుల ఫోన్ ఎత్తకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే జీవన్ రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేస్తున్నాయి. జీవన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ వార్తలపై జీవన్‌రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు.



## తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

- శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబిక అమ్మవారి ఆశీస్సులుండాలని ఆకాంక్ష
- శ్రీశైలం హైడల్ ద్వారా పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తికి చర్యలు
- తెలంగాణలో రెప్పపాటు కూడా కరెంటు కోతల్లేవు
- శ్రీశైలం పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**శ్రీశైలం/నాగర్‌కర్నూల్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి):** ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంభిక అమ్మవారి ఆశీస్సులు ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో పాటు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్, మెగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్నం శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. కరువు లేకుండా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలన్నారు. వానలకు వరదలు రాకముందే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టును పరిశీలించి, విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఇక్కడికి వచ్చినట్టు చెప్పుకొచ్చారు. నాటి కాంగ్రెస్ పెద్దలు ముందుచూపుతో నిర్మించిన ఈ బహుళార్ధక సార్ధక ప్రాజెక్టుతో మనందరి జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవన్న భట్టి.. 2029-30వరకు కావాల్సిన విద్యుత్ అందుబాటులో ఉందన్నారు.

## సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరాఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 'నేషనల్ స్కిల్ అకాడమీ' ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలనుకునే ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్, బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజిమెంట్, బ్లాక్ చైన్, డీప్ లెర్నింగ్, సాస్, సెలీనియం, సేల్స్ ఫోర్స్, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, జావా, ఒరాకిల్ లాంటి 50కి పైగా కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణతో పాటు ప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు www.nationalskillacademy.inలో ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9505800050ను సంప్రదించాలన్నారు.



## ఈశ్వరమ్మకు చిన్నారెడ్డి పరామర్శ

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన ఆదివాసీ మహిళ కాట్రాస్ ఈశ్వరమ్మను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ జీ.చిన్నారెడ్డి పరామర్శించారు. సభ్య సమాజం తలదించుకునేలా మానవ మృగాల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో చిన్నారెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. సంఘటన పూర్వాపరాలను ఈశ్వరమ్మ భర్త ఈదన్నను అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

**నిజామాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** అన్ని వర్గాలకు పెన్షన్లను ఇస్తున్నారు. దీంతో అందిరలో ఆశలు కలుగుతున్నాయి. అలాగే ఇచ్చే పెన్షన్లు భారీగా పెంచింది. ఇప్పుడు ఇంటి కోసం ఐదు లక్షలు ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో తామూ అర్హులైన వారమేనంటూ పలువురు మండల కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు చేతబట్టుకొని తిరుగుతున్నారు. బీడీ కార్మికుల్లో అధికశాతం నిరక్షరాస్యులుండడంతో ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ నమోదై లేకపోవడం, అలాగే పీఎఫ్ ఖాతాలో ఒక పేరు, ఆధార్‌కార్డుల్లో మరొక పేరు ఉండడంతో పింఛన్ల కోసం దరఖాస్తు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఆధార్‌కార్డుల్లో మార్పుల కోసం బీడీ కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. మార్పుల కోసం మీసేవ కేంద్రాలకు నేరుగా వెళ్తే నిర్వహకులు ధ్రువీకరణ పత్రాల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోతున్నారు. దీంతో దళారులను ఆశ్రయించి వేలాది రూపాయలు ముట్టజెప్పుతున్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సిబ్బంది ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుని పక్కన పెడుతున్నారు.

## మంత్రి పొన్నం చొరవతో బస్సు సర్వీసు ప్రారంభం

- తీరిన ప్రయాణికులు, విద్యార్థుల ఇక్కట్లు..



**భీమదేవరపల్లి, జూన్ 24 (జనం సాక్షి):** మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ముాలుకనూర్ మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం కట్కూర్, కన్నారం మల్లారం, వయా రసూల్ పల్లె కొత్తకొండ, ముస్తాపూర్, గటనర్సింగాపూర్, వెళ్లే ముల్కనూర్ బస్టాండ్‌లో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. కొన్ని రోజులుగా బస్సు రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొం టున్న సమస్యను స్థానికులు మంత్రి పొన్నంను కలిశారు. వెంటనే స్పందించిన మంత్రి హనుమకొండ డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రయాణికులు,స్కూల్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిపో డిఎం ధర్మసి, ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆదరి రవి, ఉస కోయిల ప్రకాష్, మహిళా మండల అధ్యక్షురాలు చిదురల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి నేరుగా రైతుల ఖాతాల్లోకే పరిహారం

### నిమ్స్ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మీ

'డబ్బులిప్పిస్తాం.. మాకెంతిస్తారు?' కథనానికి స్పందన


డబ్బులిప్పిస్తాం.. మాకెంతిస్తారు..!
నిమ్జ్ భూ బాధితుల నుంచి వసూళ్ల పర్వం



**న్యాల్ కల్, జూన్ 24, (జనం సాక్షి):** "డబ్బులిప్పిస్తాం.. మాకెంతిస్తారు?" పేరున సోమవారం 'జనం సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జహీరాబాద్ నిమ్స్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. ఇకనుండి నిమ్స్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు నష్టపరిహారం నేరుగా వారి వ్యక్తిగత ఖాతాలోనే వేయనున్నట్లు తెలిపారు. వివిధ కారణాలతో కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూనిర్వాసితులకు మాత్రం రైతులకు నేరుగా గ్రామసభలను ఏర్పాటు చేసి వారి చేతికి చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్స్ ప్రాజెక్టుపై వస్తున్న అవినీతి, ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన అధికారులు, మధ్య దళారులపై సైతం చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.మధ్య దళారులను ఆశ్రయించకుండా భూ నిర్వాసితులు నేరుగా కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని కోరారు. న్యాల్ కల్ మండలంలోని గణేష్ పూర్ గ్రామానికి చెందిన ఏవన్, సీమన్ ఇద్దరు రైతుల వద్ద నుండి రూ:15 లక్షల చొప్పున రూ:30లక్షలు మేర నష్టపోయిన బాధిత కుటుంబాలతో పాటు, వారి వద్ద నుండి వసూలు చేసిన మధ్య దళారీ పై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.



## కేసీఆర్‌కి ఎంపీ వద్దిరాజు ధన్యవాదాలు

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్టీ అధినేత, తెలం గాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర రావును కలిసి హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలిపారు. కేసీఆర్‌ని ఎంపీ రవిచంద్ర సోమవారం సాయంత్రం ఎర్రవల్లిలోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛమిచ్చి హృదయ పూర్వక ధన్యవాదాలు చెప్పారు.




## స్నేహితుని కుటుంబానికి ముజీబ్ వెన్నుదన్ను..

**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.హు స్సేనీ (ముజీబ్) ఈ రోజు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయములో ఆర్థిక సహాయం చేసారు. ఈ సంద ర్భంగా డాక్టర్ ముజీబ్ గారు మాట్లాడుతూ తన చిన్ననాటి స్నేహితుడైన శ్రీ రఘు గారు రెండు సంవత్సరముల క్రితం అనుకోని పరిస్థితులలో మరణించాడని, గత సంవత్సరం అతని భార్య కూడా మరణించందని వారి ఏకైక కుమార్తె దివ్య దిక్కులేకుండా అయ్యిందని బాధపడ్డారు మిత్ర ధర్మం ఆచరించి దివ్య యొక్క ఆలనాపాలనా తాను తన కుటుంసభ్యులు భాద్యత తీసుకుంటాము, దివ్య చదువుతో పాటు వివాహ భాద్యత కూడా తమదే నని అభయం ఇచ్చారు ఈ సందర్భంగా ఒవైసి కాలేజీలో చదువుతున్న దివ్య రెండేవ సెమిస్టర్ ఫీజు ముప్పై ఐదు వేలకు చెక్కు ఇచ్చారు. ఈ కార్యక్ర మములో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్‌తో పాటు కేంద్ర సంఘ జిల్లా సంఘ కార్యవర్గం పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370